


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




# అమరావతి ఐ ప్రాజెక్టుకు పచ్చజెండా

- పారిశ్రామిక, సాగునీటి రంగాలకు ప్రోత్సాహం
- పాత పెన్షన్ పునరుద్ధరణ, రిటైర్మెంట్ వయసు పెంపు
- 'బీచ్ షాక్స్' పాలసీకి గ్రీన్ సిగ్నల్
- పలు కీలక నిర్ణయాలకు ఏపీ కేబినెట్ ఆమోదం

2

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు చరిత్రాత్మక నిర్ణయాలకు వేదికైంది. సచివాలయంలో సుమారు మూడు గంటల పాటు సాగిన భేటీలో అటు ఉద్యోగ వర్గాల్లో హర్షాతిరేకాలు నింపుతూ, ఇటు రాష్ట్ర ఆర్థిక, పర్యాటక రంగాలకు సరికొత్త జవసత్వాలు అందించే కీలక తీర్మానాలకు ఆమోద ముద్ర వేసింది. సీపీఎస్ నోటిఫికేషన్ వివాదంలో ఉన్న ఉద్యోగులకు పాత పింఛను వర్తింపు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంపు వంటి నిర్ణయాలతో ఉద్యోగులకు పెద్దపీట వేసిన ప్రభుత్వం గోవా తరహాలో రాష్ట్రంలో బీచ్ షాక్స్ పాలసీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రతిష్టాత్మక 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జీవనాడి పోలవరం పనుల వేగవంతం, అమరావతి 'క్వాంటం వ్యాలీ'కి వంద శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు, వైద్య రంగంలో పారదర్శకత కోసం కేంద్ర అవయవ మార్పిడి చట్టం-2011 అమలు వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలతో కూడిన సమగ్ర ప్రగతి రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేసింది.



## సైకిల్ సవారి చేద్దాం

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు... ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులను పొదుపుగా వినియోగించడం అవసరం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ-సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను.

– ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ట్వీట్

### నిరుద్యోగులకు తీపి కబురు

## నేడే ఏపీ టెట్ నోటిఫికేషన్

పరీక్షల షెడ్యూల్ ప్రకటించిన మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు విద్యా శాఖ కీలక ప్రకటన చేసింది. టెట్-2026 పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా గురువారం వెల్లడించారు.

### టెట్ షెడ్యూల్ ఇదే

**నోటిఫికేషన్:** జూన్ 5
**దరఖాస్తులు:** జూన్ 5 - జూలై 5 వరకు
**హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** జూలై 25 నుంచి
**పరీక్షల నిర్వహణ:** ఆగస్టు 5 - 21 వరకు
**టెట్ ఫలితాలు:** సెప్టెంబరు 15

### పెట్టుబడిదారులుగా కాదు..


## భాగస్వాములుగా రండి

**సెయింట్ పీటర్స్‌బర్గ్ బిజినెస్ ఫోరమ్‌లో ఐటీ మంత్రి నారా లోకేష్ పిలుపు**

భారత్-రష్యా దేశాల మధ్య ఉన్న అనుబంధం కేవలం వ్యాపార ఒప్పందాలకో, దౌత్య పరిధులకో పరిమితమైంది కాదని.. కాలపరీక్షకు నిలిచిన ఒక అనిర్వచనీయమైన దృఢ బంధమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మూడో రోజు పర్యటనలో భాగంగా ఆయన 'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్' (SPIEF) సదస్సులో ఏపీ ప్రతినిధిగా పాల్గొన్నారు. కేవలం పెట్టుబడిదారులుగా కాకుండా, ఏపీ అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా రావాలని రష్యన్ పారిశ్రామికవేత్తలను సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌ను $2.5 ట్రిలియన్ డాలర్ల బృహత్తర ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఈ ప్రగతి ప్రస్థానంలో అంతరిక్ష, ఏరోస్పేస్, సెమీ కండక్టర్ రంగాలలో కీలక భాగస్వామ్యం వహించాలని రష్యన్లకు లోకేష్ పిలుపునిచ్చారు.

3



## విశాఖలో నేడు సీఎం పర్యటన

- సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ ఎగుమతులపై సదస్సుకు హాజరు
- విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై అధికారులతో సమీక్ష
- సైకిల్‌పై ప్రయాణించనున్న చంద్రబాబు

- వివరాలు 2 లో..

## నవ్యాంధ్ర పర్యాటకానికి "గ్లోబల్" కిరీటం"



- బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్
- గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ 2026 వేదికగా అవార్డు
- స్వీకరించిన పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- ఇది ఏపీ ప్రజల సంయుక్త కృషికి దక్కిన గుర్తింపు

వివరాలు 10 లో..



## రాజ్యసభ సీట్లపై కుదిరిన ఒప్పందం

టీడీపీకి 3, జనసేనకు 1 సీటు

తిరుపతి, అమరావతి, విశాఖల్లో బహిరంగ సభలు

కూటమి నేతలతో సీఎం చంద్రబాబు భేటీ

- వివరాలు 2 లో..

చైతన్యరథం

# ‘అమరావతి ఐ’ ప్రాజెక్టు టెండర్లకు పచ్చజెండా

- పారిశ్రామిక, సాగునీటి రంగాలకు ప్రోత్సాహం
- పాత పెన్షన్ పునరుద్ధరణ, రిటైర్మెంట్ వయసు పెంపు
- ‘బీచ్ షాక్స్’ పాలసీకి గ్రీన్ సిగ్నల్
- పలు కీలక నిర్ణయాలకు ఏపీ కేబినెట్ ఆమోదం



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సుమారు మూడు గంటల పాటు సాగిన భేటీలో పారిశ్రామిక ప్రగతి, ఉద్యోగుల సంక్షేమం, పర్యాటక రంగాలే లక్ష్యంగా పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు.

**ఉద్యోగులకు భారీ ఊరట:** సీపీఎస్ అమల్లోకి రాకముందు విడుదలైన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికై, వివిధ కారణాల వల్ల సీపీఎస్ అమలు తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు పాత పింఛను విధానాన్ని వర్తింపజేయాలని నిర్ణయించారు.

**ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు:** ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పనిచేస్తున్న వారి ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచారు.

### పర్యాటక రంగంలో సరికొత్త విప్లవం: ‘బీచ్ షాక్స్’ పాలసీ

పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేసి ఏపీలో ‘బీచ్ షాక్స్ పాలసీ’ని తీసుకువచ్చారు. తొలి దశలో విశాఖపట్నం, భీమిలి, శ్రీకాకుళం, చీరాల బీచ్‌ల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారు. ఈ బీచ్ షాక్స్‌లను కేవలం ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే తెరవడానికి అనుమతిస్తారు. ఇందులో పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్ అయితే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తారు.

### అవయవ మార్పిడిలో పారదర్శకత: కేంద్ర చట్టానికి గ్రీన్ సిగ్నల్

తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ‘ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం-2011’ (కేంద్ర చట్టం) అమలుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు సూచనల మేరకు, అవయవ మార్పిడి ప్రక్రియలో అవినీతిని అరికట్టి పారదర్శకతను పెంచడం, వైద్య సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

### రాజధాని అమరావతి, పోలవరం మౌలిక వసతులు

కృష్ణా నదీ తీరాన్ని పర్యాటకంగా, ఆర్థికంగా సరికొత్తగా ఆవిష్కరించే ప్రతిష్టాత్మక ‘అమరావతి ఐ’ ప్రాజెక్టు టెండర్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలనా అనుమతులు లభించాయి.

**క్వాంటం వ్యాలీకి రాయితీలు:** అమరావతి క్వాంటం వ్యాలీకి కేటాయించిన భూముల రిజిస్ట్రేషన్‌పై 100% స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపునకు ఆమోదం తెలిపారు.

**ప్రాజెక్టులకు నిధులు:** జీవనాడి పోలవరంతో పాటు రాష్ట్రంలోని ఇతర కీలక సాగునీటి ప్రాజెక్టుల పనుల వేగవంతానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు.

### పారిశ్రామిక, మత్స్య, ఇంధన రంగాల నిర్ణయాలు

‘ఏపీ రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ-2025’ ముసాయిదాకు ఆమోదం లభించింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటు బాధ్యతలను ‘ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్’కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**ఏపీ ఏవియేషన్ పాలసీ-2026:** విమానయాన రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చేలా సరికొత్త ఏవియేషన్ పాలసీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**సోలార్ పవర్ ప్లాంట్:** చిత్తూరు జిల్లాలోని వ్యవసాయ శాఖ భూమిలో పీఎం-కుసుమ్ పథకం కింద సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు వీలుగా NREDCAP సంస్థకు 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు అనుమతించారు.

**పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు హామీ:** హడ్కో నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు వీలుగా ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చింది.

### ఇతర ముఖ్య నిర్ణయాలు:

గ్రామీణ ప్రాంతాల్లో VB-GRAMG: కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం‘వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్’ (VB-GRAMG)ను వచ్చే జూలై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేయాలని నిర్ణయించారు.

**అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట:** అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా 21 కొత్త పోస్టుల మంజూరుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీ:** భూసేకరణ, వివాదాల పరిష్కారానికి సంబంధించిన నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీ సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## విశాఖలో నేడు సీఎం పర్యటన


- సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ ఎగుమతులపై సదస్సుకు హాజరు
- విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై అధికారులతో సమీక్ష
- ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైకిల్‌పై ప్రయాణించనున్న చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై విశాఖలో నిర్వహించే జాతీయ సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరు కానున్నారు. శుక్రవారం ఆయన విశాఖ నగరంలో పర్యటించనున్నారు. సీఎం అమరావతిలోని క్యాంపు కార్యాలయం నుంచి ఉదయం 8.30 గంటలకు బయల్దేరి పది గంటలకు విశాఖలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్స్‌కు చేరుకుంటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెట్ జీరో కార్యక్రమంలో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం వద్ద మొక్క నాటతారు. అనంతరం సైకిల్ పై బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్లో జరిగే నేషనల్ సీఫుడ్ ఎక్స్ పోర్ట్స్ వర్క్‌షాప్‌నకు హాజరవుతారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ రంజన్ సింగ్, జార్జ్ కురియన్, ఎస్పీ సింగ్ భఘేల్ తదితరులు హాజరు కానున్నారు. ఆక్వాకల్చర్, మత్స్య రంగంలో స్టార్టప్‌లు, సీఫుడ్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్లు, మెరైన్ ఆక్వాకల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సంబంధించిన వివిధ భాగస్వాములు పాల్గొంటారు. సముద్ర ఆహార ఎగుమతుల ప్రస్తుత పరిస్థితులు, వివిధ ప్రత్యామ్నాయ మార్కెట్లు, మెరైన్ ఫిషరీస్‌లో అవకాశాలు, మత్స్యరంగ అభివృద్ధి తదితర అంశాలతో పాటు యూరోపియన్ యూనియన్ సహా ఇతర అంతర్జాతీయ మార్కెట్లకు ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేసే అంశాలపై చర్చిస్తారు. ట్రేసబిలిటీ వ్యవస్థలను బలోపేతం చేయడం, ఆక్వా కల్చర్‌లో సర్టిఫికేషన్ లాంటి స్థిరమైన విధానాలకు ప్రోత్సాహం కల్పించడం లాంటి అంశాలపైనా చర్చ జరగనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రాజెక్టు లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ ద్వారా విలువ జోడించిన ఉత్పత్తులు, ఎంఎస్ఎంఈలకు మద్దతు కల్పించే అంశాన్ని కూడా ఈ వర్క్‌షాప్ ద్వారా వివరించే అవకాశం ఉంది. డీప్‌సీ సహా అండమాన్ నికోబార్, లక్షద్వీప్ లాంటి ప్రాంతాల్లో అధిక విలువ కలిగిన మెరైన్ ఉత్పత్తుల వినియోగం, సీవీడ్, ఆర్నమెంటల్ ఫిష్, ముత్యాల పెంపకం లాంటి రంగాల అభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. పీఎంకేఎస్ఎస్‌వై (PMKSSY), కిసాన్ క్రెడిట్ కార్డ్ (KCC) పథకాల లబ్ధిదారులకు ప్రోత్సాహకాలు అందిస్తారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌పై అధికారులతో సీఎం సమీక్షిస్తారు. సాయంత్రం అమరావతికి తిరుగు ప్రయాణం అవుతారు.

## సుపరిపాలనకు రెండేళ్లు

### సీఎం చంద్రబాబు స్పందన

జూన్ 4, 2024... ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపించాలని ప్రజలు అపూర్వమైన తీర్పు ఇచ్చిన చారిత్రాత్మక దినానికి నేటికి రెండేళ్లు. ఆ విజయం మాకు అధికారం కాదు... రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు అప్పగించిన మహోన్నత బాధ్యత. ఆ బాధ్యతను గౌరవిస్తూ ప్రతి క్షణం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులు సహా ప్రతి వర్గ సంక్షేమం కోసం పనిచేస్తున్నాం. అసమానతలు లేని సమాజం, అన్ని ప్రాంతాల అభివృద్ధి మా లక్ష్యం. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని హెల్తీ, వెల్తీ, హ్యాపీగా చేయాలనేది మా సంకల్పం. నాటి తీర్పును గౌరవించేలా, ప్రజలు గర్వపడేలా పాలన సాగిస్తున్నామని వినమ్రంగా ప్రకటిస్తూ... మద్దతుగా నిలిచిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



### రాజ్యసభ సీట్ల పంపకంపై

## ఎన్డీఏలో కుదిరిన ఒప్పందం

**టీడీపీకి 3, జనసేనకు 1 సీటు**

**తిరుపతి, అమరావతి, విశాఖల్లో బహిరంగ సభలు**

అమరావతి(చైతన్యరథం): నాలుగు రాజ్యసభ స్థానాల పంపకంపై ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కీలక నిర్ణయానికి వచ్చాయి. టీడీపీ 3 సీట్లు, జనసేన 1 సీటు తీసుకోవాలని ఎన్డీఏ నేతల సమావేశంలో తేల్చారు. జనసేన రాజ్య సభ అభ్యర్థి ఎవరనేది పార్టీ అధినేత ప్రకటిస్తారని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఉమ్మడి కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లాలని ఎన్డీఏ సమావేశంలో నిర్ణయించారు. ఈనెల 9న తిరుపతి (సంక్షేమం), 12న అమరావతి (సుపరిపాలన), 15న విశాఖపట్నంలో(అభివృద్ధి) బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈనెల 13, 16, 17, 18, 19, 20 తేదీల్లో జిల్లాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతారు. మొత్తం కార్యాచరణ షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తారు.

టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ -24 నెలల పాలనలో అమలుచేసిన 24 ప్రధాన కార్యక్రమాలు, పథకాలపై విస్తృత ప్రచారం చేపడతామని చెప్పారు. ‘సర్’ అంశంపై కూడా సమావేశంలో చర్చ జరిగిందని వెల్లడించారు.

పౌరసరఫరాల మంత్రి, జనసేన ప్రతినిధి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ...కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసిన అభివృద్ధి-సంక్షేమం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నామన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిర్వహించే కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు కూడా పాల్గొంటారన్నారు. 24నెలల పాలనలో చేపట్టిన 24ప్రధాన కార్యక్రమాలు..పథకాలపై ప్రచారం చేపడతామని, ఈ కార్యాచరణ ద్వారా ప్రజల ఆశీస్సులను మరోసారి కోరతామని వెల్లడించారు.

బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ -ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారంచేసిన జూన్ 9నుంచి కార్యాచరణ మొదలుపెట్టాలని సీఎం సూచించారని తెలిపారు. పరిశ్రమలు, పోలవరం, అమరావతి నిర్మాణం, విశాఖ రైల్వే జోన్‌వంటి కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. టీడీపీ, జనసేనకు రాజ్యసభ సీట్లు ఉంటే బీజేపీకీ ఉన్నట్టేనని స్పష్టం చేశారు.తెలంగాణ కాంగ్రెస్ నేతలు ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే తీరులో వ్యవహరించడం సరికాదని హెచ్చరించారు.బీజేపీ, టీడీపీ, జనసేన మూడు పక్షాలు కలిసే ఉంటాయని, ఒక్కటిగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

# భారత్-రష్యా నడుమ అనిర్వచనీయమైన అనుబంధం

- భారత అభివృద్ధి యాత్రలో కీలక దశల వద్ద తోడుగా రష్యా
- 2030 నాటికి వి100 బిలియన్ల ద్వైపాక్షిక వాణిజ్యం ఇరు దేశాల లక్ష్యం
- అంతరిక్షంలో మన సుదీర్ఘ అనుబంధం కొత్త శిఖరాలను చేరుతోంది
- ఏపీని వి2.5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా నిలపడమే మా ధ్యేయం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మేం సీరియస్‌గా పరిగణిస్తాం
- పెట్టుబడిదారులుగా కాకుండా భాగస్వాములుగా మా రాష్ట్రానికి రండి
- ఎస్‌పీఐఈఎఫ్ (SPIEF) బిజినెస్ ఫోరం సదస్సులో మంత్రి నారా లోకేష్



సెయింట్ పీటర్స్‌బర్గ్ (రష్యా): 'భారత్-రష్యా నడుమ ఒక అనిర్వచనీయమైన అనుబంధం ఉంది. ప్రపంచంలో చిరస్థాయిగా నిలబడిన స్నేహం ఇది. వ్యాపార ఒప్పందాలు, దౌత్య నిఘంటువులను మించింది. ప్రపంచం అనిశ్చితిలో ఉన్నప్పుడు కూడా ధృడంగా నిలబడిన బంధం' అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరం (SPIEF) వేదికగా జరిగిన రష్యా - ఇండియా బిజినెస్ ఫోరం సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... 'భారతదేశ అభివృద్ధి యాత్రలో కీలక దశల వద్ద రష్యా తోడుగా నిలిచింది. భిలాయ్ స్టీల్‌ప్లాంట్, కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం, గగన్‌యాన్, బ్రహ్మోస్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో రష్యా భారతదేశానికి అండగా నిలిచింది. ఈ పునాది రాత్రికి రాత్రి నిర్మించడం సాధ్యమయ్యేది కాదు. దానిని కాపాడుకుంటూ మరింత బలంగా ఇరుదేశాలు ముందుకు సాగాలి.' అని పిలుపునిచ్చారు.

నేను ఈ ఫోరమ్‌లో మీ ముందుకొచ్చి మాట్లాడు తున్నందుకు గొప్ప గౌరవంగా ఉంది. నేను ఇక్కడకు రావడానికి కారకులైన భారత ప్రజలు,ద ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు చెబుతూ వారి తరపున మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ఇది భారతదేశంలోని వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక కేంద్రాల్లో ఒకటి, ప్రస్తుతం మా జీడీపీ సుమారు 215 బిలియన్ డాలర్లు కాగా, 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.






బోధనలు పక్కనబెట్టి వాస్తవ ఫలితాల గురించి నేను మాట్లాడతాను. మన రెండు దేశాల భాగస్వామ్యానికి ఉత్తమ ఉదాహరణ మా రాష్ట్రంలోనే ఉంది. ఏపీలో రుసాల్ (RUSAL) సంస్థ 1.5 మిలియన్ టన్నుల పయనీర్ అల్యూమినియం ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టింది. మరో ప్రాజెక్టు నయారా ఎనర్జీ- భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రిఫైనరీల్లో ఒకటైన నయారాలో రోస్‌నెఫ్ట్ మెజారిటీ వాటా కలిగి ఉంది. గుజరాత్ రాష్ట్రంలోని వడినార్ రిఫైనరీ రోజుకు 4 లక్షల బ్యారెళ్ల చమురును శుద్ధి చేస్తోంది. దేశవ్యాప్తంగా 6,500కు పైగా ఇంధన కేంద్రాలు భారతీయ వినియోగదారులకు సేవలందిస్తున్నాయి. ఇవి కేవలం ప్రకటనలు మాత్రమే కాదు... పస్తుతం అభివృద్ధి సాధిస్తున్న పారిశ్రామిక భాగస్వామ్యాలు. మనం ఇంకా చేయాల్సిన పనులకు ఇదొక నమూనా. భారత్-రష్యా కలిసి ఇలాంటి మరిన్ని భాగస్వామ్యాలను ఏర్పరచుకోగలవని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను.

భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అణుశక్తి, ఎల్‌ఎన్‌జీ, చమురు అన్వేషణ, పెట్రో కెమికల్స్, ఏరోస్పేస్, మౌలిక సదుపాయాల రంగాల్లో వాస్తవమైన నిబద్ధతలతో ఆ ఆశయానికి మద్దతు లభిస్తోంది. ఆ భవిష్యత్తులో నా రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఒక ప్రధాన భాగం కావాలని కోరుకుంటోంది.

మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో మ్యానుఫ్యాక్చరింగ్, ఓడరేవులు,లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డిజిటల్ మౌలిక సదుపాయాలపై దృష్టి సారించి ఒక ఆధునిక పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నాం. మాకు 1,053 కిలోమీటర్లకు పైగా సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. ఇది భారతదేశంలో రెండో అతి పొడవైనది. ప్రపంచవ్యాప్త అను సంధానంతో పనిచేస్తున్న ఆరు ఓడరేవులు, పటిష్టమైన రోడ్డు, రైలు నెట్‌వర్క్‌లు, భారీ పారిశ్రామిక ల్యాండ్ బ్యాంకులు, నమ్మకమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా, పెరుగుతున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, పెట్టుబడిదారులకు మద్దతునిచ్చే అడ్మినిస్ట్రేషన్ మమ్మల్ని ప్రత్యేక స్థానంలో నిలుపుతున్నాయి.

మేము అత్యంత గర్వపడేది కాగితాలపై విధానాల గురించి కాదు-క్షేత్రస్థాయిలో అమలుతీరు గురించే. బలమైన ప్రభుత్వ మద్దతుతో మా రాష్ట్రంలో భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు వేగంగా పురోగమిస్తున్నాయి. ఒక పెట్టుబడిదారుడు మా వద్దకు రావడానికి ఆసక్తి చూపినప్పుడు వేగంగా స్పందించడంలో మాకు పేరుంది. ఆ వేగం చాలా ముఖ్యం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మేము సీరియస్‌గా పరిగణిస్తాం.

ఇప్పుడు మా భాగస్వామ్యంలో నాకు అత్యంత స్ఫూర్తిదాయకంగా నిలిచే అంశమేమిటంటే- అంతరిక్షం. భారతదేశ అంతరిక్ష యాత్రకు రష్యానే నాంది పలికింది. 1975లో సోవియట్ రాకెట్ ద్వారా ఆర్యభట్టను ప్రయోగించినప్పుడు అది ఒక అసాధారణమైన ఆరంభం. దశాబ్దాల తర్వాత మన గగన్‌యాన్ మానవ అంతరిక్ష యాత్ర కోసం రోస్కోస్మోస్ సంస్థ గగరిన్ వ్యోమగామి శిక్షణా కేంద్రంలో భారతీయ వ్యోమగాములకు శిక్షణనిచ్చింది. ఆ యాత్రకు అవసరమైన కీలక సిబ్బంది, వ్యవస్థలను సరఫరా చేసింది. ఆ చరిత్ర ఈనాటికీ సజీవంగా ఉంది.

అధునాతన రాకెట్ ఇంజిన్ల లైసెన్స్ ఉత్పత్తి, ఆర్బిటల్ స్టేషన్ల సంయుక్త అభివృద్ధి, భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని రష్యన్ ఆర్బిటల్ స్టేషన్‌తో ఒకే కక్ష్య వాలులో అనుసంధానించడం వంటి అంశాలపై రోస్కోస్మోస్, ఇస్రో ఇప్పుడు చురుకైన చర్చలు జరుపుతున్నాయి. దీనివల్ల భూమికి సమీప కక్ష్యలో నిరాటంకమైన దీర్ఘకాలిక సహకారం సాధ్యమవుతుంది.ప్రధాన మంత్రి మోదీ చెప్పినట్లుగా... అంతరిక్షంలో మన సుదీర్ఘ అనుబంధం కొత్త శిఖరాలను చేరుకుంటోంది.

భారతదేశ ఏకైక కార్యాచరణ అంతరిక్ష కేంద్రం... ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం. ఈ నేల నుంచి 100కు పైగా అంతరిక్ష ప్రయోగ యాత్రలు జరిగాయి. దాని ఆధారంగా మేము స్పేస్ పాలసీ 4.0ని, దాంతో రెండు ప్రత్యేక స్పేస్ సిటీలను ఆవిష్కరించాం. పరిశోధన, ఉపగ్రహ అభివృద్ధి, డీప్-టెక్ ఆవిష్కరణల కోసం రాష్ట్రంలో మేము అనేక అంతరిక్ష నగరాలను నిర్మిస్తున్నాం.

తిరుపతి స్పేస్ సిటీ-శ్రీహరికోటకు నేరుగా రోడ్డు మార్గంలో అనుసంధానమై ఉన్న 2,800 ఎకరాల విస్తీర్ణంలో ఇది నెలకొని ఉంది. ప్రయోగ వాహనాల అసెంబ్లింగ్, ఉపగ్రహాల తయారీ, ఏవియానిక్స్ ఉత్పత్తి కోసం దీన్ని నిర్మిస్తున్నాం. స్పేస్ సిటీల ద్వారా రూ.25వేల కోట్ల పెట్టుబడులు, 5వేల ప్రత్యక్ష ఉద్యోగాలు, 30వేల పరోక్ష ఉపాధి అవకాశాలను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భారతదేశ అంతరిక్ష రంగం ఇప్పటికే 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తోంది.

ఈ రోజు ఇక్కడ ఉన్న రష్యన్ భాగస్వాములకు నేను ఓ విషయాన్ని నేరుగా చెప్తున్నా... ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భాగం కావాలనుకునే రోస్కోస్మోస్ టెక్నాలజీ భాగస్వాములకు, ప్రొపల్షన్ కంపెనీలకు, శాటిలైట్ ఇంటిగ్రేటర్లకు, స్పేస్-టెక్ సంస్థలకు ఆంధ్రప్రదేశ్ సహజసిద్ధమైన గమ్యస్థానం.

ఏరోస్పేస్, ఇంధనం, సెమీ కండక్టర్లు, మైక్రో ఎలక్ట్రానిక్స్, ఏఐ, కమోడిటీస్ రంగాల్లో కూడా ఇటువంటి అవకాశాలే ఉన్నాయి. ఆత్మనిర్భర్ భారత్ కింద భారతదేశం దేశీయ తయారీని విస్తరిస్తున్నందున, ఆంధ్రప్రదేశ్ ఏరోస్పేస్ విడి భాగాలు, ఏవియానిక్స్, డ్రోన్లు, నావికా వ్యవస్థలు, సెమీ కండక్టర్ల కోసం ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేస్తోంది. ముఖ్యంగా బెంగళూరు సమీపంలోని శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ చుట్టూ ఈ ఏర్పాటు జరుగుతోంది. ఇది పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అసాధారణమైన ఇంజనీరింగ్ ప్రతిభతో ఇంటిగ్రేట్ చేస్తుంది. రష్యన్ ఏరోస్పేస్, సెమీ కండక్టర్ సంస్థలకు ఒక ప్రత్యేకమైన, సమీకృత గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోంది.

నేటి ప్రపంచం విశ్వసనీయమైన సంబంధాలకే విలువనిస్తుంది. భారత్-రష్యా నడుమ ఆ విశ్వాసం ఉంది. మనం ఇప్పుడు కలిసి నిర్మించాల్సింది భవిష్యత్తునే. రష్యా పరిశ్రమలు, అంతరిక్ష సంస్థలు, ఇంధన సంస్థలు, సాంకేతిక సంస్థలు, అధునాతన తయారీదారులకు కేవలం పెట్టుబడిదారులుగా మాత్రమే కాకుండా భూమి, సముద్రం, గగనంలో శాశ్వతంగా నిలిచిపోయే వ్యవస్థలను నిర్మించడంలో దీర్ఘకాలిక భాగస్వాములుగా రావాలని ఆంధ్రప్రదేశ్ హృదయ పూర్వకస్వాగతం పలుకుతోంది. 1975లో ఆర్యభట్టతో ప్రారంభమైన ఈ భాగస్వామ్యం తన తదుపరి ప్రయాణానికి సిద్ధంగా ఉంది. ఇందుకోసం భారతదేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎదురుచూస్తున్నాయని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

### ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా

# నేడు తెలుగుదేశం సైకిల్ యాత్రకు శ్రీకారం

**- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**

మంగళగిరి (చైతన్య రథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మహోత్తర కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ శ్రీకారం చుట్టనున్నట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు ప్రజలందరూ సాధ్యమైనంత వరకూ సైకిళ్లను వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన, పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విశాఖపట్నంలో హెలిప్యాడ్ నుంచి విడిది కేంద్రం వరకూ సైకిల్ ప్రయాణం చేస్తారని తెలిపారు. టీడీపీ పార్టీ నాయకులతోపాటు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



**పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి**

"ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. పర్యావరణం కాపాడుకోవడం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, ఇందులో ప్రజలు కూడా భాగస్వాములు కావాలి. ఈ ఆలోచనతోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ సైకిల్ యాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సైకిల్ వినియోగంవల్ల కాలుష్యం తగ్గుతుంది. ఇంధన వినియోగం తగ్గుతుంది. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ప్రకృతికి మేలు జరుగుతుంది. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయి. నేడు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తమ రోజువారీ కార్యక్రమాలకు సైకిళ్లను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటాలి" అని పల్లా శ్రీనివాసరావు కోరారు.

**"నా దేశం.. నా బాధ్యత"గా అందరూ సైకిల్ వినియోగించాలి**

పశ్చిమాసియా దేశాల్లో నెలకున్న యుద్ధ పరిస్థితుల వలన అనేక దేశాలతోపాటు మన దేశంలో ఇంధన సంక్షోభం నెలకొందని పల్లా గుర్తుచేశారు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ "నా దేశం- నా బాధ్యత" అనే నినాదం ఇచ్చారని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ ఇంధన వినియోగం వీలైనంత వరకు తగ్గించుకోవాలని, దీని వలన ఇంధన సంక్షోభంతో పాటు వాతావరణ కాలుష్యం తగ్గించవచ్చని వివరించారు. వాహనాల నుంచి వచ్చే విషపూరిత వాయువుల వలన కర్బన కాలుష్యం పెరిగి అనేక వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు.

ఇంధన సంక్షోభం దృష్టిలో పెట్టుకునే ఈసారి తెలుగుదేశం పార్టీ ఎంతో బాధ్యతగా మహానాడు కార్యక్రమం హైబ్రిడ్ విధానంలో నిర్వహించిందని, సుమారు 24 లక్షల మందికి పైగా కార్యకర్తలు డిజిటల్ వేదికగా హాజరై గ్రాండ్ సక్సెస్ చేశారని తెలిపారు. ఈసారి కూడా సైకిల్ యాత్రలో పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు బాధ్యతగా భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు "నేను సైతం" అంటూ ముందుకు రావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# ప్రతి చిన్నారికి అత్యుత్తమ ఆరంభం

- **రాష్ట్రవ్యాప్తంగా "నవచేతన" బాల్యారంభ అభివృద్ధి స్క్రీనింగ్**
- **శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడి**

అమరావతి (చైతన్య రథం): ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధి, స్క్రీనింగ్‌పై రాష్ట్రవ్యాప్త సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గర్భధారణ నుంచి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1,000 రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైన కాలమని పేర్కొన్నారు. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రతి సెకనుకు దాదాపు 10 లక్షల న్యూరల్ కనెక్షన్లు ఏర్పడతాయని తెలిపారు. పిల్లల మెదడు అభివృద్ధిలో 80 శాతం మూడు సంవత్సరాల వయస్సు లోపు, 90 శాతం ఆరు సంవత్సరాల వయస్సులోపు పూర్తవుతుందని వివరించారు. ప్రారంభ సంవత్సరాల్లో అందే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, స్పందనాత్మక సంరక్షణ, ప్రారంభ అభ్యసన అవకాశాలు, భద్రత మరియు ప్రేరణ పిల్లల భవిష్యత్తు విద్య, ఆరోగ్యం, ఉత్పాదకత మరియు శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావం చూపుతాయని మంత్రి పేర్కొన్నారు.

బాలల అభివృద్ధిలో ఆలస్యాలను ముందుగానే గుర్తించిసకాలంలో జోక్యాలు చేపట్టేందుకు స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య మరియు ఆరోగ్య శాఖతో సమన్వయంగా "నవచేతన" అనే మొబైల్ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ సాధనాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సాధనం 0 నుండి 6



సంవత్సరాల వయస్సుగల పిల్లల అభివృద్ధిని అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని చెప్పారు.

నవచేతన వేదిక ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలలో స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞాన వికాసం మరియు సామాజిక-భావోద్వేగ అభివృద్ధి వంటి ఐదు ప్రధాన అభివృద్ధి రంగాలను వ్యవస్థీకృతంగా పరిశీలించగలరని తెలిపారు. దీని ద్వారా అదనపు మద్దతు లేదా ముందస్తు జోక్య సేవలు అవసరమయ్యే పిల్లలను త్వరగా గుర్తించవచ్చని చెప్పారు.

ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలయ్యేలా రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణను మే 29, 30 తేదీలలో నిర్వహించినట్లు, జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు జూన్ 2, 3 తేదీలలో నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలకు జూన్ 5 నుండి 10 వరకు భారీస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు జిల్లా అధికారులు, సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు,అంగన్వాడీ కార్యకర్తలు మరియు ఆరోగ్యశాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలోపాల్గొంటున్నారని తెలిపారు.

క్షేత్రస్థాయి సిబ్బందికి అభివృద్ధి మైలురాళ్ల ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, వయస్సుకు అనుగుణమైన స్క్రీనింగ్ నిర్వహించడం, అభివృద్ధి ఆలస్యాలు మరియు వైకల్యాలను గుర్తించడం, ముందస్తు రిఫరల్ మరియు జోక్యాలను ప్రోత్సహించడం, కుటుంబ స్థాయిలో పోషణాత్మక సంరక్షణ పద్ధతులను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు.

స్క్రీనింగ్ అనంతరం కుటుంబాలకు మద్దతుగా వాట్సాప్ సందేశాలు, వీడియోలు, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్, అలాగే నెట్‌వర్క్ సౌకర్యం లేని ప్రాంతాల్లో ముద్రిత కౌన్సెలింగ్ మరియు కార్యాచరణ కార్డుల ద్వారా తల్లిదండ్రులకు వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వం అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు ఇంటి వద్దనే స్పందనాత్మక సంరక్షణ, ఆటలు, సంభాషణ, పోషణ మరియు ప్రారంభ అభ్యసన కార్యక్రమాల ద్వారా పిల్లల అభివృద్ధికి మరింత సమర్థవంతంగా తోడ్పడగలరని తెలిపారు. "ప్రతి చిన్నారి విలువైనవాడు" అనే నమ్మకంతో ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధిలో పెట్టుబడి పెడుతోందని, నవచేతన కార్యక్రమం ద్వారా అభివృద్ధి సంబంధిత సమస్యలు ఉన్న ఏ చిన్నారి కూడా గుర్తించబడకుండా మిగలకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

"పిల్లలే మన గొప్ప సంపద. తొలి 1,000 రోజులు జీవితంలో ఒక్కసారి మాత్రమే వస్తాయి. ఈ రోజు ముందస్తు గుర్తింపు, పోషణాత్మక సంరక్షణ మరియు తల్లిదండ్రుల సాధికారతలో పెట్టుబడి పెట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన, బలమైన, అభివృద్ధి చెందిన స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి పునాది వేస్తున్నాము" అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

### సంక్షేమం, అభివృద్ధితో కూడిన

# సుపరిపాలనకు రెండేళ్లు

**మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుభాకాంక్షలు**



అమరావతి (చైతన్య రథం): సంక్షేమం -అభివృద్ధితో కూడిన సుపరిపాలనకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల రూపురేఖలు మార్చేలా రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. ఈ ఏడాది చివరినాటికి 3 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

చంద్రబాబు సమర్థ, సుస్థిర పాలనతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగిందని, మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. రెండేళ్ల పాలనలో దేశంలోనే అగ్రగామిగా 25 శాతం పెట్టుబడులు సాధిస్తూ, పెట్టుబడుల గమ్యస్థానంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్.. పెట్టుబడుల రాకతో పెద్దఎత్తున యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబడుతున్నాయని వివరించారు. రాష్ట్రంలో భయాందోళనలులేని, ప్రశాంతమైన ప్రజాస్వామ్య పాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల జోడీతో సమగ్రాభివృద్ధి దిశలో ఆంధ్రప్రదేశ్ పయనం కొనసాగుతోందని మంత్రి జనార్దన్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

# వైసీపీ అరాచక పాలన అంతమై రెండేళ్లు

**- రాష్ట్ర ప్రజలకు మంత్రి ఆనం శుభాకాంక్షలు**



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో వైసీపీ అరాచక, విధ్వంసక పాలనకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు చరమగీతం పాడి నేటికి రెండేళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. "ప్రజాస్వామ్యాన్ని పరదాల మాటున బంధించి, ప్రజల గొంతునొక్కిన రాక్షస పాలనకు ప్రజలు తీర్పునిచ్చి నేటికి రెండేళ్లు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆలయాలపై దాడులు, కులాలపై దాడులు, మతాలపై దాడులు చేసిన అరాచక శక్తుల పాలనకు ముగింపు పలికి నేటికి రెండేళ్లు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ పాలనకు ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో గుణపాఠం చెప్పి రెండేళ్లు పూర్తైంది. ఐదేళ్లపాటు భయాందోళనలు, కక్షసాధింపులు, రాజకీయ వేధింపులతో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిన వైసీపీ పాలకులను ప్రజలు తిరస్కరించిన చారిత్రక రోజు ఇది. రైతులను, యువతను, మహిళలను, ఉద్యోగులను, వ్యాపారులను, పెట్టుబడిదారులను, పారిశ్రామికవేత్తలను... ఇలా ప్రతి వర్గాన్నీ ఇబ్బందులకు గురిచేసిన పాలనకు ప్రజలు ముగింపు పలికి నేటికి రెండేళ్లు. పరిశ్రమలను భయపెట్టి తరిమేసిన గత పాలన వల్ల రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగ అవకాశాలు దూరమై నేటికి రెండేళ్లు" అంటూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం ఎంతటి విధ్వంసానికి గురైందో మంత్రి ఆనం చమత్కారంగా వివరించారు. ప్రజల ఆశీర్వాదాలు, కేంద్ర ప్రభుత్వ సహకారం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మద్దతుతో రాష్ట్రం తిరిగి అభివృద్ధి బాటలో పయనిస్తోందని అన్నారు. "పరిశ్రమలను భయపెట్టి తరిమేసిన పాలన మీది. రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చే పాలన మాది... బోత్ ఆర్ నాట్ సేమ్ మిస్టర్ జగన్ రెడ్డి" అంటూ మంత్రి ఆనం ఎద్దేవా చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, అనుభవం, సమర్థ నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయని మంత్రి ఆనం అన్నారు. యువనేత నారా లోకేష్ దేశ విదేశాల్లో పర్యటిస్తూ పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు. అమరావతి, పోలవరం, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్ర పునర్నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. గత వైసీపీ పాలన విధ్వంసానికి ప్రతీక అయితే... నేటి కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రాష్ట్రాన్ని చీకటినుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజా తీర్పుకు నేటితో రెండేళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి యాత్రలో భాగస్వాములైన ప్రతి ఒక్క ప్రజానీకానికీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# విధ్వంసం.. విద్వేషం.. వినాశనం

## ఇదే జగన్ ఐదేళ్ల పాలనకు నిర్వచనం

- వైసీపీ రాక్షస పాలననుంచి రాష్ట్రం విముక్తికి రెండేళ్లు
- వైసీపీ ఫేక్ బుక్‌లెట్లతో నిజాలు మారవు
- గొడ్డలి పోటు... వెన్నుపోటు... పేటెంట్ జగన్‌దే
- కేవలం 24 నెలల్లో అభివృద్ధి, సంక్షేమానికి కొత్త దిశ
- ఇదీ కూటమి ప్రభుత్వ పాలనా విధానం...
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్య రథం): వైసీపీ రాక్షస పాలననుంచి ఆంధ్రప్రదేశ్ విముక్తి పొంది రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీ అరాచక, విధ్వంసక రాజకీయాలకు చరమగీతం పాడారని, ప్రజల స్పష్టమైన తీర్పును అంగీకరించలేకనే వైసీపీ నాయకులు నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైసీపీ నిరసనలు ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించే చర్యలేనని అచ్చెన్నాయుడు అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారని, ప్రతిపక్షాల గొంతు నొక్కి, భయాందోళనల వాతావరణంలో పాలన సాగించారని మండిపడ్డారు.

మహానాడు ఘన విజయాన్ని చూసి అసూయ, అక్కసు, ద్వేషంతో రగిలిపోతున్న వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ఫేక్ బుక్‌లెట్ విడుదల చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని మంత్రి తీవ్రంగా ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేసి, ప్రజల జీవితాలను చీకట్లోకి నెట్టిన వ్యక్తి ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. జగన్ పాలన అంటే అభివృద్ధికి గొడ్డలిపోటు, ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు, రాష్ట్ర భవిష్యత్తుకు వినాశనం అని మండిపడ్డారు. జగన్ చరిత్ర మొత్తం చూస్తే గొడ్డలిపోటు, వెన్నుపోటుకు నిలువెత్తు నిర్వచనమని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. తన బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అసలు నిందితులను కాపాడుతూ న్యాయాన్ని ఖూనీ చేసిన వ్యక్తి జగనేనన్నారు. తెలంగాణకు చెందిన శివకుమార్ స్థాపించిన పార్టీని కబ్జా చేసి తన సొంత పార్టీగా మార్చుకున్న వ్యక్తి జగనేనన్నారు. తల్లి, చెల్లికి సైతం న్యాయం చేయకుండా మహిళా ఆస్తి హక్కులకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌దేనని విమర్శించారు. తన అవలక్షణాలను ప్రత్యర్థులపై రుద్దడం, చెప్పిన అబద్ధాన్ని వందసార్లు చెప్పడం జగన్ రాజకీయ శైలిగా మారిందన్నారు.

### ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం చీకట్లోకి

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో చట్టవ్యవస్థ, పరిపాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమయ్యాయని అచ్చెన్నాయుడు విమర్శించారు. అధికార మదంతో ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన పాలన చివరకు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో విధ్వంసం చేసిందన్నారు. అనాలోచిత నిర్ణయాలు, విచ్చలవిడి అప్పులతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని, మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి నవ్యాంధ్రకు ఆశాకిరణమైన అమరావతిని నిర్వీర్యం చేశారని అన్నారు. రోడ్లను కనీసం మరమ్మతులు చేయకుండా రవాణా రంగాన్ని దెబ్బతీశారని, పారిశ్రామికవేత్తలను బెదిరింపులతో పొరుగు రాష్ట్రాలకు తరిమేశారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేశారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రైతుల భూములకు అభద్రత సృష్టించారని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. రూ.1,600 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకుండా అన్నదాతలను మోసం చేశారని అన్నారు. బటన్ నొక్కుతున్నామని ప్రచారం చేసుకుంటూ సంక్షేమ పథకాలపై అనేక ఆంక్షలు విధించి లక్షలాది మందిని లబ్ధికి దూరం చేశారని, తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.1.29 లక్షల కోట్ల భారం మోపారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయి, మాఫియాలకు కేంద్రంగా మార్చి యువత భవిష్యత్తును నాశనం చేశారని, శాంతిభద్రతలను పూర్తిగా దెబ్బతీశారని అన్నారు.

### నవరత్నాలు కాదు... నవ మోసాలు

జగన్ పాదయాత్ర హామీలు, వైసీపీ మేనిఫెస్టో హామీలలో 85 శాతం అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. తల్లికి వందనం పథకం కింద హామీ ప్రకారం ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తున్న కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని చెప్పారు. అయితే ఇద్దరు పిల్లలకు అమ్మఒడి ఇస్తామని చెప్పి చివరకు ఒక్క బిడ్డకే పరిమితం చేసి వైసీపీ మోసం చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.14 వేలు, కేంద్రంతో కలిపి రూ.20 వేలు అందిస్తున్నామని, కానీ రైతు భరోసా పేరుతో జగన్ ఇచ్చిన హామీకి విరుద్ధంగా రాష్ట్ర నిధుల నుంచి కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా అమలు అవుతుంటే వైసీపీ పాలనలో ఆర్టీసీ ఛార్జీలు మూడుసార్లు పెంచారని గుర్తు చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని అన్నారు.

### యువతను మోసం చేసిన జగన్

నిరుద్యోగ భృతి రద్దు చేసి యువతకు అన్యాయం చేసిన వ్యక్తి జగనేనని అచ్చెన్నాయుడు విమర్శించారు. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదన్నారు. ఏపీపీఎస్సీని అవినీతిమయం చేశారని, పరిశ్రమలను తరిమివేసి ఉపాధి అవకాశాలను దెబ్బతీశారని ఆరోపించారు. రెండేళ్లలోనే లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపిస్తోందన్నారు. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 24 లక్షల ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమం చేశామని చెప్పారు.

### సామాజిక న్యాయానికి తూట్లు పొడిచిన వైసీపీ

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధుల్లో రూ.1.14 లక్షల కోట్లను దారి మళ్లించారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. పసుపు కుంకుమ, పెళ్లి కానుక వంటి పథకాలను రద్దు చేసి మహిళలకు అన్యాయం చేశారని అన్నారు. పెన్షన్ల విషయంలోనూ ప్రజలను మోసం చేశారని, సీఎం చంద్రబాబు నాయుడు ఒకేసారి పెన్షన్ పెంచితే జగన్ విడతలవారీగా పెంచి ప్రతి పెన్షన్‌దారుడికి వేల రూపాయల నష్టం కలిగించారని చెప్పారు. అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదల కడుపు కొట్టారని, మద్యనిషేధం హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు.

### నేరాలు, అరాచకాలకు ఐదేళ్లు

వైసీపీ పాలనలో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు, విద్యార్థులు, దళితులు, రైతులు, వైద్యులు ఎవరూ రక్షణలో లేరని అచ్చెన్నాయుడు అన్నారు. ప్రజావేదిక విధ్వంసం నుంచి మొదలుకొని తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై దాడులు, దళిత యువకుల హత్యలు, వైద్యుల వేధింపులు, సోషల్ మీడియా పోస్టులకు కేసులు, అక్రమ అరెస్టులు, రాజకీయ కక్షసాధింపులు వరకూ రాష్ట్రాన్ని అరాచకానికి కేంద్రంగా మార్చారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడిని నిరాధార కేసులతో 53 రోజులు జైలులో పెట్టారని, కోడెల శివప్రసాద్ వంటి నాయకులను మానసికంగా వేధించి ప్రాణాలు తీసే పరిస్థితులు సృష్టించారని పేర్కొన్నారు.

### అధికారంలో లేకపోయినా విషప్రచారమే

అధికారం కోల్పోయిన తర్వాత కూడా జగన్ తన వైఖరి మార్చుకోలేదని అచ్చెన్నాయుడు విమర్శించారు. అమరావతి నుంచి విశాఖ పెట్టుబడుల వరకు ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై బురద జల్లడం ఆయన రాజకీయంగా మారిందన్నారు. పోలవరం, ఉచిత బస్సు ప్రయాణం, అమరావతి నిర్మాణం, పెట్టుబడులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, దేవాలయాలు, రైతులు, మహిళలు, దళితులను రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

### జగన్ అబద్ధాలు నమ్మేంత అమాయకులు కాదు ఆంధ్రులు

ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఫేక్ బుక్‌లెట్లు విడుదల చేస్తే నిజాలు మారవని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విధ్వంసం, విద్వేషం, దోపిడీ, అబద్ధాలు, నేరాలు, కక్షసాధింపులకు ప్రతిరూపమే జగన్ పాలన అని అన్నారు. గొడ్డలి పార్టీ ఐదేళ్ల చీకటి పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌ను కాపాడి, కేవలం 24 నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణ దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

---

# కిడ్నీ రోగులకు స్వాంతన

## స్వాప్ విధానానికి మంత్రివర్గం ఆమోదం



అమరావతి (చైతన్య రథం): కిడ్నీ బాధిత రోగులకు ఊరట కలిగించే కీలక నిర్ణయం తీసుకుంది కూటమి ప్రభుత్వం. పరస్పర మార్పిడి (స్వాప్ డొనేషన్) విధానానికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన హ్యూమన్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యాక్ట్-2011ని రాష్ట్రంలో అమలు చేసేందుకు మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది.

ఈ విషయాన్ని వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ప్రస్తుతం అమలులో ఉన్న 1995నాటి చట్టం ప్రకారం తల్లి, తండ్రి, సంతానంవంటి కుటుంబ సభ్యులనుంచి మాత్రమే మూత్రపిండాలు స్వీకరించే అవకాశం ఉంది. అయితే రక్తం గ్రూపు సరిపోకపోవడం లేదా రోగనిరోధక శక్తి తగ్గుదల వంటి కారణాల వల్ల అనేక సందర్భాలలో మార్పిడి సాధ్యపడటం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకే స్వాప్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. స్వాప్ విధానంలో రెండు కుటుంబాలు పరస్పరం కిడ్నీలు మార్చుకుంటాయి. ఒక కుటుంబంలోని దాత మరో కుటుంబంలోని రోగికి కిడ్నీ ఇస్తారు; అదే విధంగా ఆ కుటుంబం నుంచి మొదటి కుటుంబంలోని రోగికి కిడ్నీ లభిస్తుంది. కుటుంబ సభ్యుల నుంచి కిడ్నీ స్వీకరించడం వైద్యపరంగా సాధ్యం కాదని నిర్ధారించినప్పుడు మాత్రమే ఈ విధానాన్ని అనుసరించవచ్చు. రెండు కుటుంబాల వారూ జోన్ల వారీగా ఉన్న మెడికల్ బోర్డులకు దరఖాస్తు చేసి ఆమోదం పొందాల్సి ఉంటుంది.

తాజా నిర్ణయం ప్రకారం తాత, అమ్మమ్మ, నాన్నమ్మలు కూడా కిడ్నీ, కాలేయం దానం చేయవచ్చు. చిన్న వయసు పిల్లలకు ఈ నిర్ణయం ప్రత్యేకంగా ఉపయుక్తంగా ఉంటుంది. అలాగే చనిపోయిన వ్యక్తుల నుంచి సేకరించే కార్నియా, నర్వ్, టెండాన్, స్కిన్ వంటివాటిని ఇకపై ఆర్గాన్ జాబితా నుంచి తొలగించి విడిగా 'టిష్యూ' జాబితాలో చేర్చారు.

జీవన్మృత అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు గత రెండేళ్లలో 209 మంది 663 అవయవాలు దానం చేశారు. దాత కుటుంబాలకు రూ.10,000 నగదు పారితోషికంతో పాటు మృతుడికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జీవన్ దాన్ ట్రస్ట్‌కు 3,634 మంది కిడ్నీ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

# రాక్షస పాలన అంతమై నేటికి రెండేళ్లు

## గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి



అమరావతి (చైతన్య రథం): స్వర్ణాంధ్రను కూల్చివేతలతో దేశంలోనే అట్టడుగుస్థాయికి చేర్చిన రాక్షసుల పరిపాలన అంతమై నేటికి రెండేళ్లని మంత్రి కొలుసు పార్థసారథి వ్యాఖ్యానించారు. పరదాల గోడలను ప్రజలు ఓటు అనే ఆయుధంతో కూలగొట్టి, స్వేచ్ఛాయుతమైన ప్రజాస్వామ్య పాలనకు స్వాగతం పలికిన సుదినం ఈరోజు అన్నారు. వైనాట్ 175 అని విర్రవీగిన కాలకేయ దొంగల ముఠాను క్రికెట్ టీమ్ సంఖ్య 11కు పరిమితం చేసి ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని ఈ దేశానికి తెలుగు ప్రజలు చాటి చెప్పిన సుదినం ఈరోజు అని మంత్రి కొలుసు అభివర్ణించారు. “రెండేళ్ల ప్రజాస్వామ్యయుత పాలనలో దోపిడీలు లేవు, దొంగతనాలు లేవు, మహిళలపై అఘాయిత్యాలు లేవు, పోలీసుల నిర్బంధాలు లేవు, పరదాల గోడలు లేవు, భూకబ్జాలు లేవు, సరిహద్దు రాళ్లపై పేర్లు లేవు, పేదవారి భూములు కాజేసే దోపిడీ చట్టాలు లేవు, స్కీముల పేరుతో స్కాములు లేవు” అని వైసీపీ విధ్వంస పాలనపై సెటైర్లు వేశారు. “తెలుగు ప్రజలు కోరుకున్న ప్రజాధాని అమరావతి పనుల పరుగులు పెడుతోంది. ఏపీకి వరప్రదాయిని పోలవరం ప్రాజెక్టు శరవేగంగా దూసుకుపోతుంది. దేశంలోనే పెట్టుబడుల ఆకర్షణలో 25.3 శాతం నమోదు చేసి ఏపీని పెట్టుబడులకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా చేస్తూ నిరుద్యోగ యువత కలలను సాకారం చేస్తూ, వారికి ఉద్యోగాలు ఇచ్చి ముందుకు నడిపిస్తోంది మన కూటమి ప్రభుత్వమని మంత్రి ఆనందంగా వివరించారు. సంక్షేమం -అభివృద్ధిని జోడెద్దుల బండిలా సవారి చేయిస్తోంది కూటమి ప్రభుత్వమని అన్నారు. రానున్న మూడేళ్లలోనూ రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో, సహాయ సహకారాలతో డబుల్ ఇంజిన్ స్పీడ్‌తో స్వర్ణాంధ్రను సాధించేందుకు కూటమి ప్రభుత్వం కష్టపడుతుందని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రయత్నిస్తోందని చెప్పారు. ఎందుకంటే ఇది ప్రజలు కోరుకున్న ప్రజాస్వామ్యయుత ప్రభుత్వం, మంచి ప్రభుత్వమని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు.

# నూతన బీటీ పత్తి రకం విత్తనాల ఆవిష్కరణ

- అధిక దిగుబడులు అందించే సరికొత్త రకం
- ఎన్జీ రంగా వర్సిటీ శాస్త్రవేత్తల అభివృద్ధి
- రైతులకు అందజేసిన మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి(చైతన్యరథం): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆంగ్రూ) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన నూతన బీటీ పత్తి రకం ‘లాం బీజీ టూ-2208 (ఆదిత్య బీజీ-2)’ విత్తనా లను వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆవిష్కరించి రైతులకు పంపిణీ చేశారు. విజయవాడ మంత్రి క్యాంప్ కార్యాల యంలో జరిగిన కార్యక్రమంలో ఆంగ్రూ ఉపకులపతి పాలడుగు వెంకట సత్యనారాయణతో కలిసి మంత్రి ఈ విత్తనాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులు ప్రతి సంవత్సరం ప్రైవేట్ కంపెనీల నుంచి అధిక ధరల కు విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని తగ్గించేందుకు ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు చేపడు తున్న పరిశోధనలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొ న్నారు. బీటీ సాంకేతికతపై పేటెంట్ హక్కులు ముగిసిన అనంత రం సుమారు తొమ్మిదేళ్ల పాటు శాస్త్రీయ పరిశోధనలు, అఖిల భారత స్థాయి పరీక్షలు నిర్వహించి ఈ రకాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. జాతీయ విత్తన విడుదల కమిటీ ఆమోదంతో విడుదలైన ఈ రకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగంలో అభివృద్ధి చేసిన తొలి బీటీ పత్తి రకం కావడం గర్వకారణమన్నారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా సాగుకు అనుకూలంగా ఈ రకాన్ని సిఫారసు చేసినట్లు తెలిపారు.

### అధిక దిగుబడులు, మెరుగైన నాణ్యత

లాం బీజీ టూ-2208 రకం హెక్టారుకు 32 నుంచి 35 క్విం టాళ్ల వరకు దిగుబడిని ఇచ్చే సామర్థ్యం కలిగి ఉందని శాస్త్రవేత్తలు వివరించారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న హైబ్రిడ్ రకాలతో సమా నమైన దిగుబడిని ఇవ్వడంతో పాటు మెరుగైన దూది నాణ్యతను కలిగి ఉందన్నారు. ఇది సూటి రకం (వెరైటీ) కావడంతో రైతులు ప్రతి సంవత్సరం కొత్త విత్తనాలు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, తమ పొలాల్లో పండించిన పంట నుంచి విత్తనాన్ని భద్రపరచుకొని తిరిగి వినియోగించుకోవచ్చని తెలిపారు. దీంతో విత్తనాలపై అయ్యే పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గుతుంద న్నారు. ఈ రకం శనగ పచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు వంటి కాయ తొలిచే పురుగులను సమర్థవంతంగా తట్టుకుంటుందని తెలిపారు. అదేవిధంగా పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగు లు, పేనుబంక వంటి రసం పీల్చే పురుగుల ప్రభావాన్ని కూడా తగ్గించే లక్షణాలు కలిగి ఉందన్నారు. బ్యాక్టీరియల్ బ్లైట్, సర్కో స్పోరా ఆకుమచ్చ తెగులు, తుప్పు తెగులు, వెర్రి తెగులు వంటి ప్రధాన వ్యాధులను తట్టుకునే సామర్థ్యం ఉండటంతో రైతులు పురుగు మందులు, తెగుళ్ల నివారణ మందులపై చేసే ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసిన శాస్త్రవేత్తల బృందాన్ని మంత్రి అచ్చెన్నాయుడు, ఆంగ్రూ ఉపకులపతి పి.వి.సత్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్ యడ్లపల్లి సతీష్, పరిశోధనల సంచాలకురాలు వి.సుమతి, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎన్.వి.వి.ఎస్.దుర్గాప్రసాద్, ప్రధాన పత్తి శాస్త్రవేత్తలు రాఖమణి, ఎన్.చాముండేశ్వరి, చాపర రాజు తదితరులు పాల్గొన్నారు.

# గొడ్డలి పార్టీ వధకు రెండేళ్లు

- అయినా విధ్వంస రచనలోనే సైకో బ్యాచ్
- వెన్నుపోట్లు, గొడ్డలి వేట్ల పేటెంట్ వైసీపీదే
- రాజారెడ్డి, వైఎస్ అరాచకాలు ప్రజలకు తెలుసు
- ఫేక్ బుక్‌లెట్‌తో మీ రక్తచరిత్ర మరువరు
- టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు షరీఫ్ ధ్వజం

మంగళగిరి(చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన ఆర్థిక, సామాజిక విధ్వంసాన్ని తుడిచిపెడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. జగన్‌రెడ్డి తన జగనాసుర రక్త చరిత్ర, గొడ్డలి పార్టీ అరాచకాలను పక్కదారి పట్టించేందుకే ఫేక్ బుక్‌లెట్ పేరుతో సరికొత్త డ్రామాలకు తెరతీశారని ఆయన మండిపడ్డారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యలయంలో గురువా రం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా 11 స్థానాలకు ప్రజలు బుద్ధి చెప్పి రెండేళ్లు అయింది. జనం ఇచ్చిన తీర్పును స్ఫూర్తిగా తీసుకో కుండా గొడ్డలి పార్టీ నేటికీ విధ్వంసం, వినాశనమే లక్ష్యంగా పేట్రేగిపోతోంది. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేక ప్రజలను దారిమళ్లించే ప్రయత్నం చేస్తు న్నారు. కనివిని ఎరుగని రీతిలో 24 లక్షల మందితో హైబ్రీడ్ మహానాడు దిగ్విజయం కావడంతో ఆ ప్రజాదరణను పక్కదారి పట్టించేందుకే జగన్ ఒక ఫేక్ బుక్‌లెట్‌ను మార్కెట్లోకి తెచ్చారు. పులివెందులలో రాజారెడ్డి, వైఎస్ఆర్ చేసిన అరాచకాలు విస్మర ణకు గురవుతుండటంతో జగన్ ఫేక్ బుక్‌లెట్‌తో విషప్రచారం చేస్తున్నారు. తాతను చంపిన వాళ్లని వదిలేశానని జగన్ చెప్పడం హాస్యాస్పదం. గొడ్డలి వేట్లు, వెన్నుపోట్లు జగన్‌రెడ్డి పేటెంట్లు. సొంత బాబాయ్ వివేకా గొడ్డలి వేటుతో హత్య చేసిన నింది తులకు జగన్ అండగా నిలిచి వెనకేసుకొస్తున్నారు. తెలంగాణ నాయకుడు కె.శివశంకర్ స్థాపించిన వైసీపీని జగన్ కబ్జా చేశారు. సొంత తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచారు. అన్న ఎన్టీఆర్ తెచ్చిన తండ్రి ఆస్తిలో సగభాగం మహిళలకు ఇవ్వాలన్న చట్టాన్ని జగన్ పూర్తిగా తూట్లు పొడిచారని వ్యాఖ్యానించారు.

### 85% హామీలకు జగన్ ఎగనామం

2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 85% హామీలకు జగన్ ఎగనామం పెట్టారు. సంపూర్ణ మద్యనిషేధం చేస్తానని నమ్మించి కల్తీ మద్యంతో రూ.3,500 కోట్లు దండుకున్నారు. జగన్ తెచ్చిన కల్తీ మద్యం వల్ల రాష్ట్రంలో 30 వేల మంది మహిళల మాంగల్యాలు తెగాయి. విద్యుత్ ఛార్జీలు పెంచనని చెప్పి ఏకంగా 9 సార్లు కరెంట్ బిల్లులు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపాడు. ఆర్టీసీ ఛార్జీలను 3 సార్లు పెంచి సామాన్యులను దోచుకున్నారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, అమ్మఒడి పేరుతో నిరుద్యోగులను, విద్యార్థులను వంచించారు. గొడ్డలి పార్టీ హయాంలో గంజాయి, డ్రగ్స్‌కు యువత బానిసలైం ది. ఉద్యోగాలు లేక 4,100 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసింది. ఇంట్లో ఒక్కరికే చదువు అనేది జగన్ సిద్ధాంతమైతే...ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం అందిస్తూ అందరూ చదువుకోవాలన్న విధానాన్ని చంద్రబాబు అమలు చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20,000 ఆర్థిక సాయం అందించాం. ఉచిత బస్సు సౌకర్యం ద్వారా ఇప్పటివరకు 67 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. దీపం-2 పథకం ద్వారా 4 కోట్ల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేశామని వివరించారు.



### 24 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం

యువగళం ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా సాగుతూ ఇప్పటికే 7 లక్షల ఉద్యోగాలు ప్రత్యక్షంగా పరోక్షంగా అందజేశాం. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సారథ్యం లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 24 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. జగన్ హయాంలో పరిశ్రమలు పారిపోతే.. కూటమి ప్రభుత్వంలో ప్రపంచ దిగ్గజ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొ చ్చాం. 16 వేల పోస్టులతో మెగా డీఎస్సీని భర్తీ చేయడంతో పాటు మరో 10 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. పీ4 కార్యక్రమం ద్వారా 2.10 లక్షల మంది మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరు స్తున్నాం. పేదల కడుపు కొడుతూ జగన్ మూసేసిన అన్న క్యాంటీన్లను, కూటమి ప్రభుత్వం 269 కేంద్రాల్లో పునః ప్రారంభించి పేదవాడికి మూడు పూటలా నాణ్యమైన భోజనాన్ని అందిస్తోంది. జగన్ రెడ్డి పెన్షన్ రూ.1000 పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకుంటే, కూటమి ప్రభుత్వం రాగానే ఒకేసారి రూ. 3 వేల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచి అమలు చేశాం. కేవలం 24 నెలల్లోనే పెన్షన్ల కోసం రూ.66 వేల కోట్లు ఖర్చు చేశాం. రాబోయే మూడేళ్లలో కలిపి రూ.2 లక్షల కోట్లను పెన్షన్ పథ కానికే ఖర్చు చేయబోతున్నాం. జగన్ ఐదేళ్ల కాలంలో ఇచ్చింది కేవలం రూ.84 వేల కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు.

### జగన్ పాలనలో ఆర్థిక, నేర విధ్వంసం

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన రూ. 1.14 లక్షల కోట్ల సబ్ ప్లాన్ నిధులను జగన్ దారి మళ్లించి ద్రోహం చేశారు. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం జగన్ పాలనలో 1,600 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు హత్యకు గురయ్యారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, ఇతర ప్రభుత్వ రంగాలకు సంబంధించి రూ.2.26 లక్షల కోట్ల బకాయి లు పెట్టి వెళ్లారు. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపి ఆర్థిక విధ్వంసం సృష్టించారు. అమరావతిపై మూడు ముక్కలాట ఆడి ఘోర పరాజయం పాలైన జగన్‌రెడ్డి, ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త డ్రామాలకు తెరతీశారు. ప్రజా రాజధాని అమరావతే అని నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వానికి 164 సీట్ల భారీ మెజారిటీ ఇచ్చారు. జగనాసుర రక్తచరిత్రపై వస్తున్న విమర్శ ల నుంచి తప్పించుకోవడానికి తెచ్చిన ఫేక్ బుక్‌లెట్ అబద్ధాలను నమ్మేందుకు తెలుగు ప్రజలు ఎవరూ సిద్ధంగా లేరని హితవుపలికారు.

చైతన్యరథం

## పుడమి అందాన్ని కాపాడుదాం..

# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

## నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

మారుతున్న ప్రపంచం, పెరుగుతున్న వాహన వినియోగంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. సాంకేతికంగా పురోభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో పర్యావరణ కాలుష్యం పెను భూతంగా మారుతోంది. కర్బన కాలుష్యంతో అంతుచిక్కని వ్యాధులు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ విధిగా పర్యావరణంపై అవగాహన ఉండాలనే ఉద్దేశ్యంతో 1972లో జరిగిన యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరపాలని నిర్ణయించారు. 1974 నుంచి విధిగా ప్రతీ ఏడాది జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. పర్యావరణం కాపాడుకోవడం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, ఇందులో ప్రజలు కూడా భాగస్వాములు కావాలనే ఆలోచనతో తెలుగుదేశం పార్టీ సైకిల్ యాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయని భావించి ప్రతీ ఒక్కరూ విధిగా సైకిల్‌పై తమ తమ రోజువారీ కార్యక్రమాలు చేసుకోవాలని పార్టీ భావించడం పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను తెలియజేస్తోంది. ఈ మేరకు విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు స్వయంగా సైకిల్ తొక్కి పార్టీ నాయకులకు పర్యావరణ పరిరక్షణ పట్ల మార్గనిర్దేశనం చేస్తారు.



### నా దేశం నా బాధ్యతగా ఇంధన పొదుపు:

పశ్చిమాసియా దేశాల యుద్ధం పుణ్యమాని ప్రపంచ దేశాలతో పాటు మన దేశం తీవ్ర ఇంధన సంక్షోభంలోకి వెళ్లింది. బ్యారెల్ ముడి చమురు ధర సెంచరీ దాటి 110డాలర్లకు చేరింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ "నా దేశం నా బాధ్యత" అనే సందేశం ఇచ్చారు. ప్రతీ ఒక్కరూ విధిగా ఇంధన పొదుపు చర్యలుపాటించాలని పిలుపునిచ్చారు. ప్రధాని పిలుపు మేరకు అనేక రాష్ట్రాలు ఇంధన పొదుపు చర్యలు పాటిస్తున్నాయి. మన రాష్ట్రం ఈ విషయంలో మరో ముందడుగు వేసి ప్రతీ శుక్రవారం "నో వెహికల్ డే"ను ప్రకటించింది. ఈవీ వాహనాల వినియోగం అవగాహన కల్పిస్తుంది. పొదుపు చర్యల్లో భాగంగానే ఎంతో వేడుకగా నిర్వహించాల్సిన మహా పండుగ మహానాడు కార్యక్రమాన్ని ఈసారి హైబ్రిడ్ విధానం లో జరిపి అనేక పార్టీలకు ఆదర్శంగా నిలిచారు. పర్యావరణ పరిరక్షణలో తమ బాధ్యతను తెలియజేశారు. పర్యావరణానికి మేలు చేకూర్చే హరిత ఇంధనాలపై ప్రభుత్వం దృష్టిసారించి అనేకప్రాజెక్టుల కు శ్రీకారం చుట్టింది. ఈరంగంలో సుమారు రూ.10 లక్షలకోట్లు పెట్టుబడులు లక్ష్యంగా పనిచేస్తోంది.

### ఉద్యమంగా మొక్కలు నాటే కార్యక్రమం:

అడవులు పర్యావరణానికి ఊపిరితిత్తులు.. మనం లేకుంటే అడవులు ఉండొచ్చు గానీ.. అవి లేకుంటే మన మనుగడ ప్రశ్నార్థకమే. ప్రతీ ఒక్కరు విధిగా అడవులతో పాటుగా వన్యప్రాణులు, పర్యావరణం రక్షించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన బాధ్యతను గుర్తు చేస్తుంటారు. 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. అందుకోసం 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాలని సంకల్పించారు. మధ్యంతర లక్ష్యంగా 2030 నాటికి 37 శాతం గ్రీన్ కవర్ సాధించాలని సంకల్పించారు. ఇందులో భాగంగానే సుమారు 2.5 కోట్ల విత్తన గోళీలను సిద్ధం చేసి డ్రోన్స్, హెలికాప్టర్ సహాయంతో వాటిని అడవుల్లో వేయనున్నారు.

### పర్యావరణ పరిరక్షణ :

దేశంలో ఏ రాష్ట్రానికి లేని సముద్ర తీరం మన సొంతం. ఈ తీరం వెంబడి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణతో పాటు విపత్తులు నుంచి సముద్ర తీర ప్రాంతాలను రక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తీరప్రాంతం వెంబడి 5 కి.మీ. వెడల్పుతో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏపీని మడ అడవుల సంరక్షణలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్ది.. మిష్టి పథకం కింద అడవుల శాతాన్ని పెంచుతున్నారు. 2026-27 బడ్జెట్‌లో అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు రూ.713 కోట్లు కేటాయించి పర్యావరణ పరిరక్షణలో తమ బాధ్యతను ప్రభుత్వం ప్రదర్శించింది. ఎకో-టూరిజాన్ని అభివృద్ధి చేస్తూ.. గిరిజన యువతకు ఉపాధి కల్పిస్తున్నారు. జూ పార్కుల నిర్వహణకు నిధులు కేటాయించి మూగ జీవులను సంరక్షిస్తున్నారు. మానవ-వన్యప్రాణి సంఘర్షణను తగ్గించి, వన్యప్రాణుల సంరక్షణను బలోపేతం చేయడానికి హనుమాన్ ప్రాజెక్టు ప్రారంభించారు.

### పర్యావరణ వ్యవస్థలపై జగన్ గొడ్డలి పోటు:

పర్యావరణ వ్యవస్థలను చెరపట్టేలా జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన సాగింది. ల్యాండ్ నుంచి శాండ్ వరకు అక్రమంగా దోచుకున్నారు. అడవులు, ఖనిజ సంపదను చెరపట్టి పర్యావరణ వ్యవస్థలను విచ్ఛిన్నం చేశారు. శేషాచలం అడవుల నుంచి విలువైన ఎర్ర చందనం కలపను అక్రమంగా ఖండా తరాలకు తరలించారు. కాకినాడలో మడ అడవులను అక్రమంగా నరికి పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూర్చారు. కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లు నరికి బొమ్మల తయారీకి వాడే విలువైన తెల్ల పొనికి కలపను అక్రమంగా తరలించారు. చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సుమారు 30 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించారు. కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చెరువు భూమిని ఆక్రమించి ప్యాలస్ నిర్మించారు. ఇలా ఐదేళ్లు అధికారం అడ్డం పెట్టుకుని బాధ్యత రహితంగా వ్యవహరించి పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూర్చారు.

మానవ మనుగడకు ఆధారం పర్యావరణం. అలాంటి పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చిత్తశుద్ధిగా వ్యవహరించాలి. అప్పుడే ఆవరణ వ్యవస్థలు విచ్ఛిన్నం కాకుండా ఉంటాయి. తద్వారా జీవ వైవిధ్యం మెరుగుపడి జీవుల మనుగడ ప్రశాంతంగా ఉంటుంది. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రభుత్వాలు గుర్తు చేయాలి. పౌరులు అందుకు అనుగుణంగా మెలిగి పర్యావరణ పరిరక్షణలో నేను సైతం అంటూ ముందుకు రావాలి.





# మైనారిటీల విద్యాభివృద్ధికి కృషి

- ◆చంద్రబాబు హయాంలోనే మైనారిటీల సంక్షేమం
- ◆మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్
- ◆ఎస్సెస్సీ, ఇంటర్ మైనారిటీ ప్రతిభావంతులకు సన్మానం

అమరావతి (చైతన్య రథం): మైనారిటీల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ బద్ధంగా కృషి చేస్తున్నదని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. రాష్ట్రస్థాయిలో పదవ తరగతి, ఇంటర్ విద్యలో అత్యుత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులను గురువారం మంత్రి సన్మానించి ఆశీర్వదించారు. వెలగపూడి సచివాలయం మూడవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్యతోనే తాము అనుకున్న ఉన్నతస్థాయికి యువత ఎదిగి దేశ నిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకోగలరని అన్నారు. మైనారిటీ కుటుంబాల్లో విద్యార్థుల శ్రేయోభివృద్ధికి కూటమి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవలనే వక్ఫ్ బోర్డు ద్వారా తాలిం ఏ హునర్ పథకం క్రింద కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్ విద్య కోసం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభగలిగిన 250మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఉచిత డీఎస్సీ శిక్షణ, పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మైనారిటీల సంక్షేమ శాఖ ఇంచార్జ్ సెక్రటరీ సూర్యకుమారి, మైనారిటీ కార్పొరేషన్ ఎండి యకూబ్ భాష, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండి శేఖర్, డిడి సరోజినీ, అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



### గోదావరి పుష్కరాల్లో
## నేత్ర వైద్య శిబిరాలు

**వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఆదేశం**

అమరావతి (చైతన్య రథం): వచ్చే ఏడాది జూన్‌లో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్ రైట్ టు సైట్ సొసైటీ' గవర్నింగ్ బాడీ సమావేశం 11 ఏళ్ల తర్వాత తొలిసారిగా మంత్రి అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో పారా మెడికల్, ఆఫ్తాల్మిక్ ఖాళీల భర్తీకి జీరో వేకెన్సీ విధానం అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. పారా మెడికల్ ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు నిర్వహణ, జాతీయ అంధత్వ నియంత్రణ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జ్ క్రీడకి, పేకాటకీ తేడా తెలియని గొడ్డలి పార్టీ

- ◆ 2025 డీఎస్సీని రద్దు చేయడం ఎవరి తరమూ కాదు
- ◆ పారదర్శకంగా ముగిసిన ఉపాధ్యాయ నియామకాలపై 9 నెలల తర్వాత వైసీపీ 'కాకిగోల'
- ◆ పేర్ని నాని అజ్ఞానానికి కృష్ణా జిల్లావాసిగా సిగ్గుపడుతున్నా
- ◆ 240 కేసులు వేసి నిరుద్యోగుల భవిష్యత్తును అడ్డుకోవాలని చూసిన కుట్ర వైసీపీది
- ◆ టీచర్లను వైన్‌షాపుల ముందు కాపలా పెట్టించారు
- ◆ ట్రోలింగులతో అవమానాలకు గురిచేసిన ఘనుడు జగన్
- ◆ వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లపై కనీస అవగాహన లేదు
- ◆ కమిటీల పేరిట వైసీపీవి కొత్త డ్రామాలు
- ◆ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ ధ్వజం

మంగళగిరి (చైతన్య రథం): గత వారం రోజులుగా డీఎస్సీ పరీక్షలు, నియామకాలపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ ఉనికి కోసమేనని మాజీ ఎమ్మెల్సీ ఏ.ఎస్. రామకృష్ణ తీవ్రంగా మండిపడ్డారు. 2025 ఆగస్టులోనే అత్యంత పారదర్శకంగా పూర్తయిన ఉపాధ్యాయ నియామకాలపై, దాదాపు తొమ్మిది నెలల తర్వాత ఇప్పుడు కళ్లు తెరిచి అక్రమాలు జరిగాయంటూ లబోదిబోమనడం ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి 'గొడ్డలి పార్టీ' అనే పేరు ఊరికే రాలేదు. సొంత బాబాయి వివేకానంద రెడ్డిని గొడ్డలిపోటుకు గురిచేసిన నాటి నుండి నేటి వరకు ఆ పార్టీ నైజం మారలేదు. రాష్ట్రంలో ఎక్కడ మంచి జరుగుతుంటే అక్కడ, ఎక్కడ పెట్టుబడులు వస్తుంటే అక్కడ, ఎక్కడ ప్రాజెక్టులు, పరిశ్రమలు వస్తుంటే అక్కడ గొడ్డలిపోటు పొడవడం ఆ పార్టీకి అలవాటుగా మారింది. ఇప్పుడు చివరికి నిరుద్యోగుల మెరిట్‌పై కూడా గొడ్డలిపోటు వేయడానికి సిద్ధపడ్డారు అని దుయ్యబట్టారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 148 రోజుల్లోనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా, నూటికి నూరు పాళ్లు పారదర్శకంగా డీఎస్సీని నిర్వహించిందని ఆయన గుర్తుచేశారు. దాదాపు 16,347 మంది అభ్యర్థులను పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేసి, వారికి నియామక పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. వాళ్లంతా ఇప్పటికే పాఠశాలల్లో చేరి విద్యార్థులకు పాఠాలు చెబుతుంటే, తొమ్మిది నెలల తర్వాత వచ్చి అక్రమాలు జరిగాయంటూ కాకిగోల చేయడం దుర్మార్గమన్నారు.

క్లాస్‌రూముల్లోనే దేశ భవిష్యత్తు తయారవుతుందన్న కొఠారీ కమిషన్ మాటలను నమ్మి, ఉపాధ్యాయ నియామకాల్లో రాజకీయ జోక్యాన్ని తీసేసిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావుకి, నారా చంద్రబాబు నాయుడుకి దక్కుతుందని రామకృష్ణ స్పష్టం చేశారు. ఒకప్పుడు జిల్లా పరిషత్ చైర్మన్ సిగరెట్ పెట్టె మీద పేరు రాసి ఇస్తే పరీక్షల్లేకుండానే టీచర్ ఉద్యోగాలు వచ్చేవి. ఆ వ్యవస్థను మార్చి, అర్హులైన వారికే ఉద్యోగాలు దక్కాలని డీఎస్సీ పరీక్షలను ప్రవేశపెట్టారు. అవినీతికి తావుండకూడదని ఇంటర్వ్యూలను సైతం రద్దు చేసి, కేవలం పరీక్షల్లో వచ్చిన మెరిట్ ఆధారంగానే నియామకాలు చేపట్టారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు హయాంలోనే రెండు లక్షల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని గుర్తు చేశారు.

తాను స్వయంగా డీఎస్సీ గైడ్స్, పుస్తకాలు రాసిన రచయితనని, తన పుస్తకాలు చదివి తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది నిరుద్యోగులు ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారని ఈ సందర్భంగా రామకృష్ణ గుర్తుచేశారు. డీఎస్సీ ప్రక్రియపై, దాని పారదర్శకతపై మాట్లాడే పూర్తి హక్కు తనకు ఉందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉపాధ్యాయుల పవిత్రమైన వృత్తిని, మెరిట్ సాధించిన అభ్యర్థుల భవిష్యత్తును వైసీపీ నేతలు అపహాస్యం చేయవద్దని హెచ్చరించారు.

### వైసీపీ మోసాలు బయటపెట్టిన రామకృష్ణ

వైసీపీ అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి ఒక్క వాగ్దానం పచ్చి అబద్ధమేనని రామకృష్ణ ధ్వజమెత్తారు. పాదయాత్రలో ఎన్నికల ప్రచారంలో "ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇస్తాం, మెగా డీఎస్సీ నిర్వహిస్తాం" అని డాంబికాలు పలికిన జగన్మోహన్ రెడ్డి, ఐదేళ్ల పాలనలో ఒక్కటంటే ఒక్క ఉపాధ్యాయ పోస్టునైనా భర్తీ చేశారా? అని బహిరంగ సవాల్ విసిరారు. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి ఉపాధ్యాయులను దారుణంగా వంచించారని, తుగ్లక్ విద్యా విధానాల వల్ల రాష్ట్రంలో విద్యావ్యవస్థ చిన్నాభిన్నమైందని మండిపడ్డారు. సబ్జెక్టు టీచర్ల కొరతతో, సింగిల్ టీచర్ స్కూళ్లతో ప్రభుత్వ బడులు నడిచాయని, వేలాది స్కూళ్లను మూసివేసి లక్షలాది మంది విద్యార్థులు బడి మానేసేలా చేసిన చరిత్ర జగన్ రెడ్డిదేనని విమర్శించారు.

### స్పోర్ట్స్ కోటాపై అబద్ధ ఆరోపణలు

మాజీ మంత్రి పేర్ని నాని స్పోర్ట్స్ కోటాలో 'బ్రిడ్జ్



ఆట' ఆడేవారికి ఉద్యోగాలు ఇచ్చారని, అది పేకాట అని వాగుతున్నారని రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. 'బ్రిడ్జ్' అనేది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన క్రీడ అని, 2018 ఆసియా క్రీడల్లో కూడా దీనిని అధికారికంగా ప్రవేశపెట్టారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'పర్సనల్ అండ్ ట్రైనింగ్ శాఖ' దేశవ్యాప్తంగా 65 క్రీడలను ప్రధానమైనవిగా గుర్తించిందని, ఆయా కేంద్ర నిబంధనలను ప్రామాణికంగా తీసుకుని మొత్తం 16,347 పోస్టుల్లో 3 శాతం క్రీడల రిజర్వేషన్ కింద దాదాపు 382 మందికి పూర్తి పారదర్శకంగా నియామకాలు జరిగాయని వివరించారు. స్పోర్ట్స్ కోటా కింద ఎంపికై పీడీలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అభ్యర్థులు తాము ఆడిన క్రీడలు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఎంత పారదర్శకంగా జరిగిందో స్వయంగా వీడియోలు పెట్టి చెబుతున్నారని గుర్తుచేశారు. మచిలీపట్నంలో రేషన్ బియ్యాన్ని పందికొక్కుల్లా దొంగ రవాణా చేసిన చరిత్ర ఉన్న పేర్ని నాని ఇప్పుడు నిరుద్యోగుల మెరిట్‌ను తప్పుబట్టడం సిగ్గుచేటని ఆగ్రహించారు.

### మొదటి సంతకం డీఎస్సీపైనే..

గత ఎన్నికల సమయంలో నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి హోదాలో మొదటి సంతకం డీఎస్సీ ఫైలు మీదే పెట్టారని రామకృష్ణ గుర్తుచేశారు. ఆనాడు ఆ సంతకం పెట్టేటప్పుడు తాను ఆయన పక్కనే ఉన్నానని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కూటమి ప్రభుత్వ నైజమని అన్నారు. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ సాగకూడదనే కుట్రతో వైసీపీ నేతలు ఏకంగా 240 కేసులు వేయించారని ధ్వజమెత్తారు. అమరావతి రాజధానిని అడ్డుకోవడానికి, రాష్ట్రానికి కంపెనీలు రాకుండా వరల్డ్ బ్యాంకుకు మెయిల్స్ పంపిన చరిత్ర ఉన్న వైసీపీకి, డీఎస్సీని అడ్డుకోవడం పెద్ద వింతేమీ కాదన్నారు.

### 2003 డీఎస్సీ వాళ్లకు న్యాయం

2003 నోటిఫికేషన్ ప్రకారం చంద్రబాబు నాయుడు హయాంలో అభ్యర్థులు పరీక్షలు రాస్తే, ఆ తర్వాత వచ్చిన రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నియామకాల్లో రెండేళ్లు తాత్సారం చేసిందని రామకృష్ణ ఎండగట్టారు. ఈలోపు 2004 సెప్టెంబర్ 1నుండి రాష్ట్రంలో సీపీఎస్ అమలులోకి వచ్చి, అభ్యర్థుల తప్పు లేకపోయినా వారిపై బలవంతంగా సీపీఎస్ రుద్దారని, దీనిపై వారు 23 ఏళ్లుగా పోరాడుతున్నారని చెప్పారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్‌రెడ్డికి నిజంగా ఉపాధ్యాయులపై ప్రేమ ఉంటే, తన తండ్రి చేసిన ఆ తప్పును ఎందుకు సరిదిద్దలేదని ప్రశ్నించారు. 2020 జూన్ 2న అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నిని కలిసి 2003 డీఎస్సీ వాళ్లకు ఓపీఎస్ ఇవ్వాలని కోరినప్పుడు ఆమె సానుకూలంగా స్పందించారని, కానీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కలిసి ఆ ప్రతిపాదనను నిరంకుశంగా తిరస్కరించారని వెల్లడించారు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 11,800 మంది 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ ఇస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల ఆ కుటుంబాల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

కోవిడ్ సమయంలో వైన్ షాపుల ముందు మందుబాబులను క్రమబద్ధం చేయడానికి ఉపాధ్యాయులను కాపలా పెట్టిన దౌర్భాగ్య చరిత్ర జగన్ రెడ్డిదేనని గుర్తుచేశారు. వైసీపీ సోషల్ మీడియా ద్వారా ఉపాధ్యాయులు పాఠాలు చెప్పరని, జీతాలు ఊరికే తీసుకుంటున్నారని సమాజంలో వారిని దారుణంగా కించపరిచారని విమర్శించారు.

ఈ డీఎస్సీ నియామకాలు పూర్తి పారదర్శకంగా హారిజాంటల్ ప్రాతిపదికన జరిగాయని విద్యాశాఖ కమిషనర్, సెక్రటరీలు స్పష్టంగా వివరించారన్నారు. అసలు వైసీపీ నేతలకు వర్టికల్ అంటే ఏంటి, హారిజాంటల్ అంటే ఏంటో కూడా అర్థం కాదని ఎద్దేవా చేశారు. ఎంతో కష్టపడి మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన 2025 డీఎస్సీ ఉపాధ్యాయుల ప్రతిభను, ఈ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించిన విద్యాశాఖ అధికారులను, టీసీఎస్ వంటి భాగస్వామ్య సంస్థలను కించపరచవద్దని హెచ్చరించారు.

ఈ డీఎస్సీని రద్దు చేయడం జగన్‌రెడ్డి కాదు కదా, ఆయన తాత, జేజమ్మ దిగి వచ్చినా సాధ్యం కాదని, అసలు ఆ పార్టీనే రాష్ట్ర ప్రజలు ఎప్పుడో రద్దు చేసేశారని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తాము చేసిన తప్పులను తెలుసుకుని నోరు మూసుకుని గమ్మున ఉంటేనే సమాజంలో కనీస గౌరవమైనా మిగులుతుందని రామకృష్ణ స్పష్టం చేశారు.

# నవ్యాంధ్ర పర్యాటకానికి "గ్లోబల్' కిరీటం"

- బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్
- గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ 2026 వేదికగా అవార్డు
- స్వీకరించిన పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- ఇది ఏపీ ప్రజల సంయుక్త కృషికి దక్కిన గుర్తింపు
- భావోద్వేగంతో ప్రకటించిన ఏపీ పర్యాటక మంత్రి
- సరికొత్త ఆలోచనలతో పెట్టుబడులు పెట్టాలని పిలుపు




అమరావతి/ తిరువనంతపురం (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త చరిత్ర సృష్టించింది. దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్-2026', ఆంధ్రప్రదేశ్‌ను లిలి"బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్"లిలిగా ఎంపిక చేసింది. కేరళలోని కోవాలంలో 'లీలా తిరువనంతపురం రావిజ్ హోటల్'లో జరిగిన ఈ ప్రతిష్టాత్మక బిజినెస్-టు-బిజినెస్, బిజినెస్-టు-కన్స్యూమర్ పర్యాటక వేదికపై కేరళ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి పి.సి. విశ్వనాథ్, ఎమ్మెల్యే మురళీధరన్, తిరువనంతపురం మేయర్ వి.వి. రాజేష్ల చేతుల మీదుగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ అవార్డును స్వీకరించారు.

అవార్డు స్వీకరించిన అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "ఈ అరుదైన పురస్కారాన్ని అందుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఇది నా వ్యక్తిగత ఘనత కాదు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దిశానిర్దేశంలో ఏపీ ప్రభుత్వం, పర్యాటక భాగస్వాములు మరియు రాష్ట్ర ప్రజలు కలిసి చేసిన సంయుక్త కృషికి దక్కిన గుర్తింపు" అని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించడంతో పాటు, నూతన పర్యాటక పాలసీ 2024-29 కింద ఇన్వెస్టర్లకు క్యాపిటల్ సబ్సిడీలు, 100శాతం ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ కల్పించడం, 7 యాంకర్ పర్యాటక హబ్‌లు, 25కు పైగా థీమాటిక్ సర్క్యూట్ల అభివృద్ధి.. ఇవన్నీ ఈ గుర్తింపుకు నాంది పలికాయి. 'వికసిత్ భారత్-2047' లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని మంత్రి వెల్లడించారు.

## జీటీఎం వేదికపై పెట్టుబడులకు పిలుపు

'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ 2026' ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్ ఆంధ్రప్రదేశ్ పర్యాటక స్టాల్‌ను ప్రారంభించి, బ్రోచర్లు పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ టూర్ ఆపరేటర్లతో ముఖాముఖి చర్చించి, 'హాలిడే ఇన్ ఏపీ' క్యాంపెయిన్‌ను వివరించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక వృద్ధి చూసి ప్రభావితమైన నిర్వాహకులు, వచ్చే ఏడాది సెప్టెంబర్ 27, 2027న వరల్డ్ టూరిజం డే సందర్భంగా 'జీటీఎం 2027' ఎక్స్‌పోను ఆంధ్రప్రదేశ్‌లోనే నిర్వహిస్తామని అధికారికంగా ప్రకటించారు. వెల్‌నెస్, క్రూయిజ్ టూరిజంలో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని ఆహ్వానిస్తూ, బీచ్, టెంపుల్స్, రివర్, బ్యాక్‌వాటర్స్, వైల్డ్‌లైఫ్, ఎకో, అడ్వెంచర్, క్రూజ్, కల్నరీ, కల్చర్, వెల్‌నెస్, హెరిటేజ్, బౌద్ధ పర్యాటకం భారతదేశంలోని ప్రతి అద్భుతం ఏపీలో ఉందని మంత్రి నొక్కిచెప్పారు.

## ఏపీ ఒక సంపూర్ణ పర్యాటక ప్యాకేజీ

ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమలతో పాటు 80 వేలకు పైగా దేవాలయాలు, 13 వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, 3 జాతీయ పార్కులు, దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్ (నాగార్జునసాగర్-శ్రీశైలం), భారతదేశంలో రెండవ అతిపెద్ద మడ అడవుల తీరం ఏపీ సొంతమని మంత్రి వివరించారు. చారిత్రక లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం, తిరుమల కొండలు, విశాఖలోని అరుదైన ఎర్రమట్టి దిబ్బలు యునెస్కో తాత్కాలిక ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు సంపాదించాయని తెలిపారు.

స్వదేశీ పర్యాటకుల సందర్శనలో దేశంలో నాలుగో స్థానంలో నిలిచిన ఏపీ 1,054 కి.మీ. తీరం, 283 అద్భుత బీచ్‌లు కలిగి, బ్యాక్‌వాటర్ వనరులలో దేశంలో రెండో స్థానంలో ఉంది. కడప జిల్లా గండికోట 'ఇండియాస్ గ్రాండ్ కాన్యన్'గా పేరుగాంచింది. 2025-26లో ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో 36.42 కోట్ల పర్యాటక సందర్శనలు నమోదు చేసింది. అంతర్జాతీయ పర్యాటకుల రాకలో 48% పైగా వృద్ధి సాధించింది. "ఆంధ్రప్రదేశ్ కేవలం సందర్శించే స్థలం కాదు అదొక అద్భుతమైన అనుభూతి. ప్రతి ప్రయాణం ఒక కథను చెబుతుంది; ప్రతి పర్యాటకుడు ఆ కథలో ఒక భాగమవుతాడు" అని మంత్రి దుర్గేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

## ఏపీ టూరిజాన్ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లిన ఘనత దుర్గేష్‌దే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే మంత్రి కందుల దుర్గేష్, 'బ్రాండ్ ఏపీ' పేరుతో సోషల్ మీడియా, అంతర్జాతీయ వేదికలపై డిజిటల్ బ్రాండింగ్‌ను సరికొత్తగా రూపొందించారని ప్రతినిధులు కొనియాడారు. విశాఖ, విజయవాడ, తిరుపతి, ఢిల్లీలలో రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్లు; చెన్నై, కోల్‌కతా, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీలలో రోడ్ షోలు; బెర్లిన్, లండన్ వంటి అంతర్జాతీయ వేదికలపై ఏపీ పర్యాటక వాణిని బలంగా వినిపించారు.

కేవలం టెంపుల్ టూరిజంకే పరిమితం కాకుండా ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్, బీచ్, క్రూయిజ్, కల్చర్, మెడికల్ టూరిజంలను ప్రోత్సహించారు. సీప్లేన్ సర్క్యూట్లు, వాటర్ స్పోర్ట్స్, కారవాన్ టూరిజం, లగ్జరీ టెంట్ సిటీలు, హోమ్‌స్టేలను అందుబాటులోకి తెచ్చారు. స్థానిక కళలు, వంటకాలు, హస్తకళలకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ పర్యాటకాన్ని బలోపేతం చేశారు.

కేవలం 24 నెలల్లో ఒబెరాయ్, తాజ్, మారియట్, హిల్టన్, హయత్, రాడిసన్ బ్లూ, నోవాటెల్ సహా 117 ప్రఖ్యాత సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకుని సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించారు. 8 పర్యాటక ప్రాజెక్టులకు రూ.430 కోట్ల కేంద్ర నిధులు సాధించారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఒక 'స్వర్ణయుగం'గా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# పంటను దొంగిలించిన వైసీపీ నేతలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

- కానిస్టేబుల్ ప్లాట్‌పై కబ్జాదారుల కన్ను.. న్యాయం చేయాలంటూ వినతి
- తండ్రి ఇచ్చిన భూమికి పట్టాదారు పాస్ పుస్తకం కోసం ఎదురుచూపు..
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు
- ఏపీ మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు





మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన పలువురు పౌరులు నేతలకు అర్జీలు సమర్పించి తమ సమస్యల పరిష్కారం కోసం విజ్ఞప్తి చేశారు.

## పంట దొంగతనంపై న్యాయం కోసం అభ్యర్థన

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం ఘని ఆతుకూరు గ్రామానికి చెందిన కొసరాజు కోటేశ్వర రావు అర్జీ ఇస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం.549/1ఎ కింద 2-69 సెంట్ల పట్టా భూమిపై 2024లో కోర్టు ద్వారా స్పష్టమైన యాజమాన్య ఉత్తర్వులు వచ్చాయని, భూమి పూర్తిగా తమ స్వాధీనంలో ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కష్టపడి పండించిన మినుము పంటను కోత కోసి నూర్పిడికి సిద్ధంగా ఉంచగా, స్థానిక వైఎస్సార్సీపీ అరాచక శక్తులకు చెందిన గుదే రాంబాబు, సుదా రాంబాబు తదితరులు అర్ధరాత్రి ట్రాక్టర్లతో పొలంలోకి చొరబడి పంటను దొంగతనంగా తీసుకుపోయారని వివరించారు. 2024 నుండి 2026 మధ్య ఇలాంటి దొంగతనాలు వరుసగా జరిగాయని, మూడు సార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా కంచికచర్ల పోలీస్ స్టేషన్ కేసు నమోదుకు వెనుకాడిందని పేర్కొన్నారు. 2024 డిసెంబర్‌లో ఏఎంసీ చైర్మన్ కోగంటి బాబు సమక్షంలో పోలీస్ స్టేషన్‌లో జరిగిన పంచాయితీలో నిందితులు దొంగతనం అంగీకరించి రూ.42,000 చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారని, అయినప్పటికీ నేటికీ చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నా రని తెలిపారు. నిందితులపై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని ఏపీ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్, ఏపీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావులకు అభ్యర్థించారు.

## 22ఏళ్ల ప్లాట్‌పై అక్రమ వాదన

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన ఆదినారాయణ అర్జీ ఇస్తూ.. తాను పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కర్నూలు జిల్లా కల్లూరు మండలం రామేశ్వర్ నగర్‌లో ఒక ప్లాట్‌ను 19-03-2004న చట్టపరంగా రిజిస్ట్రేషన్ చేయించి భార్య వరలక్ష్మి పేరిట కొనుగోలు చేశానని తెలిపారు. 22 ఏళ్లుగా పూర్తి డాక్యుమెంట్లు తమ వద్దే ఉన్నా, ఇటీవల వడ్డెల చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తి ఎలాంటి చట్టబద్ధమైన ఆధారాలు లేకుండా ఆ ప్లాట్‌పై హక్కు వాదిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని వివరించారు.

తమ ఆస్తిని అక్రమంగా లాక్కోవడానికి చేసే ప్రయత్నాలను అడ్డుకుని సమస్య పరిష్కరించాలని కోరారు.

## వీలునామా భూమిపై పట్టాదారు పాస్‌పుస్తకం కోసం

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పత్రి భవాని అర్జీ ఇస్తూ.. తన తండ్రి కొల్లిపర వెంకట కోటేశ్వర లింగం 08-01-2021న తెనాలి వెస్ట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో వీలునామా రిజిస్టర్ చేయించారని, ఆ వీలునామాలోని సి-షెడ్యూలు ప్రకారం సర్వే నెం.512-2, 514-3లలో మొత్తం 7 ఎకరాల 53 సెంట్ల భూమిలో 34 సెంట్లు తనకు చెందుతాయని తెలిపారు.

13-09-2021న తండ్రి మరణించిన నాటి నుండి ఆ భూమిపై తమకు హక్కులు సంక్రమించాయని, భర్త, తల్లిదండ్రులు కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్నానని వివరించారు. చట్టబద్ధంగా తనకు రాసిచ్చిన 34 సెంట్ల భూమిని సర్వే చేసి సబ్-డివిజన్ ప్రక్రియ పూర్తి చేసి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వరదల కారణంగా దెబ్బతిన్న పొలానికి మట్టి సాయం కోసం

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన కామేశ్వరి అర్జీ ఇస్తూ.. పాత రెడ్డిపాలెం గ్రామంలో తమ 2 ఎకరాల 37 సెంట్ల పొలం కాలువ వెంబడి ఉండటం వల్ల, గత రెండేళ్లుగా కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా సారవంతమైన మట్టి పూర్తిగా కొట్టుకు పోయి పొలం పల్లంగా మారిపోయిందని వివరించారు. దిగుబడి ఎకరానికి కేవలం 13 బస్తాలకు పడిపోవడంతో పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో ఉన్న భూమిలో ఒక ఎకరం తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చిందని చెప్పారు. మిగిలిన పొలాన్ని పనికొచ్చే స్థితికి తీసుకురావడానికి రాజధాని ప్రాంత నిర్మాణ పనుల నుంచి 25 లారీల మట్టిని ఉచితంగా సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛను, రేషను, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు సమర్పించారు. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు అందించగా, అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న వారు ఆర్థిక సహాయం కోసం అభ్యర్థనలు పెట్టుకున్నారు.

చైతన్యరథం

# బందిపోటు పాలన నుంచి విముక్తికి రెండేళ్లు

- ఐదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వైసీపీ నేతలు
- నేడు వెన్నుపోటు అంటూ నిరసనలు సిగ్గుచేటు
- వెన్నుపోటుకు, గొడ్డలి పోటుకు పేటెంట్ వారే
- సొంత చెల్లికి వెన్నుపోటు పొడిచింది ఎవరు?
- బాబాయిపై గొడ్డలి పోటు వేసింది ఎవరు?
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

అమరావతి(చైతన్యరథం): వైసీపీ బందిపోటు పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగి జూన్ 4తో రెండేళ్లు పూర్తయిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. బందిపోటుల్లా ఐదేళ్ల విధ్వంస పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న వైసీపీ నేతలు నేడు వెన్నుపోటు పేరుతో నిరసనలు చేయడం సిగ్గుచేటు అని ధ్వజమెత్తారు. వెన్నుపోటుకు, గొడ్డలి పోటుకు పేటెంట్ హక్కు వైసీపీదేనని, ఇచ్చిన హామీలు అమలు



చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచింది జగన్‌రెడ్డేనని పేర్కొన్నారు. పింఛను పెంపుపై మాట తప్పి వృద్ధులను, అమ్మఒడిపై మాట తప్పి మహిళలను, రైతు భరోసాపై మాట తప్పి రైతుల్ని ఇలా అన్ని వర్గాలకు వెన్నుపోటు ఓటు పొడిచింది జగన్ కాదా? 28 సంక్షేమ పథకాలు రద్దుచేసి దళితులకు, ఆదరణ పథకం రద్దు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కోత కోసి బీసీలకు వెన్నుపోటు పొడిచింది జగనే. తండ్రి ఆస్తిలో వాటా ఇవ్వకుండా సొంత చెల్లికి వెన్నుపోటు పొడిచింది ఎవరు? రాజకీయ లబ్ది కోసం సొంత బాబాయిపై గొడ్డలి పోటు వేసింది ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలియదా? బందిపోట్లు అంతా కలిసి వెన్నుపోటు అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

### నలుగురు చిన్నారులు మృతిపై దిగ్భ్రాంతి

ఒంగోలులోని చెరువుకొమ్ముపాలెం వద్ద నీటికుంటలో పడి నలుగురు చిన్నారులు మృతిచెందిన ఘటనపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రులకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని కోరుకుంటూ కుటుంబ సభ్యు లకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వేసవి సెలవుల్లో పిల్లలను చెరువులు, వాగులు వద్దకు వెళ్లకుండా వారిని ఓ కంట కనిపెడుతూ తల్లిదండ్రులు తగిన భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఆసుపత్రుల్లో మొక్కలు నాటాలి

**మంత్రి సత్యకుమార్ ఆదేశం**

అమరావతి (చైతన్య రథం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రులు, వైద్య కళాశాలల ఆవరణలో మొక్కలు నాటాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, ఇంధన పొదుపుపై సిబ్బంది, విద్యార్థులు, రోగులు, సందర్శకులందరికీ అవగాహన కల్పించాలని



సూచించారు. వీలైనంత మేర మొక్కలు పంపిణీ చేయాలని, పర్యావరణ స్ఫూర్తితో పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించాలని నిర్దేశించారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్ బాబు ప్రతి ఉద్యోగి కనీసం ఒక మొక్క నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. జూన్ 5న రాష్ట్రవ్యాప్తంగా కనీసం 12,500 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని మొక్కల మనుగడ నిష్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, పాఠశాలల్లో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ విష్ణువర్ధన్ ఆదేశించారు.

## సికిల్ సెల్ అనీమియా నిర్మూలన,

# పెసా చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి

**- ఉన్నతస్థాయి సమీక్షలో ఎన్‌సీఎస్‌టీ చైర్మన్ వెల్లడి**




విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి, గిరిజన సంక్షేమ కార్యక్రమాల అమలు, రాజ్యాంగపరమైన రక్షణలు, ఉద్యోగుల సమస్యలపై ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించామని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య, సభ్యుల బృందం తెలిపారు. గిరిజనుల హక్కులను పరిరక్షించడం, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ఈ పర్యటనల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.

స్థానిక వివంతా (గేట్‌వే) హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య, కమిషన్ సభ్యులు జటోతు హుస్సేన్, నిరుపమ్ చక్మా, కమిషన్ కార్యదర్శి ప్రశాంత్ కుమార్ సింగ్, డైరెక్టర్ డా. పి. కళ్యాణ్ రెడ్డిలతో మాట్లాడుతూ... రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కార్యక్రమాల అమలుతీరు, గిరిజన ప్రాంతాల్లోని వాస్తవ పరిస్థితులను సమీక్షించేందుకు నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎన్‌సీఎస్‌టీ) బృందం రాష్ట్రంలో పర్యటించిందని అన్నారు. రాష్ట్ర స్థాయి సమీక్షకు ముందు రెండు నుంచి మూడు రోజుల పాటు గిరిజన ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు, సమస్యలు, సూచనలు సేకరించడం కమిషన్ ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ అనీమియా సమస్య తీవ్రతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఈ వ్యాధి నిర్మూలన కోసం దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా కళాశాలల్లో విద్యార్థులతో 'యువ సంవాద' కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువతలో ఆరోగ్య చైతన్యం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

నేటి సోషల్ మీడియా యుగంలో యువత సరైన దిశగా పయనించాల్సిన అవసరం ఉందని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నిర్వహించే 'మన్ కీ బాత్', 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని తెలిపారు.

పెసా చట్టం పరిధిలోని గిరిజన ప్రజలతో ప్రత్యేకంగా 'జన సంవాద' కార్యక్రమం నిర్వహించి, వారి అభిప్రాయాలు, సమస్యలు, సూచనలను కమిషన్ సేకరిస్తోందని చెప్పారు. గిరిజన స్వపరిపాలనకు ఉద్దేశించిన పెసా చట్టం పూర్తిస్థాయిలో అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల పర్యటనల్లో సేకరించిన ఫీడ్‌బ్యాక్‌ను సమగ్ర నివేదిక రూపంలో సిద్ధం చేసి, రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే గౌరవ గవర్నర్ దృష్టికి కూడా కీలక అంశాలను తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన జరగబోయే రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో గిరిజనుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, పెసా చట్టం అమలు స్థితి, సికిల్ సెల్ అనీమియా నివారణ చర్యలపై సమగ్ర చర్చ జరపనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, కమిషన్ కార్యక్రమాలు ప్రజల్లోకి చేరాలంటే మీడియా కీలక పాత్ర పోషిస్తుందని కమిషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. అందుకే ప్రతి పర్యటనలో మీడియాతో ప్రత్యక్షంగా మాట్లాడి, క్షేత్రస్థాయి అంశాలను ప్రజలకు చేరవేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎమ్.ఎమ్. నాయక్, డైరెక్టర్ ఎస్. భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# కోకో బీన్స్ నాణ్యతా ప్రమాణాలపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

రాజమహేంద్రవరం (చైతన్య రథం): భారతీయ కోకో బీన్స్‌కు నాణ్యతా ప్రమాణాలు రూపొందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రవరంలోని ఐసీఏఆర్–ఎన్ఐఆర్‌సీఏలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార ప్రాసెసింగ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రధాన కోకో ఉత్పత్తి కేంద్రంగా ఎదుగుతోందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడం ద్వారా రైతులు అధిక ధరలు పొందవచ్చని, ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు ఆకర్షించేందుకు నాణ్యమైన ముడి పదార్థం కీలకమని వివరించారు. వర్క్‌షాప్‌లో ప్రస్తుతం రాష్ట్రంలో 38,671 హెక్టార్లలో కోకో సాగు జరుగుతోందని, ఏలూరు, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాలు ముఖ్యమైన ఉత్పత్తి కేంద్రాలని వెల్లడించారు. కోకోశాల (చెన్నై) వ్యవస్థాపకుడు నితిన్ చోర్డియా కోకో గింజల ఫర్మెంటేషన్, ఎండబెట్టడం, గ్రేడింగ్, నిల్వ పద్ధతులపై అవగాహన కల్పించారు. చాక్లెట్, కోకో పౌడర్, కోకో బటర్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ అవకాశాలను కూడా వివరించారు. కోకో సాగు, నాణ్యతా ప్రమాణాలు, ప్రాసెసింగ్‌పై సమాచారం కోసం తూర్పు గోదావరి జిల్లా ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ. దుర్గేష్‌ను 79950 87041 నంబర్‌లో సంప్రదించవచ్చు.

# తల సేమియా బాధితున్ని ఆదుకున్న ముఖ్యమంత్రి



మచిలీపట్నం (చైతన్యరథం): బసవతారకం వైద్యశాలలో ఉచితంగా చికిత్స చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తలసేమియా బాధితునికి సూచించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో తల సేమియాతో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడు చాగంటిపాటి వివేక్ కు అతని తాత తల్లి సమక్షంలో 35 వేల రూపాయల బ్యాంకు చెక్కును అందజేశారు.

గత మే నెల 1వ తేదీన పామర్రు నియోజకవర్గంలోని పమిడిముక్కల మండలంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ కాలనీలో లబ్దిదారులకు స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కాలనీలో చాగంటిపాటి వివేక్‌కు 15వేల పింఛను అందజేశారు. ఆ సమయంలో వివేక్ తల్లి సాయి ప్రసన్న, తాత దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ వివేక్ గత 13 సంవత్సరాల నుండి తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని, సప్తా ఫౌండేషన్ విజయవాడ వారి సహకారంతో రక్తం మార్పిడి చేయిస్తున్నామన్నారు. వైద్యం కోసం సాయం చేయాలని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన సీఎం చంద్రబాబు వారిని అన్ని విధాల ఆదుకుంటానని హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వెంటనే విచారించి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా హైదరాబాదులోని బసవతారకం వైద్యశాలలో ఉచితంగా బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించేందుకు ఏర్పాటు చేశారు.

ఇందుకోసం ముందుగా డోనార్ స్పెసిఫిక్ యాంటిజెన్ (డిఎస్ఏ) పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా వాటికయ్యే ఖర్చు 35 వేల రూపాయలను జిల్లా డిసిప్లినరీ కమిటీ పరిధిలోని పెనాల్టీ రుసుము నుండి జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన బ్యాంకు చెక్కును జిల్లా కలెక్టర్ చాగంటి పాటి వివేక్ కు అందజేశారు. అంతేకాకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ బ్యాంకు చెక్కును కూడా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్ దగ్గరుండి వారికి నగదుచేయించి అందజేశారు. ఈ సందర్భంగా చాగంటి పాటి వివేక్ వారి తల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజా తీర్పుకు రెండేళ్లు...

## అహంకార పాలననుంచి పునర్నిర్మాణ దిశగా ఏపీ అడుగులు

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో "జూన్ 4" సాధారణ ఎన్నికల ఫలితాల రోజు మాత్రమే కాదు. అది ఒక రాజకీయ మలుపు. విధ్వంస పాలనకు ముగింపు.. వికాస పాలనా దిశకు ఆరంభం. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంత శక్తివంతమైన ఆయుధమో దేశం ఎన్నోసార్లు చూసింది. కానీ 2024 జూన్ 4న ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన తీర్పు మాత్రం ప్రత్యేకమైంది. అది కేవలం ప్రభుత్వ మార్పు కాదు. ఐదేళ్ల అనుభవం తర్వాత ప్రజలు చెప్పిన స్పష్టమైన రాజకీయ సందేశం.

నేటికి కూటమి ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ రెండేళ్లను కేవలం అధికార మార్పు వార్షికోత్సవంగా చూడటం సరైంది కాదు. గత పాలనలో ఎదుర్కొన్న అనుభవాల నుంచి బయటపడి, కొత్త ఆశలతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్న ఐదు కోట్ల ప్రజల సామూహిక సంకల్పానికి ఇది రెండేళ్ల మైలురాయి.

### సస్యశ్యామల రాష్ట్రంనుంచి సంక్షోభాల చర్చల వరకు..

ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అంటే వ్యవసాయం, సాగునీరు, పాడిపంటలు, శ్రమజీవుల రాష్ట్రం. రైతు, కూలి, చిన్న వ్యాపారి, ఉద్యోగి, మధ్యతరగతి కుటుంబం వీళ్ల కష్టంపై రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిలబడింది. దేశంలో పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా గుర్తింపు పొందిన సందర్భాలూ ఉన్నాయి.

అయితే గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం గురించి జాతీయ స్థాయిలో వినిపించిన చర్చలు మాత్రం అభివృద్ధి కంటే అప్పులు, పెట్టుబడుల నిలిచిపోవడం, పరిశ్రమల సందిగ్ధత, రాజధాని వివాదాలు, పరిపాలనా వివాదాల చుట్టూనే తిరిగాయి. రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందనేకంటే, ఎందుకు అభివృద్ధి ఆగిపోయిందనే ప్రశ్న ఎక్కువగా వినిపించింది. రాష్ట్ర భవిష్యత్తు గురించి ప్రజల్లో ఆందోళన పెరిగిన కాలం అది. అవకాశాల కోసం యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు కనిపించాయి. ఉద్యోగాలకంటే రాజకీయ ఘర్షణలు ఎక్కువగా వార్తల్లో నిలిచాయి.

### సంక్షేమం పేరుతో సాగిన ఆర్థిక ప్రయోగాలు:

సంక్షేమం ఏ ప్రభుత్వమైనా చేపట్టాల్సిందే. పేదలకు భరోసా ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. కానీ సంక్షేమం అనేది ఉత్పాదక ఆర్థిక వ్యవస్థకు ప్రత్యామ్నాయం కాదు. ఆదాయం పెరగకుండా ఖర్చులు పెరిగితే చివరికి భారం ప్రజలపైనే పడుతుంది. వైసీపీ పాలనలో భారీ సంక్షేమ పథకాల పేరుతో ఉత్తుత్తి బటన్ నొక్కుడు కార్యక్రమాలు చేపట్టారు. అయితే వాటికి సమాంతరంగా రాష్ట్ర ఆదాయ వనరులు పెరిగాయా? పరిశ్రమలు వచ్చాయా? ఉపాధి అవకాశాలు విస్తరించాయా? అనే ప్రశ్నలకు సమాధానాలు ఆశించినంత స్పష్టంగా కనిపించలేదు. ఒక కుటుంబం ఆదాయాన్ని మించి ఖర్చు చేస్తే అప్పుల్లో కూరుకుపోతుంది. అదే సూత్రం రాష్ట్రాలకూ వర్తిస్తుంది. అభివృద్ధి ప్రాజెక్టులు, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి ఇవి కలిసి ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుస్తాయి. కానీ అప్పులపైనే ఆధారపడే విధానం దీర్ఘకాలిక పరిష్కారం కాదని ఆర్థిక నిపుణులు అప్పట్లోనే హెచ్చరించారు.

### పెట్టుబడిదారులకు సందేహాలు... యువతకు నిరాశలు:

పరిశ్రమలు రావాలంటే ప్రభుత్వంమీద విశ్వాసం ఉండాలి. విధానాల్లో స్థిరత్వం ఉండాలి. ఒప్పందాలకు గౌరవం ఉండాలి. పెట్టుబడిదారులు ఒక రాష్ట్రాన్ని ఎంచుకునే ముందు చూసేది రాజకీయ వాతావరణం కాదు, పరిపాలనా నమ్మకం. గత ఐదేళ్లలో ఈ అంశాలపైనే ఎక్కువ చర్చ జరిగింది. కొన్ని కీలక ప్రాజెక్టులు నిలిచిపోయాయి. అప్పటికే ప్రకటించిన కొన్ని పెట్టుబడులు ముందుకు సాగలేదు. పరిశ్రమల విస్తరణలో ఆశించిన వేగం కనిపించలేదు. దీని ప్రభావం నేరుగా యువతపై పడింది. చదువులు పూర్తిచేసిన వేలాది యువకులు ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణేవంటి నగరాలవైపు చూడాల్సి వచ్చింది. రాష్ట్ర అభివృద్ధి పట్టని వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్రంలో యువత భవిష్యత్తుపై దృష్టి పెడుతుందనుకోవడం భ్రమ అనే అనుకోవాలి.



### ప్రతీకార రాజకీయాలు పరిపాలనపై నీడ వేసిన కాలం:

ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజం. ప్రతిపక్షం అవసరం. భిన్నాభిప్రాయాలు ఉండాలి. కానీ పరిపాలన కంటే రాజకీయ ప్రతీకారానికే ప్రాధాన్యత పెరిగితే ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతుంది. గత పాలనలో రాజకీయ ప్రత్యర్థులపై చర్యలు, సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులు, విభేదించే స్వరాలపై దాడులు, ఇబ్బందులకు గురి చేయడం వంటి అంశాలు తరచూ చర్చకు వచ్చాయి. ప్రభుత్వ శక్తి ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాలా? లేక రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడానికా? అనే ప్రశ్నలు అప్పట్లో బలంగా వినిపించాయి. అధికారంలో ఉన్నవారు విమర్శలను భరించలేకపోతే ప్రజాస్వామ్యం బలపడదు. ఈ భావన సమాజంలో క్రమంగా పెరిగింది.

### రాజధాని అనిశ్చితి... రాష్ట్ర ప్రతిష్ఠకు దెబ్బ :

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని నిర్మాణం భావోద్వేగ అంశం మాత్రమే కాదు, ఆర్థిక అవసరం కూడా. ఒక స్పష్టమైన పరిపాలనా కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి కీలకం. కానీ రాజధాని అంశం అనేక వివాదాలకు కేంద్రంగా మారింది. విధాన మార్పులు, న్యాయపోరాటాలు, రాజకీయ ఘర్షణలు, రైతుల ఆందోళనలు ఇవన్నీ కలిసి రాష్ట్ర ప్రతిష్ఠపై ప్రభావం చూపాయి. ఒక పెట్టుబడిదారుడు ఏ రాష్ట్రానికైనా వచ్చేముందు అక్కడి విధానాలు రేపు మారిపోతాయా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తాడు. రాజధాని అంశంలో ఏర్పడిన అనిశ్చితి పెట్టుబడులపైనా ప్రభావం చూపిందనే అభిప్రాయం విస్తృతంగా వ్యక్తమైంది.

### రైతు పేరు ఎక్కువ... ఫలితం మాత్రం శూన్యం అన్న విమర్శలు:

రైతు గురించి మాట్లాడని ప్రభుత్వం ఉండదు. కానీ రైతుకు ప్రసంగాలు కాదు, ప్రయోజనాలు కావాలి. పంటకు గిట్టుబాటు ధర, సాగునీరు, మార్కెటింగ్ సదుపాయాలు, నిల్వ కేంద్రాలు, రుణ సౌకర్యాలు అవసరం. గత పాలనలో రైతు ఆదాయం పెరిగిందా? వ్యవసాయం లాభసాటిగా మారిందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు కనిపించలేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పు కనిపించకపోవడం కూడా ప్రజల అసంతృప్తికి కారణమైంది.

### ప్రజలిచ్చిన తీర్పు ఎందుకు చారిత్రాత్మకం?

2024 ఎన్నికల ఫలితాలు కేవలం ఓటమి-విజయాల లెక్కలు కాదు. అవి ప్రజల మనోభావాలకు ప్రతిబింబం. అధికారంలో ఉన్న నాయకత్వం అజేయమని భావించిన సమయంలో ప్రజలు తమ తీర్పుతో కొత్త రాజకీయ అధ్యాయాన్ని ప్రారంభించారు. ఒకసారి ప్రజలు నమ్ముతారు. రెండోసారి అవకాశం ఇస్తారు. కానీ ఆ నమ్మకం దెబ్బతింటే తీర్పు ఎంత కఠినంగా ఉంటుందో ఆ ఎన్నికలు చూపించాయి. అధికార అహంకారం ఎంత బలంగా కనిపించినా, ప్రజా తీర్పు ముందు అది నిలబడలేదని ఆ రోజు స్పష్టమైంది.

### రెండేళ్ల కాలంలో ఎన్నో మార్పులు:

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న వేళ రాష్ట్ర రాజకీయ వాతావరణంలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు, మౌలిక సదుపాయాలపై దృష్టి, రాజధాని అంశంలో స్పష్టత తీసుకురావాలన్న సంకల్పం, ఉపాధి అవకాశాల సృష్టి, సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర పునర్నిర్మాణం ఒకరోజులో జరిగే పని కాదు. ఐదేళ్లలో ఏర్పడిన సమస్యలను రెండేళ్లలో పూర్తిగా పరిష్కరించడం కూడా సాధ్యం కాదు. కానీ దిశ సరైనదా కాదా అనేది ప్రజలు గమనిస్తుంటారు. ప్రస్తుతం ప్రజల్లో కనిపిస్తున్న ఆశావాదానికి కారణం అదే.

### ప్రజాస్వామ్యం చెప్పిన శాశ్వత పాఠం:

జూన్ 4, 2024 ఒక ఎన్నికల ఫలితాల రోజు మాత్రమే కాదు. ప్రజాస్వామ్యం అధికారానికి చెప్పిన హెచ్చరిక. అధికారం శాశ్వతం కాదని, ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని గుర్తు చేసిన రోజు. వ్యక్తులు ఎంత పెద్దవారైనా, పార్టీలు ఎంత బలమైనవైనా, ప్రజల నమ్మకాన్ని కోల్పోతే వారి తీర్పు ఎంత తీవ్రంగా ఉంటుందో ఆంధ్రప్రదేశ్ మరోసారి నిరూపించింది. అదే సమయంలో ప్రజల ఆశలను గౌరవించి పనిచేసే వారికి ప్రజాస్వామ్యం అపారమైన మద్దతు కూడా ఇస్తుందని చూపించింది. రెండేళ్ల క్రితం ప్రజలిచ్చిన తీర్పు వెనుక ఉన్న అసలు సందేశం ఒక్కటే అభివృద్ధి కావాలి, అవకాశాలు కావాలి, స్థిరత్వం కావాలి, బాధ్యతాయుత పాలన కావాలి. రాజకీయ ప్రచారాలు కాదు, ప్రజల జీవితాల్లో మార్పు కావాలి. అందుకే జూన్ 4 కేవలం ఒక రాజకీయ విజయానికి గుర్తు కాదు. ప్రజల సహనం, ప్రజల చైతన్యం, ప్రజల శక్తి కలిసి రాసిన ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోని ఒక కీలక అధ్యాయం. ఆ అధ్యాయం ఇంకా కొనసాగుతోంది. భవిష్యత్ తరాలు కూడా ప్రజాస్వామ్య శక్తి గురించి మాట్లాడేటప్పుడు ఈ తీర్పును తప్పకుండా ప్రస్తావిస్తాయి. ఎందుకంటే చివరికి ప్రజలే యజమానులు... ప్రజలే చరిత్ర సృష్టికర్తలు.

### ఓటమినుంచి పాఠాలు నేర్చుకోని గొడ్డలి పార్టీ.. ఇంకా అదే దారి:

ప్రజాస్వామ్యంలో విజయం శాశ్వతం కాదు. అలాగే ఓటమి కూడా అంతిమం కాదు. కానీ ఓటమిని ఎలా స్వీకరిస్తారు, దానినుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకుంటారన్నదే ఒక రాజకీయ పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. చరిత్రను పరిశీలిస్తే ఘోర పరాజయాలను ఎదుర్కొన్న ఎన్నో పార్టీలు ఆత్మపరిశీలన ద్వారా మళ్లీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నాయి. అదే సమయంలో ప్రజల తీర్పును అర్థం చేసుకోలేక, తమ తప్పులను అంగీకరించలేక రాజకీయంగా కనుమరుగైన పార్టీలు కూడా ఉన్నాయి. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి ఇచ్చిన తీర్పు సాధారణ ఓటమి కాదు. అయితే రెండేళ్లు గడిచినా ఆ ఓటమి నుంచి అవసరమైన రాజకీయ పాఠాలు నేర్చుకున్న సంకేతాలు పెద్దగా కనిపించడం లేదనే అభిప్రాయం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రజలు ఎందుకు తిరస్కరించారో తెలుసుకునే ప్రయత్నం చేయడంకంటే, ప్రజలే తప్పు చేశారన్నట్లుగా మాట్లాడటం, పాత ఆరోపణలనే మళ్లీ పునరావృతం చేయడం, అదే సానుభూతి రాజకీయాలను కొనసాగించడం కనిపిస్తోంది.

ప్రజలు స్పష్టంగా తిరస్కరించిన అంశాలపైనే ఇప్పటికీ సమర్థన వినిపించడం మరింత ఆశ్చర్యకరంగా మారింది. సాధారణంగా ఓటమి తర్వాత పార్టీలు ప్రజల మధ్యకు వెళ్లి అభిప్రాయాలు సేకరిస్తాయి. నాయకత్వంలో మార్పులు చేస్తాయి. విధానాలను పునఃసమీక్షిస్తాయి. కానీ ఇక్కడ మాత్రం ప్రజలు ఇచ్చిన సందేశాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం కంటే, ఆ తీర్పును ప్రశ్నించే ధోరణే ఎక్కువగా కనిపిస్తోంది.

ఒకప్పుడు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల మాట వినని పార్టీ, ఓడిపోయిన తర్వాత కూడా ప్రజల తీర్పు వెనుక ఉన్న సందేశాన్ని అర్థం చేసుకోకపోతే అది మరింత ప్రమాదకర పరిస్థితి. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రజలు కేవలం ప్రభుత్వాలను మాత్రమే మార్చరు. రాజకీయ సంస్కృతులను కూడా మార్చేస్తారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు చేసింది అదే.

ప్రస్తుతం వైసీపీ ఎదుర్కొంటున్న అసలు సంక్షోభం.. ప్రజలు ఎందుకు దూరమయ్యారన్న విషయాన్ని అర్థం చేసుకోలేకపోవడమే. అదే పరిస్థితి కొనసాగితే ప్రజలు ఇచ్చిన హెచ్చరిక మరింత పెద్ద రాజకీయ సమస్యగా మారే అవకాశం ఉంది.

రాజకీయాల్లో పునరాగమనం అసాధ్యం కాదు. కానీ అందుకు ముందుగా ప్రజా తీర్పును గౌరవించాలి. తప్పులను అంగీకరించాలి. మార్పుకు సిద్ధపడాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజలు తిరస్కరించిన మార్గాన్నే మళ్లీ మళ్లీ నడుస్తూ ఉంటే, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోని పార్టీగా చరిత్రలో మిగిలిపోవాల్సి వస్తుంది.

అందుకే 2024లో ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం అధికార మార్పు మాత్రమే కాదు. అది ఒక రాజకీయ హెచ్చరిక. ఆ హెచ్చరికను అర్థం చేసుకున్న వారికి భవిష్యత్తు ఉంటుంది. అర్థం చేసుకోనివారికి ప్రజాస్వామ్యం మరోసారి తన తీర్పును చెబుతుంది.

- జమ్ము సాయి కల్యాణ్,
అనలిస్టు, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

## ఓటర్ జాబితాపై అవగాహన సమావేశం

● ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని ఆముదాలవలస మండలంలో కొత్తరోడ్ జంక్షన్ వద్ద శాంతి కన్వెన్షన్ హాల్‌లో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లతో ప్రత్యేక అవగాహన సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామాలు మరియు వార్డుల స్థాయిలో ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్షించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయాలని, ప్రతి కార్యకర్త పార్టీ మరియు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై బూత్ స్థాయి నాయకులకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై వివరంగా చర్చించారు. ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటరు జాబితా పకడ్బందీగా ఉండటం ఎన్నికల ప్రక్రియకు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు మరియు ఏజెంట్లు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైసీపీ అరాచక విధ్వంస పాలనకు సమాధి కట్టి రెండేళ్లు పూర్తి : ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): టీడీపీ సెల్ వారి ఆధ్వర్యంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో జరుగబోయే మహానాడు 2026 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యూజిలాండ్ దేశం వెళ్లిన విజయనగరం పార్లమెంటు సభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కలిశెట్టి అప్పలనాయుడు ఒక ప్రకటన విడుదల చేస్తూ... జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ అరాచక, విధ్వంస పాలనకు సమాధి కట్టి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఎంపీ న్యూజిలాండ్ నుంచి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి మార్గం నుంచి పూర్తిగా తప్పిపోయి, అన్ని రంగాల్లో వెనుకబడిపోయిన దుస్థితి ఏర్పడింది. పరిశ్రమలు రాష్ట్రాన్ని వీడి వెళ్లడం, యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడం, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం, రోడ్లు, మౌలిక వసతులు దెబ్బతినడం, ప్రజాస్వామ్య విలువలు క్షీణించడం వంటి పరిణామాలు రాష్ట్ర భవిష్యత్తును సంక్షోభంలోకి నెట్టాయి. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడం, ప్రతిపక్ష నాయకులు మరియు సామాన్య ప్రజలపై కక్షసాధింపు రాజకీయాలు చేయడం ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. రాష్ట్ర ప్రజల ఆశయాలు, యువత భవిష్యత్తు, రైతుల సంక్షేమం, అభివృద్ధి అన్నింటినీ పక్కనబెట్టి జరిగిన విధ్వంస పాలనను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు. అందుకే 2024 సాధారణ ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం, అభివృద్ధి మరియు సంక్షేమం సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి ప్రజలు ఘన విజయం అందించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల సృష్టి, మౌలిక వసతుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది.

## ఈదురుగాలుల బీభత్సం... నేలకూలిన వృక్షాలు



నర్సీపట్నం (చైతన్యరథం): అనకాపల్లి జిల్లాలోని పెద్దబొడ్డేపల్లి పరిధిలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలుల తీవ్రతకు స్థానిక రామ్ నగర్ కాలనీ, డాన్ బాస్కో కాలేజ్ తదితరచోట్ల రహదారులపై చెట్లు నేలకూలాయి. ప్రధానంగా పెద్ద బొడ్డేపల్లి వద్ద రామాలయం ప్రాంగణంలో ధ్వజస్తంభం వాలిపోయింది. ఇదే ప్రాంగణంలో సుమారు 40 ఏళ్ల వయసున్న భారీ వృక్షం కూలిపోయింది. భీమునిపట్నం-నర్సీపట్నం రహదారిలో లక్ష్మీపురం శెట్టిపల్లి తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

# తీరంలో సంబరం... మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో కలలకు సాకారం

●బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బరుకు మహర్దశ... నాడు నిర్లక్ష్యం నేడు వైభవం

●జిల్లాలో 17 635 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి పరంగా భరోసా



నిమ్మాడ /శ్రీకాకుళం జూన్ 4: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలలో భాగంగా మంత్రి అచ్చెన్నాయుడు తీసుకున్న చొరవతో బుడగట్లపాలెం హార్బరుకు వైభవం దక్కనుంది. గత ప్రభుత్వం జిల్లా జాలర్లకు మాటలు చెప్పడమే తప్ప పనులు ఏమీ చేయలేకపోయిందని,. తమ సర్కారు వచ్చాక నిర్లక్ష్యాలకు తావే లేకుండా పనులు చేపట్టి అనూహ్య అభివృద్ధి ఫలాలు ఇస్తామని ఎన్నికల వేళ ఆ రోజు కూటమి పెద్ద హోదాలో ఇప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇప్పటికే హార్బర్ల ఏర్పాటుకు అలానే పోర్టుల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నది. ఇందులో భాగంగానే ఇప్పటికే దాదాపు పనుల పూర్తితో మూలపేట పోర్టు ముందుండగా, ఇప్పుడు బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బరు కూడా అదే కోవలోకి చేరనుంది. దీంతో ఎన్నికల హామీలు కేవలం మాటలకే పరిమితం కావని చేతల్లో నిరూపించారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. మంత్రి అచ్చెన్నాయుడు.

**గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా**

బుడగట్లపాలెం హార్బరు పనులేవీ ముందడుగు వేయలేకపోయాయి. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు నిరాశే మిగిలింది. కూటమి ప్రభుత్వం పాలన పగ్గాలు అందుకున్నాక సంబంధిత వర్గాలలో ఆశలు నింపుతూ మత్స్యకార శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో..బుడగట్లపాలె ఫిషింగ్ హార్బరు పనులకు సంబంధించి నిధులు వచ్చాయి. కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు 444. 75 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ పరిపాలన పరం అయిన అనుమతులను మంత్రి అచ్చెన్న తీసుకుని వచ్చి విజయవంతం అయ్యారు. దీంతో ఎన్నికల నాటి హామీలను నెరవేర్చిన ఘనత మంత్రి అచ్చెన్నకే దక్కిందన్న ఆనందం ఇక్కడి మత్స్యకార కుటుంబాలలో వెల్లువెత్తుతోంది. పనులు పూర్తయితే సముద్ర అలల ఉద్ధృతిని తట్టుకునేలా బ్రేక్‌వాటర్లు, పడవలు సురక్షితంగా నిలిపేందుకు జెట్టీలు, మత్స్యకారులకు చెందిన పడవలను నిలుపుకునే కేంద్రాలతో పాటు అత్యాధునిక మౌలిక సదుపాయాలు దక్కనున్నాయి. దీనివల్ల చేపల వేట, నిల్వ, రవాణా సౌకర్యాలు మెరుగుపడి మత్స్యకారులకు ఆర్థికంగా భారీ ప్రయోజనం చేకూరనుంది.

**17,635 మత్స్యకార కుటుంబాలకు వరం..వలసలకు బ్రేక్**

జిల్లాలో దాదాపు 17,635 సాగర మత్స్యకార కుటుంబాలు ఇవాళ వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వేలాది కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపనుంది. బుడగట్లపాలెం హార్బర్ అందుబాటులోకి వస్తే స్థానికంగానే ఉపాధి లభించి, జిల్లాను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న వలసల నివారణ సులభతరం కానుంది. గంగపుత్రుల జీవనోపాధికి గట్టి ఊతం లభించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో మత్స్యకార వర్గాలు కూటమి ప్రభుత్వంపై, మంత్రి అచ్చెన్నాయుడిపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నాయి.

## గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యం

కురుపాం (చైతన్యరథం): గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా స్వచ్ఛ రథాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. గురువారం గుమ్మలక్ష్మీపురంలో కొమరాడ మండలానికి చెందిన స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా స్వచ్ఛరథంలో వేసి, అవసరమైన వస్తువులు పొందాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటకరంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు, నాయకులు వెంకటనాయుడు, సుదర్శన్‌రావు, పురుషోత్తం నాయుడు, శివ, కురుపాం ఎంపీడీవో జె ఉమామహేశ్వరి, స్వచ్ఛరథం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## మురికికాల్వల్లో మంచినీటి బోర్లా? : ఎమ్మెల్యే గంటా ఆగ్రహం



భీమిలి (చైతన్యరథం): మురికికాల్వల్లో బోర్లు తవ్వి నీరు వినియోగిస్తున్న వారికి భారీ జరిమానాలు విధించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. కలుషితమైన నీటి వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. తగరపువలసలో తీవ్రంగా ఉన్న డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలను గురువారం ఆయన పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీలో సాఫీగా ప్రవహించాల్సిన మురుగు నీటికి అడ్డంగా ఉన్న బోర్లు, మోటార్లు చూసి ఫైర్ అయ్యారు. పాతికేళ్లుగా ఈ బోర్లు వాడకంలో ఉన్నాయని తెలుసుకున్న ఎమ్మెల్యే.. అధికారుల తీరు పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలకు జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్‌ను ఆదేశించారు. మెయిన్ రోడ్డుపై వ్యాపారాల కారణంగా తగరపువలస జంక్షన్లో నెలకొంటున్న ట్రాఫిక్ జామ్ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్న నేపథ్యంలో భీమిలి తగరపువలస రోడ్డు కీలకం కానుందని, రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన మొదలు పెట్టాలన్నారు. అలాగే భీమిలి మెయిన్ రోడ్డు, నరసింహస్వామి ఆలయం రోడ్డు, బీచ్ రోడ్డు, గంట స్తంభం - బీచ్ రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు తక్షణమే కార్యరూపంలోకి తీసుకురావాలని చెప్పారు. భీమిలి అభివృద్ధి కోసం మంత్రి పి.నారాయణ, కమిషనర్ కేతన్ గార్గ్‌తో క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని వెల్లడించారు.

## గరివిడిలో గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు

గరివిడి (చైతన్యరథం): ప్రముఖ గాయకుడు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను గురువారం గరివిడిలో 'సహాయ్' స్వచ్ఛంద సేవా సంస్థ ఘనంగా నిర్వహించింది. జడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, సహాయ్ సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, గరివిడి మాజీ ఉప సర్పంచి బి. కార్తీక్‌తో పాటు సంస్థ సభ్యులు స్థానిక ఉపాధ్యాయ కాలనీలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సంగీత ప్రపంచానికి బాలసుబ్రహ్మణ్యం అందించిన సేవలు విశిష్టమైనవని, తన గానామృతంతో కోట్లాది మంది సంగీత అభిమానుల హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తే లేదు : ఎమ్మెల్యే బడేటి చంటి



ఏలూరు (చైతన్యరథం): అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ఏలూరు అసెంబ్లీ నియోజవర్గంలోని రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతాక్రమంలో ముందుకెళ్తున్నామని ఆయన వెల్లడించారు. ఏలూరు 19వ డివిజన్‌లోని గ్రీన్ సిటీలో నగరపాలక సంస్థ సాప్ట లోన్ నిధులు కోటి 18లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తోన్న సిసి రహదారి పనులను ఆర్టీసి విజయవాడ జోన్-2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడుతో కలిసి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్వయంగా పరిశీలించారు. తొలుత వారికి ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం రహదారి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే చంటి... పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇదేసమయంలో స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ స్థలాల వల్ల తలెత్తుతోన్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా... దానిపై తక్షణమే స్పందించిన ఆయన,,, ఖాళీ స్థలాల యజమానులు ఆయా స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే స్వచ్ఛత విషయంలో ప్రజలంతా సహకరించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం విషయంలో ఎక్కడా రాజీ లేకుండా ముందుకెళ్తున్నామని వెల్లడించారు. దఫదఫాలుగా ఒక్కో ప్రాంతంలోని రహదారిని నిర్మించుకుంటూ వచ్చామన్న ఆయన,,, మౌళిక సదుపాయాల కల్పనే తమ ప్రధాన ధ్యేయమని వివరించారు. దాంట్లో భాగంగానే ఊరి చివర్లో ఉన్న గ్రీన్ సిటీలో ప్రధాన రహదారి నిర్మాణానికి సత్వర చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు ప్రశాంతయుత జీవనాన్ని కొనసాగించేందుకు అవసరమైన ఆస్కారాలు పెంచడమే తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే చంటి,,, ఇదేక్రమంలో మరిన్ని ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

# చారిత్రాత్మక ప్రజా విజయానికి రెండేళ్లు : ఎంపీ కేశినేని శివనాథ్

**● కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసిన టీడీపీ నేతలు**



విజయవాడ (చైతన్యరథ:): విజయవాడ గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని చిన్ని కార్యాలయంలో కూటమి ప్రభుత్వ అభ్యర్థిగా ఎంపీ కేశినేని చిన్ని విజయం సాధించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించిన తరుణంలో పార్టీ క్యాడర్ సంబరాలు నిర్వహించారు మొదటిగా పార్టీ నాయకులు క్యాడర్ అందరూ కలిసి ఎంపీ చిన్ని విజయం మరియు కూటమి విజయాన్ని గుర్తు చేసుకుంటూ కేకును కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... దుర్మార్గుని కబంధహస్తాల నుండి రాష్ట్రం విడుదల పొంది రెండేళ్ల కాలం పూర్తయిందని కూటమి ప్రభుత్వ విజయానికి ప్రజలు ఘన స్వాగతం పలికారని అన్నారు. ప్రధాని మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి లోకేష్ సహకారంతో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి పదంగా ముందుకు వెళుతుందని ఇంకా ఈ విజయాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు దుష్ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. వైసిపి సైకో విధానాల నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తి పొందారని అన్నారు. వ్యక్తిగత కక్షలు వేధింపుల రాజకీయాలకు ప్రజల స్వస్తి పలికారని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనకబడిందని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకే కూటమికి ప్రజలంతా అండగా నిలిచారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఈ రాష్ట్రం సుపరిపాలన దిశగా అడుగులు వేస్తుందని అభివృద్ధి బాట పట్టిందని తెలిపారు.

# నిరుద్యోగులను మోసం చేసిన మోసగాడు జగన్

**●డీఎస్సీ గురించి మాట్లాడే అర్హత జగన్ అండ్ కోకి లేదు**

**● ప్రెస్ మీట్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షులు గురుమూర్తి**



మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలోని నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి విమర్శించారు. గురువారం మచిలీపట్నంలోని ఆర్కే ప్యారడైజ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం పది రోజులుగా మెగా డీఎస్సీ - 2026 నియామకాలపై జగన్ అండ్ కో చేస్తున్న విమర్శలను గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. మెగా డీఎస్సీ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. 2019 ఎన్నికల ముందు మేం అధికారంలోకి వస్తే 2.30లక్షల ఉద్యోగాలు ఇస్తాం, 23వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం అన్న జగన్ ఎన్ని పోస్టులు భర్తీ చేశాడో చెప్పాలన్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టునైనా భర్తీ చేశావా..? ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 11 డీఎస్సీలు నిర్వహించి 1.80వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర నారా చంద్రబాబు నాయుడుది అని అన్నారు. 2014-19 మధ్య కాలంలో 18వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి 16వేల మందిని ఉపాధ్యాయులుగా నియమించి నిరుద్యోగుల పట్ల తమకు ఉన్నచిత్తశుద్ధిని చాటుకున్నామన్నారు. ఐదేళ్లలో జగన్ ఒక టీచర్ పోస్టును కూడా భర్తీ చేయకుండా మెగా డీఎస్సీపై సిగ్గుమాలిన విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

**పేర్ని నాని శుద్ధపూస కాదు : జనసేన నేత బండి రామకృష్ణ**

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై మాజీ మంత్రి పేర్ని నాని రెచ్చిపోయి మాట్లాడుతున్నారని, రెచ్చిపోవడానికి కూడా అర్హత ఉండాలని మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. పేర్ని నాని శుద్ధ పూస కాదని, పేదల బియ్యాన్ని బొక్కేసిన గజ దొంగ అని విమర్శించారు. పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత వైసీపీలో ఎవరికీ లేదన్నారు. రక్త చరిత్ర కలిగిన జగన్ తన సొంత బాబాయ్‌ని గొడ్డలితో చంపించాడన్నారు.

**పేర్ని నాని ముందు తన ఇంట్లో లుక లుకలు సరి చేసుకోవాలి : టీడీపీ సీనియర్ నేత కొత్త నాగబాబు**

రాజకీయ సన్యాసం తీసుకున్న సన్నాసి పేర్ని నాని అని టీడీపీ సీనియర్ నాయకులు, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ కొత్త నాగబాబు విమర్శించారు. 2024 ఎన్నికల్లో రాజకీయ సన్యాసం తీసుకుని తన కొడుకుని వారసుడిగా పోటీ చేయించగా నీ కుటుంబం మాకు అవసరం లేదని 50వేల ఓట్లతో మచిలీపట్నం ప్రజలు ఓడించారన్నారు. పాము తన పిల్లలను తానే తిన్నట్టు పేర్ని నాని తన కొడుకు రాజకీయ భవిష్యత్తును తానే మింగేశాడని విమర్శించారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా పేర్ని నాని చేసిన పాపాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. పేదల బియ్యాన్ని బొక్కేసి ప్రభుత్వానికి కోటి రూపాయలు కట్టిన మోసగాడని విమర్శించారు. దెయ్యాలు వేదాలు వల్లించిన చందాన పేర్ని నాని మాటలు ఉన్నాయన్నారు. కూటమిలో లుక లుకలు ఉన్నాయని చెబుతున్న పేర్ని నాను ముందు తన ఇంట్లో ఉన్న లుకలుకలను సరి చేసుకోవాలని సూచించారు.

# అరాచక పాలనకు ముగింపు పలికిన ప్రజా ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తి

**●స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా వేగంగా అడుగులు**

**●రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు**



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అరాచకాలు, అవినీతి, విధ్వంసకర విధానాలకు ప్రజలు ముగింపు పలికి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన చారిత్రక సందర్భానికి నేటితో రెండేళ్లు పూర్తయ్యాయని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా పారదర్శక పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం అనే మూడు ముఖ్య లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పాలనలో రాష్ట్రం ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక రంగాల్లో వెనుకబడిందని, ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పునర్నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి ప్రధాన బలం అని పేర్కొంటూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. "స్వర్ణాంధ్రప్రదేశ్" లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన ఆయన, ప్రజల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. "ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకోవడం ఆనందదాయకం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో స్వర్ణాంధ్ర సాధన కోసం అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం" అని సానా సతీష్ బాబు పిలుపునిచ్చారు.

# తిరుమలలో టీటీడీ పర్చేజింగ్ కమిటీ రెండో రోజు సమావేశం

**●ఉద్యోగుల ఇళ్ల స్థలాలపై కీలక నిర్ణయాలు**



తిరుమల / జగ్గంపేట (చైతన్యరథం): తిరుమల అన్నమయ్య భవన్‌లో టీటీడీ పర్చేజింగ్ కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో రెండో రోజు కూడా కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, జీఎం పర్చేజింగ్ టీటీడీ, డిప్యూటీ ఈఓ టీటీడీ హౌస్ సైట్స్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా టీటీడీ ఉద్యోగుల సంక్షేమంపై చర్చించారు. ఎంప్లాయిస్ యూనియన్ లేవనెత్తిన పలు సమస్యలను పరిశీలించిన కమిటీ, ఉద్యోగస్తుల ఇళ్ల స్థలాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగులకు కేటాయించే హౌస్ సైట్ల ప్రక్రియను వేగవంతం చేసి, సత్వర పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టాలని తీర్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా ప్రతి అంశంలోనూ జవాబుదారీతనంతో వ్యవహరిస్తామని తెలిపారు. భక్తుల సంక్షేమంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి కూడా కమిటీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.

# చింతలపూడిలో సార్ ప్రక్రియపై అవగాహన



చింతలపూడి (చైతన్యరథం): రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆర్కె మినీ ఫంక్షన్ హాల్‌లో చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ నియోజకవర్గ పరిశీలకులు, మాజీ శాసనసభ్యులు రావి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికీ రెండు సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యత, ఓటరు జాబితా సవరణలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి చంద్ర శేషు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, నియోజకవర్గంలోని మండల, పట్టణ, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ మరియు బూత్ ఇంచార్జ్‌లు, బీఎల్ఏ నీటి సంఘాల అధ్యక్షులు మరియు సభ్యులు, KSS సభ్యులు, ప్రస్తుత మరియు మాజీ ఎంపీటీసీలు, పంచాయతీ మాజీ సర్పంచులు, PACS చైర్మన్లు మరియు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**●బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపు**



బాపట్ల (చైతన్యరథం): అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ అధిష్టానం పిలుపు మేరకు బాపట్ల నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు అందరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సాధ్యమైనంత వరకు తమ రోజువారీ కార్యక్రమాలకు సైకిళ్లను వినియోగించాలని కోరారు. ఇందులో భాగంగానే పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేడు విశాఖపట్నంలో ఎయిర్ పోర్ట్ నుంచి విడిది వరకు సైకిల్ ప్రయాణం చేస్తూ మనకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని గుర్తుచేశారు. సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం తగ్గడమే కాకుండా, ఇంధన వినియోగం తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుంది. ప్రస్తుత వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన "నా దేశం - నా బాధ్యత" అనే నినాదాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ ఇంధన వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించుకుని పర్యావరణానికి మేలు చేయాలని ఆకాంక్షించారు. పశ్చిమాసియా దేశాల యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తలెత్తిన ఇంధన సంక్షోభం నుంచి గట్టెక్కడానికి ఈ కార్యక్రమం ఒక ఊతంగా నిలుస్తుందని తెలిపారు.

# గొడ్డలి పార్టీకి ప్రజలు గుడ్ బై చెప్పి రెండేళ్లు : ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో గత ఐదేళ్లపాటు సాగిన వైసీపీ అరాచకం పాలన, రౌడీయిజం గొడ్డలి సంస్కృతికి ప్రజలు గుడ్ బై చెప్పి నాటికి సరిగ్గా రెండేళ్లు పూర్తి అయిందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన వరుస హత్యలు గొడ్డలి పార్టీకి నిదర్శనం అని అన్నారు. అధికార దాహం కోసం సొంత బాబాయ్ వివేకానంద అద్దె అతిపెద్ద నిదర్శనమని, రాజకీయంగా బాబాయి అడ్డు వస్తున్నాడని భావించిన జగన్ బిడ్డలతో నరికి చంపించిన చరిత్ర అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి సొంత చెల్లెలు షర్మిల బహిరంగంగా చెప్పారని, అక్రమ ఆస్తుల రక్షణ కోసం కడపలో పెద్ద దస్తగిరి నరికి చంపిన రక్త చరిత్ర జగన్ దని అన్నారు. పల్నాడు జిల్లాలో జల్లయ్య యాదవ్, పుంగనూరులో ఓ ప్రతాప్, కావలిలో కరుణాకర్ ఇలా అనేక మందిని గొడ్డలి పార్టీ పొట్టన పెట్టుకున్నారు. 2024 మేలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజ్యం పాలై ఆ పార్టీ రాష్ట్రంలో ప్రతిపక్ష స్థానానికి కూడా లేకుండా పోయిందన్నారు. ఎన్నికల్లో ఫలితాల్లో 175 స్థానాలకు వైసిపి 11 స్థానాలకే పరిమితం కాక, టీడీపీ - జనసేన- బీజేపీ కూటమి 164 స్థానాల్లో తిరుగులేని విజయం సాధించిందన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూలిపోయింది అని, పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు పారిపోయాయని ప్రజలంతా ఐక్యంగా ఇంటికి సాగనంపాలని అన్నారు.

# ఎన్డీఏ కూటమి రెండేళ్ల ప్రజా పాలన



విజయవాడ (చైతన్యరథం): ఎన్డీఏ కూటమి ప్రజా పాలన ప్రారంభమై విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హౌసింగ్ బోర్డు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పట్ల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

# రాక్షస పాలన అంతమై నేటికి రెండేళ్లు : మంత్రి కొలుసు పార్థసారధి



నూజివీడు (చైతన్యరథం): స్వర్ణాంధ్రను కూల్చివేతలతో దేశంలోనే అట్టడుగు స్థాయికి చేర్చిన రాక్షసుల పరిపాలన అంతమై నేటికి రెండేళ్లు. పరదాల గోడలను ప్రజలు ఓటు అనే ఆయుధంతో కూలగొట్టి, స్వేచ్ఛాయుతమైన ప్రజాస్వామ్య పాలనకు స్వాగతం పలికిన సుదినం జూన్ 4 2024వ తేది అని రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార మరియు పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారధి వ్యాఖ్యానించారు. "వైనాట్ 175 అని విర్రవీగిన కాలకేయ దొంగల ముఠాను క్రికెట్ టీమ్ సంఖ్య 11కు పరిమితం చేసి ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని ఈ దేశానికి తెలుగు ప్రజలు చాటి చెప్పిన సుదినం ఈరోజు. రెండేళ్ల ప్రజాస్వామ్యయుత పాలనలో దోపిడీలు లేవు, దొంగతనాలు లేవు, మహిళలపై అఘాయిత్యాలు లేవు, పోలీసుల నిర్బంధాలు లేవు, పరదాల గోడలు లేవు, భూకబ్జాలు లేవు, సరిహద్దు రాళ్లపై పేర్లు లేవు, పేదవారి భూములు కాజేసే దోపిడీ చట్టాలు లేవు, స్కీముల పేరుతో స్కాములు లేవు. తెలుగు ప్రజలు కోరుకున్న ప్రజాధాని అమరావతి పనులు పరుగులు పెడుతోంది, ఏపీకి వరప్రదాయిని పోలవరం ప్రాజెక్టు శరవేగంగా దూసుకుపోతుంది, దేశంలోనే పెట్టుబడుల ఆకర్షణలో 25.3శాతం నమోదు చేసి ఏపీని పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్ గా చేస్తూ... నిరుద్యోగ యువత కలలను సాకారం చేస్తూ, వారికి ఉద్యోగాలు ఇచ్చి ముందుకు నడిపిస్తోంది మన కూటమి ప్రభుత్వం." అని వ్యాఖ్యానించారు.

# మంచి పనులు చేసిన నాయకుల్ని ప్రజలు గుండేల్లో పెట్టుకుని పూజిస్తారు : మాజీమంత్రి దేవినేని ఉమా



కంచికచర్ల (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం కంచికచర్లలో దేవినేని వెంకటరమణ 27వ వర్ధంతి సందర్భంగా శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పలువురు నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెవిటికల్లు సెంటర్లో ఏర్పాటు చేసిన దేవినేని రమణ విగ్రహాన్ని ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్యతో కలిసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం కంచికచర్లలోని స్వర్గీయ దేవినేని వెంకటరమణ ప్రణీతల ఘాట్ వద్ద పుణ్యదంపతులు ప్రణీతా - రమణులకు తంగిరాల సౌమ్య, స్థానిక నాయకులతో కలిసి దేవినేని ఉమామహేశ్వరరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... మంచి పనులు చేసిన నాయకులను ప్రజలు గుండెల్లో పెట్టుకుని పూజిస్తారని, అందుకు దేవినేని రమణ ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. దేవినేని రమణ మరణించి 27 సంవత్సరాలు గడిచినా ఆయన ప్రజాదరణ, చరిష్మా ఏమాత్రం తగ్గలేదని అన్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన పేరు చరిత్రలోనే కాకుండా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 26వ డివిజన్‌లో రూ.2.62 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రత్తిపాడు (చైతన్యరథం): మన ఎమ్మెల్యే - మన వద్దకు కార్యక్రమంలో భాగంగా గురువారం గుంటూరు, 26వ డివిజన్, దాసరిపాలెం రూ.67.60 కోట్ల వ్యయంతో నిర్మించిన సి.ఆర్‌నగర్ (కల్లం ఇంజనీరింగ్ కాలేజీ రోడ్డు) బీటీ రోడ్డును ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తూరు ఆంజనేయస్వామి గుడి దగ్గర నుండి దాసరిపాలెం సిఆర్ నగర్ వరకు కార్యకర్తలతో కలిసి బైక్‌పై వచ్చి ప్రారంభించారు. అనంతరం శాసనసభ్యులు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయని, గత ఐదేళ్లలో పాలనలో అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కంటే విధ్వంసకర విధానాలకు ప్రాధాన్యత ఇచ్చారని, ఈ సందర్భంగా వైసీపీ నేతలకు ఒక్కసారి కూడా ప్రజల కష్టాలు కనబడలేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం - రాష్ట్ర అభివృద్ధి అనే ద్వంద్వ లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమించి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సంబంధిత అధికారులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే వసంత



విజయవాడ (చైతన్యరథం): మైలవరం నియోజకవర్గంలో నూతనంగా ఎంపికైన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు నియామక ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అందజేశారు. గురువారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఇటీవల 2 అంగన్వాడీ వర్కర్లు, 23 అంగన్వాడీ హెల్పర్ల పోస్టులను భర్తీ చేశారు. ఎంపికైన మొత్తం 25 మంది మహిళలకు ఎమ్మెల్యే వసంత స్వయంగా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతోందని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి సేవలకు అంతరాయం లేకుండా చూస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. నియామక పత్రాలు అందుకున్న మహిళలు సీఎం చంద్రబాబుకి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదుకి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగం రావడంతో తమ కుటుంబాలకు ఆసరా దొరికిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు. మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు స్పష్టం చేశారు. నూతన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

## గానగంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ

- బాలు విగ్రహం, ఎన్టీఆర్ పార్క్ నిర్వహణ బాధ్యతలు తీసుకున్న వీపీఆర్ ఫౌండేషన్
- విగ్రహం ఉన్నా లేకపోయినా ఆయన ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- 80వ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



నెల్లూరు (చైతన్యరథం): నడిబొడ్డున ప్రముఖ నేపథ్య గాయకులు, గానగంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహం వెంకయ్యనాయుడు చేత ఆవిష్కరించుకోవడం నెల్లూరు ప్రజలు అదృష్టంగా భావించాలన్నారు. విగ్రహ సమన్వయ కమిటీ సభ్యులు ప్రభు చెప్పినట్లు, ఆయన జీవితంలో ఏ వ్యక్తి గురించీ ప్రత్యేకంగా పాట పాడలేదు. కానీ, 2018లో నాకు అమెరికాలో ఓ అవార్డు వస్తున్న సందర్భంలో నా గురించి ఇక్కడ బాలు ప్రత్యేకంగా పాట పాడారని, దాన్ని అమెరికాలో రిలీజ్ చేశారని, ఈ విషయాన్ని తాను ఎప్పటికీ మర్చిపోలేనని ఎంపీ గుర్తుచేసుకున్నారు. మనం అందరం ఎప్పటికీ నెల్లూరు వాసిగా బాలసుబ్రహ్మణ్యంని గుర్తుంచుకోవాలని, ఆయన్ను సన్నిహితులు, మిత్రులు అందరూ ప్రేమగా 'మణి' అని పిలుచుకునేవారని పేర్కొన్నారు.

**విగ్రహ నిర్వహణ బాధ్యతలు తీసుకున్న వీపీఆర్ ఫౌండేషన్**

నెల్లూరులో మంచి సెంటర్లలో బాలు విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన విగ్రహ కమిటీ సభ్యులను ఎంపీ అభినందించారు. కమిటీ సభ్యులు ప్రభు, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కోరినట్లుగా.. బాలు విగ్రహం నిర్వహణ బాధ్యతలను వీపీఆర్ ఫౌండేషన్ తరపున తీసుకుంటున్నామని ఎంపీ ప్రకటించారు. దాంతో పాటు ఎన్టీఆర్ పార్కు నిర్వహణను కూడా తామే చూస్తామని, ఇప్పటికే అన్నమాచార్యుల విగ్రహం నిర్వహణను కూడా చూస్తున్నామని తెలిపారు. మాకు కూడా బాలు ఎప్పటికీ గుర్తుండిపోతారని, ప్రతి రోజు కూడా మా మనుషులు వచ్చి ఆయన విగ్రహానికి సేవలు చేయడం మాకు గర్వకారణమని, మంచి వ్యక్తులకు మంచి చేయడం ఎప్పటికీ నిలిచిపోతుందని స్పష్టం చేశారు.

**చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

అనంతరం కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. బాలసుబ్రమణ్యంకి నెల్లూరుకి విడదీయరాని బంధం ఉందని అన్నారు. కేవలం విగ్రహాలు పెడితే ఆయన బంధం పూర్తయ్యేది కాదని, విగ్రహం ఉన్నా లేకపోయినా ఆయన చిరస్థాయిగా ప్రజల మనస్సుల్లో నిలిచిపోయే వ్యక్తి అని చెప్పారు. ప్రజల మనసుల్లో నిలిచిపోవాల్సిన వ్యక్తి అని ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఏ కార్యక్రమం తలపెట్టినా విజయవంతంగా పూర్తి చేసే విగ్రహ సమన్వయ కమిటీ సభ్యులు శివప్రభాత్ రెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. మన నెల్లూరు ముద్దుబిడ్డ, గొప్ప కళాకారుడి విగ్రహాన్ని నెల్లూరు నడిబొడ్డులో అందరి సహకారంతో ఏర్పాటు చేశారని హర్షం వ్యక్తం చేశారు. శివప్రభాత్ రెడ్డి ఎస్పీ బాలసుబ్రమణ్యంపైన ఉన్న ప్రేమను ఈ విధంగా చూపుకున్నారని, బాలసుబ్రమణ్యం నెల్లూరుకు వచ్చినప్పుడు ఆయన ఎంతో ప్రేమగా బాలు వెంటే ఉండేవారని గుర్తుచేశారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహానికి, అలాగే ఇక్కడ ఉన్న పార్క్ నిర్వహణ బాధ్యత లభించడాన్ని విపిఆర్ ఫౌండేషన్‌కు దక్కిన అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొంటూ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి, విగ్రహ కమిటీ సభ్యులు శివప్రభాత్ రెడ్డి, ప్రభు, ఎస్పీ చరణ్, సంగీత దర్శకులు కీరవాణి, మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల పాలన ప్రజారంజకం

- ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో అభివృద్ధి వేగవంతం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం
- తూర్పులో అధోగతి నుంచి పురోగతి వైపు అడుగులు
- అన్ని ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల కల్పన
- భారీ కేక్ కట్ చేసిన తూర్పు నియోజకవర్గ కూటమి నాయకులు



గుంటూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ప్రజారంజకంగా సాగిందని గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి నాయకులు అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యునిగా నసీర్ ప్రమాణ స్వీకారం చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు సంబరాలు నిర్వహించారు. రెండేళ్ల కాలంలో ఎమ్మెల్యే నసీర్ ప్రజల వద్దకు ప్రభుత్వ పాలనను ఎమ్మెల్యే నసీర్ ఎలా తీసుకెళ్లింది? గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తూ అభివృద్ధికి బాటలు ఎలా వేసింది వంటి అంశాలపై చర్చించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పదవిని ఒక బాధ్యతగా తీసుకుని ముందడుగు వేశారన్నారు. రెండేళ్లలో ప్రజాసేవలో నిమగ్నమై గుంటూరు తూర్పును అభివృద్ధికి బాటలు వేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎటుచూసినా గుంతల రోడ్లు ఉండేవని, ఎమ్మెల్యే నసీర్ పట్టుదలతో అన్ని రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో వెనుకబడిన ప్రాంతాలను సవాల్ గా తీసుకుని అన్ని మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న నందివెలుగు బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో నిధులు రాబట్టారని తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన చేపట్టిన వెంటనే బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి రూ. 3 కోట్లకుపైగా నిధులు తెప్పించారన్నారు. అంజుమన్ పాఠశాలను ఎన్నడూలేని విధంగా తీర్చిదిద్దుతున్నారని, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరి గుమ్మానికి తీసుకెళుతున్నారని చెప్పారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇప్పటికే సుమారు రూ.11 కోట్లతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడారని తెలిపారు. ప్రజల గుండెల్లో నమ్మకాన్ని రెట్టింపు చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో పాలనలో పారదర్శకతతోపాటు ప్రతి ఇంటా సంతోషాలు తీసుకొచ్చారని చెప్పారు. యువతకు అండగా ఉపాధి జాబ్ మేళా, పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారని తెలిపారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మహోన్నత ఆశయంతో బడిబాట పట్టిన పిల్లలకు బంగారు భవిష్యత్తు అందిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు తామంతా కలిసికట్టుగా పని చేస్తామన్నారు.

## ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర



మార్కాపురం (చైతన్యరథం): రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే, టీడీపీ ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు ముక్కు ఉగ్రనరసింహ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక అమరావతి క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీలోని టీడీపీ వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనిగిరి మున్సిపాలిటీలో కోట్ల రూపాయల విలువ చేసే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు.. ఇలా ఎన్నో పనులు చేసినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన మినీ బైపాస్ పనులను కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఈనెల 6న జరుగనున్న అంబేద్కర్ క్యాంస విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కాలువ పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయాలి



నాగులుప్పలపాడు (చైతన్యరథం): జల ధార-జల హారతి కార్యక్రమంలో భాగంగా నాగులుప్పలపాడు మండలం చీర్వానుప్పలపాడు గ్రామంలో పంట కాలువల మరమ్మతు పనులను ఎమ్మెల్యే బి.ఎన్.విజయకుమార్, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు, గట్ల బలోపేతం, నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న అడ్డంకుల తొలగింపు వంటి పనులను చేపడతామన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలువ పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనుల ద్వారా సాగునీరు చివరి ఆయకట్టు వరకు చేరుతోందని, దీని ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

## గుడివాడలో వైసీపీ కవ్వింపు చర్యలు

- కూటమి నాయకులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే నినాదాలు



గుడివాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో రాక్షస పాలన పోయి.. రామరాజ్యం వచ్చి చంద్రన్న సుపరిపాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కూటమి నేతలు గుడివాడలో ర్యాలీ చేపట్టారు. అదే సమయంలో గుడివాడ పట్టణంలో వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ప్రజలకు చేసిందేమీ లేదని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. దీంతో గుడివాడ పట్టణంలో కాసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది. తెలుగుదేశం, వైసీపీ నేతలు ఎదురుపడే సమయంలో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారు. వైసీపీ నేతలను పాత కరెంట్ ఆఫీస్ రోడ్ మీదుగా.. కూటమి నేతలను మరో వైపు దారి మళ్లించారు. దీంతో ఎలాంటి గొడవలు లేకుండా ఇరు పార్టీల నేతలు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ కొనసాగించారు.

## అక్రమాలు జరిగినట్లు నిరూపించాలి : ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సవాల్

కడప (చైతన్యరథం): డీఎస్సీ ద్వారా ఒక్క అనర్హుడికైనా ఉద్యోగం వచ్చినట్లు నిరూపించాలని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి.. మాజీ ముఖ్యమంత్రి జగన్కు సవాల్ విసిరారు. కడప నగరంలోని హరిత హోటల్లో డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయుల బృందం, నిరుద్యోగ సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతపై గొడ్డలివేటు అనే అంశంపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వైసీపీ డీఎస్సీపై అసత్య ఆరోపణలు చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏఒక్క నిరుద్యోగికి ఉద్యోగం రాలేదు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వైకాపా దుష్ప్రచారం చేస్తోంది' అని ఆరోపించారు.

## నీటి కుంటలో దిగి నలుగురు చిన్నారుల మృతి

ఒంగోలు (చైతన్యరథం): ఒంగోలు నగర పరిధిలోని చెరువుకొమ్ముపాలెం వద్ద విషాదం చోటుచేసుకుంది. నీటికుంటలో మునిగి నలుగురు చిన్నారులు మృతిచెందారు. చెరువుకొమ్ముపాలెం వద్ద నీటి కుంటలో ఈతకు దిగి చిన్నారులు కరేటి అభిరామ్ (14), కరేటి సుశాంత్ (12), పొదిలి చిన్ను (11), ఇల్లా దినేష్ (10) గల్లంతయ్యారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని స్థానికుల సాయంతో గాలింపు చేపట్టారు. అనంతరం అన్నదమ్ములు అభిరామ్, సుశాంత్‌తో పాటు దినేష్, చిన్ను మృతదేహాలు లభ్యమయ్యాయి. చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**● ఆస్తుల భద్రత కోసమే రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి**



కొత్తచెరువు (చైతన్యరథం) రైతుల ఆస్తుల పరిరక్షణ, భూ హక్కుల భద్రత కోసమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు మండలంలోని తిరుమలదేవరపల్లిలో సుమారు 320 మంది రైతులకు, ఇరగంపల్లిలో సుమారు 142 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాసుపుస్తకాలపై ప్రభుత్వ గుర్తింపుకు బదులుగా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫోటోను ముద్రించడం ద్వారా భూముల విషయంలో అనేక అనుమానాలకు తావిచ్చారని విమర్శించారు. రైతుల పోటో బదులుగా జగన్ రెడ్డి ఫోటో ముద్రించడం భూ దోపిడీ కోసమేనన్నారు. వైసీపీ హయాంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ తీసుకొచ్చి రైతుల భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి కోట్లు రూపాయాలు దోచుకునే ప్రయత్నం ఆనాడు వైసీపీ నాయకులు చేశారని, కూటమి రాకతో ఆ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. రాష్ట్రంలో ఆందోళనలో ఉన్న రైతులకు చంద్రబాబు అండగా నిలబడ్డారని, గత ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్టర్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు వెంటనే వాటిని రద్దు చేసి రైతుల భూ హక్కులను పరిరక్షించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వ్యవసాయ రంగ అభివృద్ధితో పాటు రైతుల ఆస్తుల రక్షణకు కట్టుబడి ఉందని తెలిపారు.

పుట్టపర్తి నియోజకవర్గంలో కనివినీ ఎరుగనిన రీతిలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వెల్లడించారు. లక్ష కోట్లతో పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ విడిభాగాల పరిశ్రమ ఏర్పాటు వల్ల వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద సోలార్ ప్రాజెక్ట్ అమ్మడు మండలంలో 30 వేల ఎకరాల్లో సుమారు 51,400 కోట్లతో రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్రాజెక్టును త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు వల్ల ఈ ప్రాంత రైతాంగంతో పాటు నిరుద్యోగ యువతీ,యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలి

**●పార్టీ శ్రేణులకు ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచన**

**●ధర్మవరం పట్టణ, రూరల్ నాయకులతో ఎస్ఐఆర్‌పై సమావేశం**

**●ప్రతి ఓటు కీలకమే.. క్షేత్రస్థాయిలో బలంగా పని చేయాలన్న శ్రీరామ్**



ధర్మవరం (చైతన్యరథం): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు సూచించారు. ధర్మవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన పట్టణ, రూరల్ మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, కో కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్స్, వార్డ్ కమిటీ అధ్యక్షులతో పాటు ముఖ్యనాయకులంతా పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం ఈనెల 15వ తేది నుంచి చేపట్టబోతోందని కావున క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారన్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని వివరించారు. ఎస్ఐఆర్ జరుగుతున్న సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే మనకు సంబంధించిన ఓట్లు పోయే ప్రమాదం ఉందన్నారు. ఓట్ల ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోందని తెలిపారు. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకమని అన్నారు. గడిచిన ఎన్నికల్లో పని చేసిన విధంగానే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా మనం పని చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే మంత్రి నారా లోకేష్ పర్యటన, మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేశామని.. దీని ద్వారా ధర్మవరంలో పార్టీ సత్తా ఏంటన్నది తెలిసిందన్నారు.

# ఏపీ చరిత్రలో చిరస్థాయిగా నిలవనున్న 4 జూన్ 2024

**●గొడ్డలి పార్టీ విధ్వంసాన్ని తట్టుకోలేకనే 11స్థానాలకు పరిమితం చేసిన ప్రజలు**

**●వైసీపీ నిరసనలపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం**

**●పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ సైకిల్ వాడుదాం**

**●పార్టీ శ్రేణులు, ప్రజలకు ఎమ్మెల్యే సునీత పిలుపు**



రాప్తాడు (చైతన్యరథం): జూన్ 4 అంటే రాష్ట్ర ప్రజలు గొడ్డలి పార్టీకి చరమగీతం పాడిన రోజు అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాష్ట్రంలో వైసీపీ చేపట్టిన వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమంపై ఆమె తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో జూన్ 4, 2024 చిరస్థాయిగా నిలిచిపోయే రోజు అని సునీత అన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపించేలా మరోసారి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేశారన్నారు. వైసీపీ విధ్వంసానికి ముగింపు పలికి, అభివృద్ధి యుగానికి నాంది పలికేలా కూటమి విజయం సాధించిన ఈ రోజు మరపురానిదన్నారు. గెలిచిన రోజు నుంచి ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తూ.. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారన్నారు. ఇప్పటికే కీలకమైన హామీలన్నీ నెరవేర్చామని.. రాష్ట్రంలో ప్రజలంతా సంతోషంగా ఉండటం చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేక నిరసనలు తెలియజేస్తున్నారన్నారు. వారి నిరసన కార్యక్రమాలు చూసి ప్రజలే నవ్వుకుంటున్నారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన విధ్వంసం ఒక ఎత్తైతే రాప్తాడు నియోజకవర్గంలో ఇంకో రకంగా జరిగిందన్నారు. రాప్తాడు ప్రాంతంలోని మహిళలకు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని జాకీ పరిశ్రమ తీసుకొస్తే.. కేవలం తమకు కమీషన్ ఇవ్వలేదన్న ఉద్దేశ్యంతో ఆ పరిశ్రమను వెల్లగొట్టారన్నారు. ఆ విధంగా ఎంతో మంది మహిళలకు అన్యాయం చేశారన్నారు. అక్కడితో ఆగకుండా డ్వాక్రా మహిళల నుంచి కోట్ల రూపాయలు వసూళ్లు చేసి అమ్మ డైరీ పేరుతో మరో దోపిడీ చేశారన్నారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామని నమ్మబలికి.. రాక్రీట్ సంస్థ ద్వారా అమాయక ప్రజల నుంచి డబ్బు వసూళ్లు చేశారన్నారు. ప్రభుత్వ సొమ్మును దోపిడీ చేశారన్నారు. ఇవే కాకుండా పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులను గత టీడీపీ ప్రభుత్వంలో తాము మొదలు పెడితే.. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క గంపెడు మట్టి కూడా తీయకుండా కాలం గడిపారన్నారు. కనీసం భూములిచ్చిన రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. ఇవే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా భూదోపిడీలు, అక్రమాలు, దౌర్జన్యాలు సాగించారన్నారు. ఈ రెండేళ్లలోనే జాకీ స్థానంలో రేమాండ్స్ పరిశ్రమ తీసుకొచ్చామని, పేరూరు ప్రాజెక్టు పనులు మళ్లీ ప్రారంభించామన్నారు.

**ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కండి.. ఎమ్మెల్యే సునీత పిలుపు**

పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోజు ప్రతి ఒక్కరూ సైకిల్ వినియోగించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఆమె పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు నేడు ఒక్కరోజు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సాధ్యమైనంత వరకు సైకిళ్లను వినియోగించాలని ఆమె సూచించారు.


# ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలి : ఏపీఎస్‌ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు




అనంతపురం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం శ్రీకారం చుడుతున్నామని... పర్యావరణ పరిరక్షణే ప్రతిఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని చాటిచెప్పేందుకు నేడు ఒక్క రోజు ఎమ్మెల్యేలు, వివిధ పదవులలో ఉన్నవారు ఒక్కరోజు సైకిళ్ళను వినియోగించుకోవాలని ఏపీఎస్‌ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూలనాగరాజు పిలుపునిచ్చారు. ప్రపంచం నేడు తీవ్రమైన వాతావరణ మార్పులను ఎదుర్కొంటోందని, ప్రకృతిని కాపాడుకోవడం కోసం ప్రభుత్వాలే కాదు, ప్రజలు కూడా భాగస్వాములు కావాలనేదే తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఉద్దేశ్యమన్నారు. ఈ ఆలోచనతోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహణ కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యంగా భారత ఎన్నికల సంఘం వారు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (S.I.R.) పేరుతో జూన్ 15 నుంచి చేపట్టబోయే కార్యక్రమంపై ఎమ్మెల్యేలందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి మొదులుకొని క్లస్టర్, యూనిట్ మరియు ముఖ్యంగా పోలింగ్ బూత్ కన్వీనర్లు మీ స్థానిక BLOలతో కలిసి డోర్ టూ డోర్ కార్యక్రమంలో పాల్గొనాలి. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలక్షన్ కమిషన్ నిర్వహించే ఈ కార్యక్రమం చాలా కీలకమైనదని ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పూల నాగరాజు పేర్కొన్నారు. బూత్ స్థాయిలో ఉన్న మన పార్టీ కన్వీనర్.. ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా చూడాలి, దీనిపై క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు బూత్ కన్వీనర్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటరు జాబితా పకడ్బందీగా ఉండటం ఎన్నికల ప్రక్రియకు ఎంతో కీలకమని పూల నాగరాజు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు మరియు ఏజెంట్లు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# గన్నవరం అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమీక్ష

**●విజయవాడ కార్యాలయంలో ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమావేశం**



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనులను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాల సంబంధించిన పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా పనుల వేగం పెంచాలని, అదే సమయంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించాలని సూచించారు.

# నార్వే శిశు కేంద్రీకృత విద్యా విధానం భేష్

## మహిళలకు ఉపాధి కల్పనలో కిండర్ గార్డెన్ల పాత్ర కీలకం

## ఓస్లోలో మూడో రోజు పర్యటనలో ఎంపీలు శ్రీభరత్, శబరి



**ఓస్లో (నార్వే):** భారత-నార్వే నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ టూర్‌లో భాగంగా భారత పార్లమెంటరీ ప్రతినిధుల బృందం నార్వే రాజధాని ఓస్లోలో విస్తృతంగా పర్యటిస్తోంది. మూడో రోజు బృందం సభ్యులతో పాటు తెలుగుదేశం పార్టీ ఎంపీలు మతుకుమిల్లి శ్రీభరత్, బైరెడ్డి శబరి అక్కడ ప్రాథమిక విద్యా విధానాలు, సామాజిక మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఓస్లోలోని ప్రసిద్ధ 'సెయిల్డుకెన్ కిండర్‌గార్డెన్'ను ఎంపీలు సందర్శించారు. ఒకటి నుంచి ఆరు సంవత్సరాల వయసు గల పిల్లలకు నార్వే అమలు చేస్తున్న ప్రారంభ శైశవ విద్యా విధానాన్ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సురక్షితమైన, సమగ్రమైన సంపూర్ణ శిశు-కేంద్రీకృత వాతావరణంలో సంరక్షణ, ఆటపాటలు, అభ్యసనలను ఎలా మేళవిస్తోందో ప్రత్యక్షంగా చూసి అభినందించారు.

నార్వేలో అందుబాటులో ఉన్న నాణ్యమైన కిండర్‌గార్డెన్ వ్యవస్థల వల్ల కుటుంబ, వృత్తిపరమైన జీవితాల మధ్య సమతుల్యత సాధ్యమవుతోందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఇటువంటి పటిష్టమైన సంరక్షణ వ్యవస్థలు ఉండటం వల్లే మహిళలు ఉద్యోగాల్లో చేరడం, దేశ ఆర్థిక వ్యవస్థలో వారి భాగస్వామ్యం పెరగడం వంటి సానుకూల మార్పులు వస్తున్నాయని ప్రతినిధులు పేర్కొన్నారు.

### ఓస్లోమెట్ వర్సిటీలో కీలక చర్చలు

ఆ తర్వాత ప్రతినిధుల బృంద సభ్యులు ఓస్లో మెట్రోపాలిటన్ యూనివర్సిటీని సందర్శించింది. అక్కడ అందుబాటులో ఉన్న 'బ్యాచిలర్ ప్రోగ్రామ్ ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ అండ్ కేర్' గురించి సుదీర్ఘంగా చర్చించారు. చిన్న పిల్లల విద్యా వికాసంలో శిక్షణ పొందిన, అర్హులైన ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తేలింది. ప్రాథమిక స్థాయిలోనే నాణ్యమైన బోధన అందించడం ద్వారా సమాజంలో అద్భుతమైన మార్పులు తీసుకురావచ్చున్నారు. బాల్య విద్యా వ్యవస్థలపై చేసే ఖర్చు కేవలం వ్యయం కాదని, అది సమాజ భవిష్యత్తు కోసం చేసే ఒక అద్భుతమైన దీర్ఘకాలిక పెట్టుబడి అని ఇరు దేశాల ప్రతినిధులు స్పష్టం చేశారు. బాల్యంలోనే పటిష్టమైన విద్యా పునాదులు వేయడం ద్వారా మరింత సమగ్రమైన, సమానత్వంతో కూడిన, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని ఈ చర్చలు హైలైట్ చేశాయి.









# మెల్‌బోర్న్‌లో ఎంపీ హరీష్ బాలయోగి పర్యటన





## విక్టోరియా పార్లమెంటు సందర్శన, శీతాకాల సమావేశాల వీక్షణ

## ఆస్ట్రేలియా ప్రజా ప్రతినిధులతో భేటీ

**మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా):** అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లారు. మెల్‌బోర్న్ నగరంలోని ప్రతిష్టాత్మక విక్టోరియా పార్లమెంటును సందర్శించి ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాలను, ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించారు. ఆస్ట్రేలియాకు చెందిన పలువురు కీలక ప్రజాప్రతినిధులు, రాజకీయరంగ ప్రముఖులతో ఎంపీ హరీష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఐవాన్ వాల్టర్స్ MP (మల్టీకల్చరల్ అఫైర్స్ పార్లమెంటరీ సెక్రటరీ), కాథ్లీన్ మాథ్యూస్-వార్డ్ MP (బ్రాడ్‌మెడోస్ స్టేట్ మెంబర్), నటాలీ హచిన్స్ MP (విద్య, మహిళ, ఒప్పందాల శాఖ మాజీ మంత్రి), మిస్టర్ ఉరోస్ రాసిక్ (ఆస్ట్రేలియన్ లేబర్ పార్టీ - విక్టోరియా అధ్యక్షుడు), మిస్టర్ మెంగ్ హియాంగ్ టక్ MP (క్లారిండా స్టేట్ మెంబర్), మిస్టర్ ప్రవీణ్‌కుమార్ (ALP బ్రాడ్‌మెడోస్ బ్రాంచ్ ప్రెసిడెంట్)లతో పలు అంశాలపై చర్చించారు. బహుళ సంస్కృతీకరణ, స్థానిక సమాజాల్లో కమ్యూనిటీ ప్రాతినిధ్యంపై అభిప్రాయాలను విస్తృతంగా పంచుకున్నారు. ముఖ్యంగా విక్టోరియా రాష్ట్ర సామాజిక, ఆర్థిక, పౌర రంగాల అభివృద్ధిలో ఆస్ట్రేలియాలోని భారతీయ డయాస్పోరా (భారతీయ సమాజం) అందిస్తున్న అమూల్యమైన సహకారాన్ని, వారి పాత్రను నేతలు ప్రత్యేకంగా కొనియాడారు. భారత్-ఆస్ట్రేలియా దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ, శాశ్వత భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో అక్కడి భారతీయ కమ్యూనిటీ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రెండు దేశాల మధ్య ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలకు ఈ పర్యటన ఒక బలమైన నిదర్శనమన్నారు.







## మెల్‌బోర్న్ టీడీపీ నేతల ఆత్మీయ స్వాగతం

**మెల్‌బోర్న్:** మెల్‌బోర్న్‌లో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడులో పాల్గొనేందుకు అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి విచ్చేశారు. ఆయనకు టీడీపీ మెల్‌బోర్న్ అధ్యక్షుడు శ్రీకాంత్ కొనిదెన, మోహన్ కమ్మ, ప్రకాశ్ సూరపనేని, సుమన్ దాసరి, శ్రీకర్ రావి, సూర్య ఘన్ని, సుమంత్ రెడ్డి, సాయికృష్ణ, నితిన్ విపర్ల, భరత్ కడియాల, శ్రీకాంత్ సరిపూడి, ఇతర నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ స్వాగతం పలికారు.



# చల్లని కబురు..

**కేరళం, తమిళనాడుల్లోకి నైరుతి రుతుపవనాలు!**

మండుటెండలు, తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడి పోతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు కేరళం, తమిళనాడు రాష్ట్రాల్లోకి అధికారికంగా ప్రవేశించాయి. వీటి ప్రభావంతో ఆయా తీర ప్రాంతాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నా యి. ఇదే క్రమంలో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి కూడా ప్రవేశిస్తాయని వాతావరణ విభాగం వెల్లడించింది.

**ఎల్‌నినో ప్రభావంతో కాస్త ఆలస్యంగా..**

గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కేరళం తీరాన్ని తాకడం కాస్త ఆలస్యమైంది. వాస్తవా నికి మే 26వ తేదీనే ఇవి కేరళం తీరాన్ని తాకే అవ కాశం ఉందని భారత వాతావరణ విభాగం తొలుత అంచనా వేసింది. కానీ ఈసారి 'ఎల్‌నినో' ప్రభావం వల్ల వాతావరణ అంచనాలు తలకిందులయ్యాయి. రుతుపవనాల రాకతో కేరళలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తు న్నాయి. దీంతో అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్-సెప్టెంబరు) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదు కావచ్చని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90% వర్షం మాత్రమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని.. జూన్ నెలలో ఇవి కాస్త బలహీనంగా ఉన్నప్పటికీ సెప్టెంబరు నాటికి మాత్రం చాలా బలంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

# రూ.1.5 లక్షలకు డీల్

**టీచర్ ఉద్యోగ పరీక్షలో దొరికిపోయిన 'నకిలీ' అభ్యర్థి**

లక్నో: ఎంట్రన్స్ పరీక్షలో ఉత్తీర్ణత కోసం ఒక వ్యక్తి రూ. 1.5 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. అసలు అభ్యర్థికి బదులు పరీక్ష రాసేందుకు అతడు ప్రయత్నించాడు. అనుమానించిన సిబ్బంది ఆ నకిలీ అభ్యర్థిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో ఈ సంఘటన జరిగింది. ఉత్తరప్రదేశ్ ఎడ్యుకేషన్ సర్వీస్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ట్రైనీ గ్రాడ్యుయేట్ టీచర్ పరీక్ష నిర్వహించారు. బరేలీలోని ఇస్లామియా గర్ల్స్ ఇంటర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో ఒక నకిలీ అభ్యర్థిపై సిబ్బందికి అనుమానం కలిగింది. అతడి ఆధార్ కార్డు, అడ్మిట్ కార్డు, బయోమెట్రిక్ డేటాను నిశితంగా పరిశీలించారు. మరో అభ్యర్థి స్థానంలో ఆ వ్యక్తి పరీక్ష రాస్తున్నట్లు నిర్ధారించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. కాగా ఆ వ్యక్తిని ప్రమోద్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు. అతడ్ని ప్రశ్నించగా విమల్ కుమార్ స్థానంలో పరీక్ష రాయడానికి రూ. 1.5 లక్షలకు ఒప్పందం చేసుకున్నట్లు చెప్పాడు. ఇప్పటికే కొంత డబ్బు అందుకున్నానని, పరీక్షలో ఉత్తీర్ణత తర్వాత మిగిలిన మొత్తం అందుతుందని వివరించాడు. ఈ నేపథ్యంలో ప్రమోద్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసలు అభ్యర్థి విమల్ కుమార్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.



## ఎక్కువ క్వాలిఫికేషన్ కుదరదు

# సుప్రీంకోర్టు సంచలన తీర్పు!

ఉద్యోగాలకు నిర్దేశించిన విద్యార్హతల కన్నా ఎక్కువ క్వాలిఫికేషన్ ఉన్నవారిని అనుమతించడం వల్ల, ఆయా పోస్టులకు అసలైన అర్హత కలిగిన అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక బ్యాంకు అటెండెంట్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ గతంలో మద్రాస్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేసింది.



**అసలు ఏం జరిగిందంటే?**


సదరు ఉద్యోగి తాను గ్రాడ్యుయేట్ (డిగ్రీ పాస్) అనే విషయాన్ని దాచిపెట్టి.. ప్రత్యేకించి 10వ తరగతి వరకు మాత్రమే అర్హత ఉన్న అభ్యర్థులకు కేటాయించిన బ్యాంకు అటెండెంట్ ఉద్యోగంలో చేరాడు. ఈ విషయాన్ని మద్రాస్ హైకోర్టు గతంలో విస్మరించిందని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. సదరు ఉద్యోగిని సర్వీస్ నుంచి తొలగిస్తూ బ్యాంకు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు పూర్తిగా సమర్థించింది. నిర్దేశించిన విద్యార్హతలకు అనుగుణంగానే అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాలని స్పష్టం చేసింది.

**సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు:**

ఉద్యోగ నియామకాల్లో విద్యార్హతలపై పరిమి తులు విధించడంవెనుక ఉన్నసామాజిక అవసరాన్ని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా విశ్లేషించింది. "ఉద్యోగ అవకాశాలకు సంబంధించి విద్యార్హతలకు నిర్దిష్ట పరిమితి పెట్టడం వెనుక సహేతుక, న్యాయ మైన కారణాలు ఉన్నాయి.ఆయా సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత విద్య చదవలేని వ్యక్తులకు ఉపాధి కల్పించడం కోసమే ఇలాంటి నిబంధనలు తెచ్చారు. అటువంటి వెనుకబడిన లేదా తక్కువ చదువుకున్న వ్యక్తులకోసం ప్రభుత్వం కొన్ని కేటగిరీల పోస్టులను రిజర్వ్ చేయడం పూర్తిగా సమర్థనీయమే. తద్వారా తక్కువ విద్యార్హ తలు గలవారు.. ఎక్కువ విద్యార్హతలు (హయ్యర్ క్వాలిఫికేషన్) ఉన్నవారితో పోటీపడాల్సిన అవసరం ఉండదు. ఇటువంటి విధానాన్ని న్యాయస్థానాలు గతంలోనూ సమర్థించాయి" అని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

# పంజాబ్‌లో బాంబు కలకలం

**ఒకేసారి ఐదు ప్రముఖ ఆలయాలకు డెడ్లీ ఈ-మెయిల్స్**



పంజాబ్‌లోని ఐదు ప్రముఖ దేవాలయాలకు గురువారం భారీ బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ రావడం తీవ్ర కలకలం రేపింది. దేవాలయాలతో పాటు కొన్ని ప్రభుత్వ సంస్థల్లో కూడా పేలుళ్లు జరుపుతామని సదరు ఈ-మెయిల్‌లో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన భద్రతా దళాలు, పోలీసులు ఆయా ఆలయాల వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మరో రెండు రోజుల్లో ప్రతిష్ఠాత్మక 'ఆపరేషన్ బ్లూ స్టార్' జరిగి 42ఏళ్లు పూర్తికానున్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. పోలీసుల సమాచారం ప్రకారం.. పంజాబ్‌లోని ఈ కింది ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి:

**అమృత్‌సర్‌లోని దుర్గియానా ఆలయం**

పఠాన్‌కోట్‌లోని ముక్తేశ్వర్ రామ్ ఆలయం
జలంధర్‌లోని దేవీ తలాబ్ మందిర్
భటిండాలోని మైసర్ ఖానా ఆలయం
పటియాలాలోని మాతారాణి ఆలయం

ఆపరేషన్ బ్లూ స్టార్ ఘోరకలి రోజు (సంతాప దినాలు) సమీపిస్తుండటంతో ఇప్పటికే పంజాబ్ వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ బెదిరింపు మెయిల్‌తో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. అయితే ఇప్పటికే దేవీ తలాబ్ ఆలయం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఉద్దేశంతో చేసిన నకిలీ బెదిరింపుగా దీనిని భావిస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి రిస్క్ తీసుకోకుండా తనిఖీలు కొనసాగిస్తున్నారు.

**ఏంటీ 'ఆపరేషన్ బ్లూ స్టార్'**

1984 జూన్ నెలలో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం (గోల్డెన్ టెంపుల్) ప్రాంగణంలో దాక్కున్న తీవ్రవాదులను అణచివేసేందుకు భారత సైన్యం చేపట్టిన భారీ సైనిక చర్యే 'ఆపరేషన్ బ్లూ స్టార్'. మేజర్ జనరల్ బ్రార్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ఆపరేషన్, భారత సైన్యం చేపట్టిన అత్యంత పెద్ద అంతర్గత సైనిక చర్యల్లో ఒకటిగా నిలిచింది. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆదేశాల మేరకు ఈ సైనిక చర్యను చేపట్టారు. ఆలయ పవిత్రతను కాపాడే క్రమంలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో 83 మంది భారత సైనికులు అమరులయ్యారు. తీవ్రవాద నేత జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలేతో పాటు పలువురు తీవ్రవాదులు ఈ ఆపరేషన్‌లో హతమయ్యారు.

# ఢిల్లీ అగ్నిప్రమాదం...

**4 రోజుల కస్టడీలోకి హోటల్ ఓనర్**

న్యూఢిల్లీ: ఢిల్లీ మాల్వీయ నగర్‌లోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆ హోటల్ ఓనర్ లవ్‌కేశ్ బజాజ్‌ను నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపిస్తూ ఢిల్లీ కోర్టు మేజిస్ట్రేట్ భానుప్రతాప్‌సింగ్ ఆదేశించారు. దర్యాప్తు కోసం కస్టడీలోకి తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు అభ్యర్థించారు. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 105 (హోమిసైడ్), 326 (జీ) (అగ్నిప్రమాదం), 324(5) (ప్రాపర్టీ డ్యామేజ్), 125(ఎ) (భద్రతా నిర్లక్ష్యం), 125 (బి) (తీవ్ర నిర్లక్ష్యం), 287 (అగ్నిప్రమాదం వేళ నిర్లక్ష్యం) కింద కేసు బుక్ చేశారు.

ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిలో ఎక్కువ శాతం మంది విదేశీయులు ఉన్నారు. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి బంధువులే ఆ మృతుల్లో ఉన్నారు. అయితే ఏ కారణం చేత మంటలు వ్యాపించాయో ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఫ్లోరిష్ స్టే హోటల్ కోసం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద హోటల్ ఓనర్ బజాజ్ లైసెన్సు తీసుకున్నారు. కానీ ఆ లైసెన్సు ప్రకారం అతిథులకు కేవలం ఆరు రూమ్‌లు మాత్రమే ఉంటాయి. కానీ ప్రాథమిక విచారణ ప్రకారం.. ఫ్లోరిష్ స్టేలో 25 రూమ్‌లు ఆపరేటింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బేస్‌మెంట్‌లో ఉన్న అకామిడేషన్‌ను కూడా వాడుతున్నారు.

ఆ ప్రాపర్టీకి మొత్తం ఓనర్ బజాజ్ ఒక్కడే. జై మిత్రా అనే వ్యక్తికి మేనేజ్మెంట్ అప్పగించినట్లు ఆయన చెప్పారు. అయితే మిత్రా కోసం ప్రస్తుతం పోలీసులు గాలిస్తున్నారు. అతను పరారీలో ఉన్నాడు. బీఅండ్‌బీ స్కీమ్‌ను 2007లో ప్రవేశపెట్టారు. ఆ స్కీమ్‌లో సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన వసతి ఇవ్వనున్నారు.

# పశ్చిమాసియాలో కీలక అడుగు..

## ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య సీజ్‌ఫైర్ ఒప్పందం



వాషింగ్టన్: పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలను తగ్గించే దిశగా ఒక కీలక దౌత్యపరమైన ముందడుగు పడింది. అమెరికా మధ్యవర్తిత్వంలో దాదాపు తొమ్మిది గంటల పాటు వాషింగ్టన్‌లో జరిగిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం, ఇజ్రాయె ల్ – లెబనాన్ ప్రభుత్వాలు కాల్పుల విరమణను అమలు చేయడానికి అంగీకరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. అయితే ఈ శాంతి ఒప్పందం పూర్తిగా హెజ్‌బొల్లా సాయుధ దళాల చర్యలపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. లెబనాన్‌లోని 'సౌత్ లిటానీ' ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా సాయుధ బలగాలు పూర్తిగా తప్పుకోవాలి. అలాగే ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా జరిపే దాడులను పూర్తిగా నిలిపివేయాలి. అలా జరిగితేనే ఈ కాల్పుల విరమణ అమలులో ఉంటుంది. ఇందు కోసం సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ జోన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాంతాలపై ఏ ఇతర సాయుధ సంస్థల ప్రమేయం లేకుండా, లెబనాన్ అధికారిక సైన్యం మాత్రమే పూర్తి నియంత్రణను కలిగి ఉంటుంది. లెబనాన్ సైన్యం తన సార్వభౌమాధికారాన్ని దేశవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయడానికి వీలుగా అమెరికా తగిన సైనిక, వ్యూహాత్మక మద్దతును అంది స్తుంది. లెబనాన్ వ్యాప్తంగా హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా నిర్వీర్యం చేయడం, వారిని నిరాయుధులను చేయడం ద్వారానే తమ దేశ భద్రత సాధ్యమవుతుందని ఇజ్రాయెల్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. మరోవైపు, అంతర్జాతీయంగా గుర్తించిన తమ దేశ సరిహద్దులను గౌరవించాలని, ప్రాంతీయ సమగ్రత, పూర్తి ప్రభుత్వ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని లెబనాన్ కోరింది.

ఈ చర్చల్లో అమెరికా, ఇజ్రాయెల్, లెబనాన్ ప్రతినిధులు ఉమ్మడిగా పశ్చిమాసియాలో ఇరాన్ అనుసరిస్తున్న విధానాలను తప్పుపట్టారు. హెజ్‌బొల్లా వంటి ప్రాక్సీ గ్రూపులకు మద్దతు ఇస్తూ ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్న ఇరాన్ చర్యలను అన్నిపక్షాలూ తీవ్రంగా ఖండించాయి. ప్రస్తుతానికి ఈ ఒప్పందం ద్వారా తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించినప్పటికీ, ఇరు దేశాల మధ్య శాశ్వత, సమగ్ర శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి వీలుగా జూన్ 22 నుంచి మరోసారి రాజకీయ, భద్రతాపరమైన ఉన్నత స్థాయి చర్చలు జరపాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. అప్పటివరకు ఇరు దేశాల మధ్య సమన్వయకర్తగా అమెరికా వ్యవహరించనుంది.

# ఏదో ఒక రోజు ఖమేనీని కలుస్తా..

## ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు





అమెరికా: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలుచేశారు.తాను ఏదో ఒక రోజు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీని కలుస్తానన్నారు. ఇప్పటివరకు మొజ్తాబాను కలిసే అవకాశం రాలేదని చెప్పిన ట్రంప్.. ఆయన పాలనాతీరు ఏమీ బాగాలేదని, చాలా విషయా లలో వెనుకబడి ఉన్నారని విమర్శించారు.'నేను మొజ్తా బా ఖమేనీని కలవాలనుకుంటున్నాను. అదంతా ఎలా కుదురుతుందో తెలీదు. కానీ ఏదో ఒక రోజు మేమిద్దరం కలుస్తాం' అని ఓ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదని ఇప్పటికే అంగీకరించిందని.. అమెరికాతో చర్చల్లో ఖమేనీ పాల్గొంటున్నా రని చెప్పుకొచ్చారు ట్రంప్.

### అందుకే అలా అన్నా..

లెబనాన్ విషయంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో తీవ్ర వాగ్వాదం జరిగినట్లు ట్రంప్ అంగీకరించారు.లెబనాన్‌తో ఇజ్రాయెల్ చేస్తున్న పోరాటం పట్ల తాను సంతోషంగా లేనని ఆయన చెప్పారు. నెతన్యాహు.. లెబనాన్‌తో నిత్యం దాడులకు దిగడంపై తాను కలత చెందానని.. అందుకే ఆ సమయంలో మాట తూలానన్నారు. తనకు, నెతన్యాహుకు మధ్య మంచి సఖ్యత ఉందని ఆ అనుబంధాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడు గుర్తుచేసుకున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ చెలరేగిన నేపథ్యంలో ఇరాన్, అమెరికాల మధ్య సంప్రదింపులు దెబ్బతిన్నాయన్న వాదనలను ట్రంప్ ఖండించారు. కొన్ని రోజులుగా జోరుగా చర్చలు సాగుతున్నాయని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పునరుద్ఘాటించారు. 'ఈ చర్చలు ఎక్కడికి దారితీస్తాయో తెలియదు. కానీ నేను చెప్పినట్లుగా ఇరాన్ ఏదో ఓ విధంగా ఒప్పందం చేసుకోవాల్సిన సమయంవచ్చింది' అని పేర్కొన్నారు.

# ఇరాన్ సుప్రీం లీడర్ జీవించే ఉన్నారు..

## అమెరికా విదేశాంగ మంత్రి ప్రకటన!

వాషింగ్టన్: ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ప్రాణాలతోనే ఉన్నారని, అమెరికాతో జరుగుతున్న చర్చల ప్రక్రియలో ఆయన మరింత చురుగ్గా వ్యవహరిస్తున్నారని అమెరికావిదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టంచేశారు. అమెరికా సెనేట్ ఫారిన్ రిలేషన్స్ ప్యానెల్ ఎదుట ప్రసంగిస్తూ రూబియో ఈసంచలన విషయాలను వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడులలో అప్పటి ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ, పలువురు సైనిక కమాండర్లు మరణించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మార్చి నెలలో ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే, ఆ దాడుల సమయంలో మొజ్తబా ఖమేనీ కూడా తీవ్రంగా గాయపడ్డారని, ఆ తర్వాత ఆయన ఎక్కడా బహిరంగంగా కనిపించకపోవడంతో ఆయన జీవించే ఉన్నారా లేదా అనేదానిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా అంతర్జాతీయంగా అనేక ఊహాగానాలు చెలరేగిన సంగతితెలిసిందే. తాజాగా ఈఊహాగానాలకు తెరదించుతూ మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. 'మొజ్తబా ఖమేనీ ఇరాన్ అంతర్గత, దౌత్యపరమైన విషయాలలో ఏదో ఒక స్థాయిలో నిరంతరం జోక్యం చేసుకుంటున్నారనే సంకేతాలు మాకు అందుతున్నాయి. ప్రస్తుతం ఇరాన్ ఉన్న పరిస్థితుల్లో అక్కడి నాయకులు బహిరంగంగా బయటకు రావడం క్షేమకరం కాదని ఆ దేశ అంతర్గత వర్గాలు భావిస్తుండొచ్చు. కానీ, ఆయన కచ్చితంగా సజీవంగానే ఉన్నారు' అని రూబియో పేర్కొన్నారు. ఇరాన్ ప్రెసిడెంట్ మసౌద్ పెజెష్కియాన్‌కూడా ఇటీవల మాట్లాడుతూ..సుప్రీం లీడర్ అనుమతి లేకుండా దేశంలో ఎలాంటి కీలక నిర్ణయాలు జరగవని స్పష్టం చేశారు.







# కువైట్, బహ్రెయిన్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం

## కువైట్‌లో భారతీయుడి మృతి

దుబాయి: కువైట్, బహ్రెయిన్‌పై ఇరాన్ బుధవారం క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. తమ దేశంలోని వ్యూహాత్మకమైన ఖెష్మ్ ద్వీపంపై అమెరికా దాడికి ప్రతిస్పందనగానే తాము ఈ రెండు దేశాల్లోని అమెరికా మిలిటరీ స్థావరాలపై దాడులుచేసినట్లు ఇరాన్ అధికార వార్తా సంస్థ ఐఆర్ఐబీ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి, డ్రోన్ తాకటంతో కువైట్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ దాడిలో ఎయిర్ పోర్టులో పనిచేసే ఒక భారతీయుడు మరణించినట్లు, 63మంది గాయపడినట్లు ఆ దేశంలోని భారత ఎంబసీ ప్రకటించింది. ఇరాన్ దాడి నేపథ్యంలో కువైట్ విమానాశ్రయంలో కొన్ని గంటలపాటు కార్యకలాపాలను నిలిపివేశారు. మరోవైపు, కువైట్ విమానాశ్రయంపై ఇరాన్ దాడిని భారత్ ఖండించింది. సాధారణ పౌరులు, పౌర మౌలిక వసతు లను లక్ష్యంగా చేసుకోవటం సరికాదని సూచించింది.దాడిలో గాయపడ్డ 63 మందిలో కొందరు భారతీయులు ఉన్నారని వెల్లడించింది.

# ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయి: ట్రంప్

న్యూయార్క్: అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ దేశాల మధ్య చర్చలు నిలిచిపోయాయంటూ వస్తున్న వార్తలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య చర్చలు నిరంతరాయంగా సాగుతున్నాయని



అన్నారు. చర్చలు ఏ తీరానికి చేరుకుంటాయో ఎవరూ ఊహించలేరని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ 'ది ట్రూత్ సోషల్'లో మంగళవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్, అమెరికా దేశాల మధ్య చర్చలు నిలిచిపోయాయంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. రెండు దేశాల మధ్య చర్చలు నిరంతరాయంగా జరుగుతూనే ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం, మూడు రోజుల క్రితం, రెండు రోజుల క్రితం, నిన్న , ఈరోజు కూడా చర్చలు జరిగాయి. ఈ చర్చలు ఎక్కడికి దారితీస్తాయో ఎవరికీ తెలియదు. ఒప్పందం చేసుకోవడానికి ఇరాన్‌కు ఇదే సరైన సమయం. ఇరాన్ 47 ఏళ్లుగా ఒప్పందాన్ని సాగదీస్తోంది. ఇకపై దీన్ని ఇలాగే కొనసాగించడానికి అనుమతించబోము' అని తేల్చి చెప్పారు.

# హెచ్-1బీ వీసాకు 2.86 లక్షల దరఖాస్తులు

వాషింగ్టన్, జూన్ 3: అమెరికా జారీచేసే హెచ్–1బీ వీసాల కోసం దరఖాస్తుదారులు పోటెత్తారు. ఈ వీసా ఫీజును ట్రంప్ ప్రభుత్వం భారీగా పెంచినప్పటికీ ఆ ప్రభావం దరఖాస్తులపై ఏ మాత్రం పడలేదు. ఈ ఏడాది 2 లక్షల మందికి పైగా దరఖాస్తు దారులు లక్ష డాలర్ల రుసుము చెల్లించడానికి మొగ్గు చూపారని డిపార్ట్‌మెంట్ ఆఫ్‌హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) తెలిపింది."2026 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ హెచ్–1బీ వీసాల కోసం 2.86లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 2లక్షల మందికి పైగా దరఖాస్తు దారులు లక్ష డాలర్లు చెల్లించారు. దీనిద్వారా వారి దరఖాస్తులను వేగంగా ప్రాసెస్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఫీజు చెల్లించిన వారిదరఖాస్తులు సుమారు 15 రోజుల్లోగా ప్రాసెస్ అవుతాయి. మిగిలి నవాటి ప్రాసెసింగ్‌కు దాదాపు 7.5 నెలల సమయం పడుతుంది' అని డీహెచ్ఎస్ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్ పేర్కొన్నారు.

# క్రికెట్‌లో ... 'లార్డ్స్' అరుదైన ఘనత



క్రికెట్ అనగానే ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులకు ఠక్కున గుర్తొచ్చేది ఇంగ్లాండ్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ మైదానం. తాజాగా ఇంగ్లాండ్–న్యూజిలాండ్ జట్ల మధ్య ఇక్కడ తొలి టెస్టు ప్రారంభమైంది. ఈ క్రమంలో లార్డ్స్ క్రికెట్ స్టేడియం ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే ఒక అరుదైన మైలురాయిని అధిగమించి సరికొత్త ఘనత సాధించింది. ప్రపంచ క్రికెట్‌లో మరే ఇతర మైదానం కూడా దీని దరిదాపుల్లో లేకపోవడం విశేషం.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం మూడు క్రికెట్ మైదానాల్లో మాత్రమే వందకు పైగా టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. అందులో లార్డ్స్ మైదానానిదే తొలి స్థానం. తాజాగా ఇంగ్లాండ్– కివీస్ మధ్య జరుగుతున్న మ్యాచ్ లార్డ్స్ వేదికగా జరుగుతున్న 150వ టెస్ట్ మ్యాచ్. దీంతో ప్రపంచంలోనే 150 టెస్టుల మైలురాయిని చేరుకున్న ఏకైక మైదానంగా లార్డ్స్ సరికొత్త చరిత్ర సృష్టించింది.

లార్డ్స్ తర్వాత అత్యధిక టెస్టులు జరిగిన మైదానాల వివరాలు:

మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్: 118

సిడ్నీ క్రికెట్ గ్రౌండ్: 114

భారతదేశంలో అత్యధిక టెస్టు మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన రికార్డు కోల్‌కతాలోని ప్రసిద్ధ ఈడెన్ గార్డెన్స్ మైదానం పేరిట ఉంది. దేశంలోనే అతిపెద్ద స్టేడియాల్లో ఒకటైన ఈ మైదానంలో ఇప్పటివరకు కేవలం 43 టెస్టులు మాత్రమే జరిగాయి. భారత్‌లో ఇవే అత్యధికం కావడం గమనార్హం. ఈడెన్ గార్డెన్స్ తర్వాత చెన్నైలోని చేపాక్ స్టేడియం 35 టెస్టులతో రెండో స్థానంలో నిలిచింది.

# హైదరాబాదీ సునీల్ అరుదైన ఘనత

**మారథాన్‌లో ఏడు ఖండాలను చుట్టి వచ్చిన అథ్లెట్**




హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన సునీల్ రాబర్ట్ వుప్పుల మారథాన్‌లో అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోని మొత్తం ఏడు ఖండాలలో జరిగిన మారథాన్ పోటీలలో పాల్గొని అరుదైన రికార్డు సృష్టించారు. ఇప్పటిదాకా ఈ ఘనత సాధించిన 900 మంది అథ్లెట్లలో ఆయన ఒకరిగా నిలిచారు. ఆయన పాల్గొన్న చివరి మారథాన్ ఇటీవల దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ నగరంలో ముగిసింది. దాదాపు 15 ఏళ్ల పాటు వివిధ ఖండాల్లో భిన్న వాతావరణ పరిస్థితులను, సవాళ్లను ఎదుర్కొంటూ ఆయన మారథాన్లలో పాల్గొన్నారు. న్యూయార్క్ నగరంలో 2011లో సునీల్ తొలిసారి మారథాన్‌లో పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంసీజే, ఎంబీఏ కోర్సులను అభ్యసించిన 57 ఏండ్ల సునీల్ టీసీఎస్, ఒరాకిల్, టీసీఎస్ వంటి బహుళజాతి కంపెనీల్లో పనిచేశారు. అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడిన ఆయన ప్రస్తుతం వివిధ కంపెనీలకు కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారు.

# ఆ సీక్రెట్ ఇదే

**శుభ్‌మన్ గిల్ పరుగుల వరదపై అశ్విన్ విశ్లేషణ**



భారత యువ క్రికెటర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన బ్యాటింగ్ టెక్నిక్‌ను మార్చుకోవడం వల్లే ప్రస్తుతం పరుగుల వరద పారిస్తున్నాడని భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డారు. ఈ నెల 6వ తేదీ నుంచి ముల్లాన్‌పూర్ వేదికగా భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య ఏకైక టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ విధానంపై అశ్విన్ ఆసక్తికర విశ్లేషణ చేశారు. "శుభ్‌మన్ గిల్ ఇంగ్లాండ్‌లో అద్భుతమైన సిరీస్ ఆడాడు. కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలోనూ రాణించాడు. కఠిన పరిస్థితుల్లో పరుగుల సాధించి, కెప్టెన్సీ ఒత్తిడిని ఎంతో పరిణతితో నిర్వహించాడు. అది అతని స్థాయిని, ఎక్కువసేపు బ్యాటింగ్ చేయగల సామర్థ్యాన్ని చూపించింది" అని అశ్విన్ కొనియాడారు.

### ఆ 'కీలక టెక్నిక్' ఏంటి?

గిల్ తన టెక్నిక్‌పై, ముఖ్యంగా బ్యాట్‌ను ప్యాడ్‌కు దగ్గరగా ఉంచడంపై చాలా కష్టపడ్డాడు.

దీనివల్ల బ్యాట్, ప్యాడ్ మధ్య దూరం తగ్గి, స్వింగ్ అవుతున్న బంతిని మరింత సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతున్నాడు.

నాలుగో స్థానానికి మారిన గిల్... ఆ పొజిషన్‌లో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లోనే 950 పరుగులు చేయడం విశేషం.

కెప్టెన్‌గా స్వదేశంలో బ్యాటింగ్‌లో గిల్ ఇంకా తన పూర్తి సత్తా చాటాల్సి ఉందని, అయితే అతని బ్యాటింగ్ శైలిలో వచ్చిన ఈ మార్పుతో స్వదేశంలో కూడా అద్భుతంగా చెలరేగిపోతాడని ఆశిస్తున్నట్లు అశ్విన్ పేర్కొన్నారు. టెస్ట్ క్రికెట్‌లో అతని విజయం భారత టెస్ట్ జట్టు రూపరేఖలను మార్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని, రాబోయే కాలంలో బ్యాటింగ్ లైనప్‌ను ముందుండి నడిపించగల సత్తా గిల్‌కు ఉందని స్పష్టం చేశారు.

### మూడో స్పిన్నర్‌గా రేసులో ఎవరు?

ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే టెస్ట్ మ్యాచ్‌కు తుది జట్టు కూర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ జట్టులో కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌లకు చోటు దక్కడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. అయితే తొలిసారి జట్టులో చోటు దక్కించుకున్న మానవ్ సుతార్, హర్ష్ దూబేలలో ఎవరిని మూడో స్పిన్నర్‌గా ఎంచుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఈ సీజన్‌లో దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన హర్ష్ దూబేకు అవకాశం ఇస్తే బాగుంటుందని అశ్విన్ అభిప్రాయపడ్డారు.

# ఆ కన్నీళ్లకు అదిరిపోయే రివార్డ్

ఐపీఎల్ సమయంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఆటోగ్రాఫ్ ఇవ్వలేదని ఒక చిన్నారి తీవ్రంగా బాధపడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆ బాలుడికి నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. చాలా మంది అతడికి ప్రత్యేకంగా గిఫ్టులు కూడా పంపించారు. తాజాగా ఈ ఉదంతంపై స్పందించిన ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మోదీ... ఆ కోహ్లీ వీరాభిమానికి ఒక అపురూపమైన బహుమతి పంపించారు.



### విరాట్ సంతకం ఉన్న తొలి సీజన్ బ్యాట్

విరాట్ కోహ్లీకి వీరాభిమాని అయిన ఆ బాలుడి పేరు యుగ్‌వీర్ బుధిరాజా. లలిత్ మోదీ గిఫ్ట్ పంపిన విషయాన్ని సదరు బాలుడు ఒక వీడియో ద్వారా సోషల్ మీడియాలో పంచుకోగా, దానిని లలిత్ మోదీ రీపోస్ట్ చేస్తూ ట్విట్టర్ వేదికగా స్పందించారు.

"నా దగ్గర విరాట్ కోహ్లీ ఒక్కడే సంతకం చేసిన బ్యాట్ లేదు. కానీ ఐపీఎల్ తొలి సీజన్ (2008)లో ఆడిన ఆటగాళ్లందరూ ఆటోగ్రాఫ్ చేసిన ఒక అరుదైన బ్యాట్ ఉంది. అందులో విరాట్ కోహ్లీ సైన్ (సంతకం) కూడా ఉంది. దానిని నేను యుగ్‌వీర్‌కు బహుమతిగా పంపించాను. త్వరలోనే ఆ బ్యాట్‌ను అతడికి వ్యక్తిగతంగా అందించేందుకు ఒకరిని పురమాయించాను" అని లలిత్ మోదీ తెలిపారు.

### థాంక్యూ లలిత్ మోదీ సార్..

"థాంక్యూ లలిత్ మోదీ సార్. మీరు చేసిన వీడియో కాల్‌తోనే నా రోజు (ఉదయం) మొదలైంది. ఇది నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని క్షణం. నన్ను గుర్తించి ఇంతటి గొప్ప బహుమతి పంపించినందుకు చాలా సంతోషంగా ఉంది.

మీ నుంచి ఆ బ్యాట్‌ను నేరుగా అందుకోవడానికి ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను" అని యుగ్‌వీర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు.

# టీమిండియా టీ20 జట్టుకు కొత్త కెప్టెన్

## రేసులో తెలుగు కుర్రాడు తిలక్ వర్మ!



మరో రెండు రోజుల్లో టీమిండియాకు సంబంధించి ఒక కీలక ప్రకటన రానుంది. జింబాబ్వే, ఇంగ్లాండ్‌లతో జరగబోయే టీ20 సిరీస్‌లతో పాటు ఆసియా గేమ్స్ బరిలోకి దిగే భారత జట్లను బీసీసీఐ సెలక్షన్ కమిటీ త్వరలోనే ప్రకటించనుంది. అయితే ఇదే సమయంలో భారత టీ20 జట్టుకు కొత్త కెప్టెన్ రావడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. రెగ్యులర్ సారథి సూర్యకుమార్ యాదవ్ జట్టును అద్భుతంగా నడిపించినప్పటికీ ఇటీవలి కాలంలో బ్యాటింగ్‌లో పెద్దగా ప్రభావం చూపడం లేదు. దీంతో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కొత్త సారథి వైపు సెలక్షన్ కమిటీ మొగ్గు చూపుతున్నట్టు వార్తలు వస్తున్నాయి.

### రేసులో తెలుగు కుర్రాడు.. కెప్టెన్సీ కోసం గట్టి పోటీ!

గత టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను అద్భుతంగా నడిపించిన సూర్యకుమార్ యాదవ్ ఛాంపియన్‌గా నిలిచాడు. ఆ తర్వాత ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున ఆడినప్పటికీ నిలకడైన ఆటతీరు ప్రదర్శించడంలో విఫలమయ్యాడు. 2028లో టీ20 ప్రపంచ కప్, లాస్ ఏంజెల్స్ వేదికగా ఒలింపిక్స్ జరగనున్నాయి. అందుకోసం జట్టును ఇప్పుడే సిద్ధం చేయాలని ప్రధాన కోచ్‌తో పాటు సెలక్టర్లు భావిస్తున్నారు.

కొత్త సారథిగా ఇటీవల పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు అవకాశాలు ఉన్నాయని అంతా భావిస్తున్నారు. కానీ అనూహ్యంగా తెలుగు కుర్రాడు తిలక్ వర్మ పేరు రేసులోకి రావడం విశేషం. అతడితో పాటు ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. అయితే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, సెలెక్టర్ల మధ్య కెప్టెన్సీ విషయంలో ఇంకా ఒక స్పష్టమైన నిర్ణయం రాలేదని తెలుస్తోంది.

### ఆసియా గేమ్స్ స్క్వాడ్‌లో సూర్య, గిల్‌లకు దక్కని చోటు

ఇప్పటికే ఆసియా గేమ్స్‌కు సంబంధించిన ప్రాబబుల్స్‌ను బీసీసీఐ ప్రకటించింది. అయితే ఈ జాబితాలో సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్‌లకు చోటు దక్కలేదు. వెస్టిండీస్ సిరీస్‌తో పాటు 2028 ఒలింపిక్స్ గేమ్స్, టీ20 వరల్డ్‌కప్ సన్నద్ధత నేపథ్యంలో వర్క్‌లోడ్ దృష్ట్యా సూర్యకుమార్‌ను ఆసియా గేమ్స్‌కు ఎంపిక చేయలేదని బీసీసీఐ స్పష్టం చేసింది.

ఇప్పుడు కొత్త కెప్టెన్ ప్రకటన కేవలం ఆసియా గేమ్స్ వరకేనా? లేక జింబాబ్వే, ఇంగ్లాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌లకు కూడానా? అనేది మరో రెండు రోజుల్లో తేలిపోనుంది. ఆసియా గేమ్స్ కోసం పంపే జట్టులో సీనియర్లు ఎవరూ ఆడే అవకాశాలు లేవు. అయితే ఇంగ్లాండ్‌తో పోరుకు మాత్రం పూర్తిస్థాయి బలమైన జట్టు వెళ్లడం ఖాయం. మరి సూర్య స్థానంలో ఎవరికి అవకాశం వస్తుందో చూడాలి.

చైతన్య రథం
సినిమా
శుక్రవారం 5 జూన్ 2026 X

## పెద్ది రిలీజ్.. థియేటర్‌లో ఉపాసన రచ్చ




రామ్ చరణ్ జంటగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన స్పోర్ట్స్ డ్రామా చిత్రం పెద్ది. గురువారం ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లకు వచ్చేసింది. అయితే.. ఓ రోజు ముందే బుధవారం సాయంత్రమే చాలా ప్రాంతాలలో బెనిఫిట్ షోలు, ప్రీమియర్స్ ప్రదర్శించగా ప్రేక్షకులు టికెట్ల కోసం ఎగబడ్డారు. బీ, సీ సెంటర్ల నుంచి సినీ, రాజకీయ సెలబ్రిటీల వరకు అంతా పెద్ది మానియాలోనే మునిగి పోయారు. సినిమా ఎప్పుడెప్పుడు చూడాలా అని ఉత్సాహం చూపించారు. ఈ నేపథ్యంలో అనేకమంది సెలబ్రిటీలతో పాటు స్వయానా రామ్ చరణ్ సతీమణి ఉపాసన సైతం పెద్ది సినిమాను చూసేందుకు తండ్రితో కలిసి వచ్చి థియేటర్‌లో హంగామా చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేగాక ఫ్యాన్స్‌కు దీటుగా విజిల్స్ వేస్తూ, పేపర్లు ఎగురవేస్తు రచ్చ చేశారు. ఇందుకు సంబంధించి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా ఉపాసన కనిపించినంతా క్లాస్ ఏం కాదని ఊర మాస్ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## ‘వడ చెన్నై’ యూనివర్స్‌లో బిగ్ ట్విస్ట్!



అభిమానుల్లో మల్టీస్టారర్ చిత్రాలకు ఉండే క్రేజ్ వేరు. అయితే ఒక సీనియర్ స్టార్, మరో యంగ్ హీరో కలిసి నటించడం మనం తరచూ చూస్తూనే ఉంటాం. కానీ, గత రెండు దశాబ్దాలుగా బాక్సాఫీస్ దగ్గర నువ్వా-నేనా అంటూ పోటీ పడుతున్న ఇద్దరు స్టార్ హీరోస్ ఒకే స్క్రీన్‌ను పంచుకోబోతున్నారన్న న్యూస్ హాట్ టాపిక్‌గా మారింది. తమిళ చిత్ర పరిశ్రమలో రజనీకాంత్ - కమల్ హాసన్, విజయ్ - అజిత్ మధ్య ఎలాంటి నెక్-టు-నెక్ కాంపిటీషన్ ఉండేదో.. గత 20 ఏళ్లుగా ధనుష్, శింబు మధ్య కూడా అలాంటి క్రేజీ రైవల్రీ నడుస్తోంది. ఒకరిది విలక్షణమైన నటనతో కూడిన అద్భుతమైన మాస్ ఇమేజ్ అయితే.. మరొకరిది స్టైల్, స్వాగ్‌తో కూడిన ఊరమాస్ ఫాలోయింగ్. దశాబ్దాలుగా కోలీవుడ్‌లో రాణిస్తున్న ఈ ఇద్దరు మాస్ ఐకాన్స్ ఇప్పుడు ఒకే సినిమాలో కనిపించబోతున్నారనే ప్రచారం ఇద్దరి అభిమానుల్లో జోష్ నింపుతోంది. తమిళ ఇండస్ట్రీలో కాదు, టోటల్ సౌత్ సినిమాలోనే మోస్ట్ అవేటెడ్ కాంబినేషన్‌గా మారిన ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తోంది మరెవరో కాదు కల్ట్ డైరెక్టర్ వెట్రిమారన్ అట! ధనుష్, వెట్రిమారన్‌లది టాలీవుడ్‌లో రాజమౌళి, జూ. ఎన్టీఆర్ లాంటి ఒక అన్‌స్టాపబుల్ కాంబినేషన్. వీరు కలిసి చేసిన ‘పొల్లాధవన్, ఆడుకలం, అసురన్, వడ చెన్నై’... నాలుగు సినిమాలు బాక్సాఫీస్‌ను షేక్ చేయడమే కాకుండా జాతీయ అవార్డులను కూడా కొల్లగొట్టాయి. ప్రస్తుతం వెట్రిమారన్ శింబుతో ‘అరసన్’ మూవీ చేస్తున్నాడు. అయితే ఈ సినిమా గతంలో ధనుష్ చేసిన క్లాసిక్ హిట్ ‘వడ చెన్నై’ గ్యాంగ్ స్టర్ ప్రపంచంతో ముడిపడి ఉంటుందని ఇండస్ట్రీ టాక్. ‘వడ చెన్నై’లో ఐకానిక్ రోల్ పోషించిన ధనుష్‌ను... శింబు చేస్తున్న మూవీలో పవర్‌ఫుల్ గెస్ట్ రోల్ కోసం సంప్రదించినట్లు తెలుస్తోంది. స్క్రీన్ పై కనిపించేది కొన్ని నిమిషాలే అయినప్పటికీ..కథను పూర్తిగా మలుపు తిప్పే కీలకమైన పాత్రగా డిజైన్ చేశారని కోలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. ధనుష్ నటన, శింబు స్వాగ్, వెట్రిమారన్ మేకింగ్... ఈ మూడు ఎలిమెంట్స్ కలిస్తే అది కేవలం సినిమా కాదు, బాక్సాఫీస్ దగ్గర ఒక సునామీనే అవుతుందని ఫ్యాన్స్ లెక్కలు వేసుకుంటున్నారు. దశాబ్దాలుగా ఫ్యాన్స్ ఎదురు చూస్తున్న ఈకాంబో గనుక అఫీషియల్‌గా అనౌన్స్ అయితే... తమిళ సినిమా రికార్డులన్నీ తిరగరాయొచ్చని అభిమానులు ఆశపడుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో!

## డ్రాగన్ సంచనాల కోసం వెయిటింగ్: ఎన్టీఆర్






మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, క్రేజీ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా మూవీ ‘డ్రాగన్’. ఫస్ట్ టైమ్ ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై నందమూరి అభిమానుల్లోనూ, యాక్షన్ ప్రియుల్లోనూ భారీగా అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే జూన్ 4వ తేదీన దర్శకుడు ప్రశాంత్ నీల్ పుట్టినరోజును పురస్కరించుకుని ఎన్టీఆర్ తన సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక ప్రత్యేక పోస్ట్ ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. తారక్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో షేర్ చేసిన ఈ బర్త్‌డే విష్‌లో ప్రశాంత్ నీల్‌పై తనకున్న గౌరవాన్ని, నమ్మకాన్ని ఎంతో అద్భుతంగా వ్యక్తపరిచారు. “హ్యాపీ బర్త్‌డే డైరెక్టర్ గారూ... మీరు వెండితెరపై ఆవిష్కరించే కథల లాగే ఈ ఏడాది కూడా మీకు అంతే గ్రాండ్‌గా, అద్భుతంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను” అంటూ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. అంతేకాకుండా “ప్రశాంత్... మన కాంబినేషన్ మునుముందు ఎలాంటి సంచలనాలను దాచి ఉంచిందో చూడటానికి నేను ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాను!” అంటూ ఎన్టీఆర్ చేసిన కామెంట్ ఈ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ ఎంత పవర్‌ఫుల్‌గా సిద్ధమైందో పరోక్షంగా స్పష్టం చేస్తోంది. ఈ పుట్టినరోజు శుభాకాం క్షల సందేశంతో పాటు జూనియర్ ఎన్టీఆర్ షేర్ చేసిన ఒక ప్రత్యేకమైన వర్కింగ్ స్టిల్ ఇప్పుడు అందరి దృష్టిని విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమాలో డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఒక భారీ యాక్షన్ సీక్వెన్స్ జరుగుతున్న సెట్స్‌లో చేతిలో మైక్ పట్టుకుని సీరియస్‌గా ఆలోచిస్తూ నడుస్తూ కనిపిస్తున్నారు. ఆయన వెనుక భాగంలో కొందరు మనుషులు కింద పడిపోయి ఉండటం, నేలపై మంటలు మండుతుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. నీల్ మార్క్ సిగ్నేచర్ స్టైల్ అయిన ‘రా అండ్ రస్టిక్’ యాక్షన్ వాతావరణం ఈ స్టిల్‌లో స్పష్టంగా కనిపిస్తుండటంతో, ఎన్టీఆర్‌ను ఆయన ఏ రేంజ్‌లో చూపించబోతున్నారోననే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో శరవేగంగా పెరుగుతోంది. కేజీఎఫ్ సిరీస్, సలార్ వంటి సూపర్ హిట్లతో బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన ప్రశాంత్ నీల్.. తన సినిమాల్లో హీరోలను అత్యంత పవర్ ఫుల్ ఎలివేషన్లతో ప్రెజెంట్ చేయడంలో సిద్ధహస్తుడు. మరోవైపు యంగ్ టైగర్ ఎన్టీఆర్ తన ఎదురేలేని నటన, హై-ఎనర్జీ, పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీతో ఏ పాత్రలోనైనా విశ్వరూపం చూపించగల నేర్పరి. ఈ ఇద్దరు పవర్‌హౌస్ ప్రతిభావంతులు ఒకే ప్రాజెక్ట్ కోసం చేతులు కలపడం వల్ల.. ఈ చిత్రం ఇండియన్ సినిమాని మరోసారి గ్లోబల్ స్థాయికి తీసుకువెళ్లే కమర్షియల్ వండర్‌గా నిలుస్తుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ముఖ్యంగా తారక్ తన కామెంట్‌లో ‘సంచలనాలను దాచి పెట్టామనే’ హింట్ ఇవ్వడంతో, వాటిని ఫ్యాన్స్ కోసం తొందరలోనే రివీల్ చేస్తారని ఆశిస్తున్నారు. ప్రశాంత్ నీల్ చిత్రాల్లో ఉండే ప్రత్యేకమైన డార్క్ అండ్ రస్టిక్ యాక్షన్ ప్రపంచం, ఎన్టీఆర్ లాంటి హై-వోల్టేజ్ ఎమోషనల్ స్టార్‌తో తోడైతే బాక్సాఫీస్ రికార్డులు బద్దలవ్వడమే కాకుండా, ఇండియన్ కమర్షియల్ సినిమా మేకింగ్ శైలిలోనే ఒక సరికొత్త ట్రెండ్ సెట్ కావడం ఖాయంగా కనిపిస్తోంది.

## రజనీ సినిమా.. మళ్ళీ మారిన డైరెక్టర్



సూపర్ స్టార్ రజనీకాంత్ సినిమాకు ఇంకా దర్శకుడు దొరకలేదా అంటే నిజమే అని అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. కమల్ హాసన్ నిర్మాణంలో రజనీ నటిస్తోన్న చిత్రం తలైవర్ 173. ఈ సినిమా ఏ ముహూర్తాన అనౌన్స్ చేశారో కానీ, ఇప్పటివరకు ఒక్క దర్శకుడు కూడా ఫైనల్ కాలేదు. మొదట సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నాడు అంటూ కమల్- రజనీ అధికారికంగా ప్రకటించారు. కానీ, ఇంత పెద్ద సినిమాను నిర్మించడం, అంచనాలను అందుకోవడం తనకు ఎంతో ఒత్తిడితో కూడుకున్న వ్యవహారంగా అనిపించడంతో ఆయన ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నాడు. ఇక సుందర్ సి తరువాత తలైవర్ 173 ని ఎవరు హ్యాండిల్ చేస్తారా అని ఎదురు చూస్తుంటే.. డాన్ సినిమా ఫేమ్ యంగ్ డైరెక్టర్ శిబి చక్రవర్తిని దర్శకుడిగా ఎంపిక చేసి, ప్రీ-ప్రొడక్షన్ పనులను కూడా మొదలుపెట్టారు. కానీ కొన్ని రోజులుగా స్క్రిప్ట్ పరమైన మార్పులు, ఇతర కారణాల వల్ల శిబి చక్రవర్తి కూడా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నుండి సైలెంట్‌గా తప్పుకున్నట్లు ఇండస్ట్రీలో గట్టిగా వినిపించాయి. దాని మీద మేకర్స్ అధికారిక ప్రకటన కూడా ఇవ్వలేదు. ఇలా డైరెక్టర్లు రావడం, పోవడం తప్ప ఒక్కరు కూడా రజనీని డైరెక్ట్ చేయడానికి ముందుకు రావడం లేదు. అయితే గత కొన్నిరోజులుగా ఓ మై కడవులే, డ్రాగన్ వంటి చిత్రాలతో సక్సెస్ అందుకున్న యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు .. ఈ సినిమా బాధ్యతలు అందుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నిజంగా మరోసారి రజనీ సినిమాకు డైరెక్టర్ మారాడా..? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ఇద్దరు డైరెక్టర్ల తరువాత కమల్.. అశ్వత్ మారిముత్తునే ఫైనల్ చేసినట్లు సమాచారం. అయితే శిబిని వదిలేసినట్లేనా అంటే కాదంట. ఈ సినిమా కాకుండా కమల్ ప్రొడక్షన్ లో మరో సినిమా చేసే ఛాన్స్ ఇచ్చారని అంటున్నారు. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది. ఇప్పుడైనా తలైవర్ 173 సెట్స్ పైకి వెళ్తుందా.. ? ఈ డైరెక్టర్‌ని కూడా తొలగిస్తారా.. ? అనేది చూడాలి.

## సరికొత్త అవతారంలో బాలయ్య

‘వీరసింహారెడ్డి’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ యాక్షన్ చిత్రం ‘ఎన్‌బీకే111 (వర్కింగ్ టైటిల్)’ షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతోంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. అయితే బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 10న ఓ భారీ అప్డేట్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. భారీ ఎన్‌బీకే అక్షరాలు ఇనుప గొలుసులతో బంధించినట్లుగా కనిపిస్తూ, బాలయ్య పవర్‌ను ప్రెజెంట్ చేస్తున్నాయి. ‘నో మోర్ వింటేజ్, ఓన్లీ న్యూ ఏజ్’ అనే ట్యాగ్‌లైన్ బాలకృష్ణను సరికొత్త అవతారంలో చూపించబోతున్న సంకేతాలు ఇస్తోంది. మరోవైపు ఈ సినిమాలో తాను కూడా భాగమవుతున్నట్లు ఇటీవలే మంచు మనోజ్ ప్రకటించారు. కథలో కీలకమైన, పవర్‌ఫుల్ పాత్రలో మనోజ్ కనిపించనున్నారు. కాగా, మాస్ ఎంటర్‌టైనర్లను తెరకెక్కించ డంలో తనదైన ముద్ర వేసిన గోపీచంద్ మలినేని, మరోసారి బాలయ్య అభిమానుల కోసం హైవోల్టేజ్ యాక్షన్‌తో పాటు బలమైన భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

